


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

సంపుటి 09, సంచిక: 307 | బుధవారం | 07-10-2026 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00




నిరసనలో సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

## సిఇసి రాజీనామాకు ఢిల్లీ వీధుల్లో

# ప్రతిపక్ష ఎంపిల బైఠాయింపు



ఎస్ఎం సిన్హా
న్యూఢిల్లీ

## ఇండియా కూటమి ఎంపిల 'సేవ్ డెమోక్రసీ' పాదయాత్ర

- పార్లమెంట్ నుంచి నిర్వాచన్ సదన్‌కు వెళ్తుండగా పోలీసులు అడ్డగింత
- బారికేడ్లపైకి ఎక్కి జాతీయ జెండా ప్రదర్శించిన ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ
- ఎస్‌పి, టిఎంసి, వామపక్ష పార్టీల ఎంపిలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**ఆకాశవాణి భవన్ వద్ద 9గంటల పాటు ధర్నా**
**రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా పలువురు ఎంపిలు అరెస్టు బస్సుల్లో తరలింపు**

**న్యూఢిల్లీ:** ఓటు చోరీ అంశం, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సిఇసి) ఏకపక్ష నిర్ణయాలపై రగులుతున్న ఇండియా కూటమి పార్టీలు మంగళవారం ఎన్నికల సంఘం (ఇసి) కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేపట్టాయి. సేవ్ డెమోక్రసీ పేరుతో పార్లమెంట్ నుంచి నిర్వచన్ సదన్ వరకు విపక్ష ఎంపిలు భారీ పాదయాత్ర చేపట్టారు. చేతుల్లో 'సేవ్ డెమాక్రసీ' భారీ బ్యానర్లు పట్టుకుని నినాదాలు చేస్తూ దూసుకెళ్లారు. సర్ పేరుతో ఏకంగా 13 కోట్ల ఓట్లను గల్లంతు చేశారని ఆరోపిస్తూ సిఇసి జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. పాదయాత్ర దృష్ట్యా పలు ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలు, మొబైల్ సేవలు బంద్ చేశారు. ఇండియా కూటమి పార్టీలు చేపట్టిన పాదయాత్రతో దేశ రాజధానిలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. అయితే పాదయాత్ర సందర్భంగా హై డ్రామా చోటుచేసుకుంది. కేవలం 300 మీటర్ల దూరంలో ఉన్న ఎన్నికల సంఘం కార్యాలయం వైపు ప్రతిపక్ష ఎంపిలు తరువాయి 8లో



## ఓట్ చోర్..గద్దీ ఛోడ్

### ఇండియా కూటమి నిరసనలో వామపక్ష ఎంపిలు అరెస్టు

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ ''ఇండియా కూటమి'' పార్టీలు ప్రారంభించిన నిరసన కార్యక్రమంలో భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) భాగస్వామిగా చేరింది.పార్లమెంటు మకరద్వారం నుండి నిర్వచన్ సదన్‌లోని కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయం వరకూ ప్రతిపక్ష కూటమి పార్టీలు ఐక్యంగా మంగళవారం నిర్వహించిన నిరసన ప్రదర్శనలో సిపిఐ నాయకులు,కార్యకర్తలు భారీస్థాయిలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఓట్ చోర్...గద్దీ ఛోడ్ (ఓటు దొంగ...గద్దె దిగు) తరువాయి 8లో

## ప్రజాస్వామ్య పరిరక్షణకే మా పోరాటం

### తప్పుచేసిన వారెవరూ తప్పించుకోలేరు : రాహుల్ హెచ్చరిక

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్... చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ సహాయంతో 'ఓట్ల దొంగతనం' చేసి దేశాన్ని హైజాక్ చేశారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దేశద్రోహానికి పాల్పడినందుకు వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఎవరూ బాధ్యత నుండి తప్పించుకోలేరని గాంధీ అన్నారు. 'బిజెపి ఏం చెబుతుందనే దానితో నాకు సంబంధం లేదు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికే నేను ఇక్కడ ఉన్నాను. నాతో పాటు 300 మంది లోక్‌సభ, రాజ్యసభ ఎంపిలు వచ్చారు, వారూ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారు' అని లోక్‌సభలో ప్రతిపక్ష తరువాయి 8లో



## ఎర్రవల్లి భూముల్లో 45 ఎకరాలెక్కడ?

- తేల్చాలని అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్ రెడ్డి
- మాజీ సిఎం కెసిఆర్ కుటుంబానికి నోటీసులు

ప్రజాపక్షం/హైదరాబాద్

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల రెవెన్యూ రికార్డుల్లో ఉన్న మరో 45 ఎకరాల భూమి ఎక్కడుందో తేల్చాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల పరిధిలోని భూములపై మంగళవారం సిఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. ఎర్రవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 325లో మొత్తం 388 ఎకరాల భూమి ఉన్నట్లు రికార్డుల్లో ఉండగా, రెవెన్యూ అధికారుల క్షేత్రస్థాయి సర్వేలో 343 ఎకరాలు మాత్రమే గుర్తించినట్లు అధికారులు సిఎంకు వివరించారు. అయితే రికార్డుల్లో ఉన్న మరో 45 ఎకరాల భూమి ఎక్కడుందో తేల్చాలని అధికారులను సిఎం ఆదేశించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది. భూమి హద్దులు, యాజమాన్య వివరాలను నిర్ధారించేందుకు ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల్లో సర్వే నోటిఫికేషన్ జారీ చేయాలని అధికారులు నిర్ణయించారు. సర్వే నంబర్ 325 భూముల సరిహద్దుల్లో భూములు కలిగి ఉన్న మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు, ఆయన కుటుంబ సభ్యులకు తమ వద్ద ఉన్న రెవెన్యూ రికార్డులను సమర్పించాలని నోటీసులు జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. సర్వే నంబర్ 325లోని భూమిని గుర్తించిన అనంతరం స్థానికంగా అర్హులైన రైతులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదే సర్వే నంబర్‌లో తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాల కోసం ప్రత్యేకంగా తెలంగాణ అమరవీరుల కాలనీ నిర్మించాలని సిఎం ఆదేశించారు. అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, అన్ని మౌలిక వసతులతో కాలనీని అభివృద్ధి చేయాలని సిఎం సూచించారు. కాలనీ నిర్మాణ బాధ్యతలను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖకు అప్పగించాలని సిఎం ఆదేశించారు. వచ్చే ఏడాది జూన్ 2వ తేదీ లోగా అమరవీరుల కాలనీ నిర్మాణాన్ని పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

## 'ఒకే దేశం, ఒకే ఎన్నిక వెనుక కుట్ర

07

బిజెపి సర్కార్‌పై సిజెపి మండిపాటు

## 10న జంతర్‌మంతర్ నిరసనలో పాల్గొంటాం

ఐదు వామపక్ష విద్యార్థి సంఘాల ప్రకటన



## జ్ఞానేశ్ కుమార్ తప్పుకో...

- తక్షణమే కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ పదవికి రాజీనామా చేయాలి
- ఇండియా కూటమి పార్టీల డిమాండ్
- రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ వద్ద ధర్నాలు, నిరసన ప్రదర్శనలు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్ల హక్కులను హరిస్తూ ఎన్నికల ప్రక్రియపై విశ్వసనీయత కోల్పోయేలా వ్యవహరిస్తూ, రాజ్యాంగాన్ని ధిక్కరిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని ఇండియా కూటమి పార్టీలు డిమాండ్ చేశాయి. సేవ్ డెమోక్రసి పేరుతో మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహించాయి. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, సర్‌ను రద్దు చేయాలని, ఇవిఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వహించాలని ర్యాలీ నిర్వహించాయి. దీంతో పోలీసులు విపక్ష నేతల ర్యాలీలను అడ్డుకున్నారు. కేంద్ర సర్కార్, తరువాయి 8లో



## ఇయు, ఎన్ఎంయుతోనే ఆర్‌టిసి కార్మికులకు భరోసా

- ఎర్రజెండా అండతోనే సమస్యలు పరిష్కారం
- బస్సు, కాగడా గుర్తులకు ఓటు వేయండి : ఎంఎల్ఎ కూనంనేని

ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం

టిజిఎస్ ఆర్‌టిసి గుర్తింపు సంఘం ఎన్నికల్లో బస్సు, కాగడా గుర్తులకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఈనెల 9న జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని టిజిఎస్ ఆర్‌టిసి డిపో ఎదుట గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన తరువాయి 8లో

## ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా విద్యార్థులకు అల్పాహారం

- రాష్ట్ర వ్యాప్తంగా 27లక్షల మందికి ఏకకాలంలో అందిస్తున్నాం
- పౌష్టికాహారం ఉచితం కాదు... భవిష్యత మానవ వనరులపై పెట్టుబడి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి
- సూర్యాపేట జిల్లా మునగాల మండలంలో మెగా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌కు శంకుస్థాపన

ప్రజాపక్షం/మునగాల



రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజు వేడివేడి అల్పాహారం అందించే కార్యక్రమం ప్రపంచంలో మరెక్కడా లేదని, తెలంగాణలోనే ఈ వినూత్న పథకాన్ని అమలు చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం ఉచితం కాదని, అది రాష్ట్ర భవిష్యత్ మానవ వనరులపై చేస్తున్న పెట్టుబడి అని పేర్కొన్నారు. పిల్లలు తరువాయి 8లో



## ఏకాకి అయిన సిఇసి జ్ఞానేశ్ కుమార్

తటస్థతకు ప్రతీకగా గౌరవం పొందాల్సిన భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ), దాని ప్రధానాధికారి (సిఇసి) జ్ఞానేశ్‌కుమార్ నడవడిక కారణంగా ఇవాళ ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా చెప్పుచేతల్లోని పనిముట్టు అనే ఆరోపణకు గురై ప్రజలముందు ఏకాకిగా నిలబడటం ఉజ్వలమైన భారత ప్రజాతంత్ర చరిత్రలో అత్యంత దురదృష్టకరమైన సందర్భం. యావత్ రాజకీయ వ్యవస్థలో ఒక్క బిజెపి, దాని ఎన్‌డిఎ భాగస్వాములు తప్ప సిఇసిని బలపరిచేవారు లేరు. ఒకవైపు, ఓట్లు రివిజన్‌ను ఓటర్ల ఏరివేతగా మార్చిన ఆయన కుత్సితానికి వ్యతిరేకంగా యావత్ ప్రతిపక్షం (కలగలిసికట్టుగా, వేర్వేరుగా), విద్యార్థులు, జన్‌జీలు, పౌరసమాజ సంస్థలు ఈనెల 2 నుంచి ప్రారంభించిన ఆందోళన మంగళవారం ఐదవరోజుకు చేరుకుంది. 230 మందికిపైగా ప్రతిపక్ష ఎంపిలు విజ్ఞాపన పత్రం సమర్పించేందుకై ఎన్నికల కమిషన్ కార్యాలయానికి తలపెట్టిన ప్రదర్శనను పోలీసులు నిలువరించారు. కొందరిని బస్సుల్లో తరలించారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ నాయకత్వంలో చాలామంది ఎంపిలు ఆకాశవాణి భవన్ ఆవరణలో బైఠాయించారు. వారిని ఖాళీ చేయించేందుకు పోలీసు అధికారులు పలుమార్లు చేసిన ప్రయత్నం ఫలించలేదు. శాంతియుతంగా నిరసన తెలియజేయటం తమ రాజ్యాంగబద్ధమైన హక్కు అని, ఇక్కడ తమ బైఠాయింపు ఇబ్బందికరంగా ఉన్నట్లయితే మరో ప్రదేశం చూపమని రాహుల్‌గాంధీ కోరారు. సిఇసిని కలిసి మెమోరాండం ఇవ్వకుండా తాము వెనక్కివెళ్లేది లేదని స్పష్టం చేశారు. చివరకు 8గంటలపాటు ఉద్రిక్తత తర్వాత రాహుల్ సహా ఎంపిలను పోలీసులు అరెస్టు చేశారు. ఇదేరోజున దేశవ్యాప్తంగా అనేక జిల్లా కేంద్రాల్లో ఇండియా కూటమి పార్టీలు జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ప్రదర్శనలు జరిపారు. ఓటు చోరీ, 'సర్'లో అక్రమాలకు వ్యతిరేకంగా ఆరంభమైన ఆందోళన ఇప్పుడు 'ఓటును రక్షించుకుందాం', 'దేశాన్ని కాపాడుకుందాం' అనే నినాదాలతో ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంగా పరిణమించి గ్రామాల వరకు వెళ్లింది. ఇంతటి విస్తృత ప్రజా ఉద్యమాన్ని దేశం ఇటీవలి దశాబ్దాల్లో చూసి ఉండలేదు. గుజరాత్ ముఖ్యమంత్రి పదవి కాలాన్ని కూడా కలుపుకుని 'ప్రజాసేవలో నరేంద్రమోదీ పాతికేళ్లు' కాలాన్ని ఒక పెద్ద ఉత్సవంగా బిజెపి జరుపుకుంటుండగా, సిఇసి జ్ఞానేశ్‌కుమార్‌ను వెనుక ఉండి ఆడిస్తున్న మోదీ, జ్ఞానేశ్ కుమార్‌తోపాటు రాజీనామా చేయాలనే డిమాండ్ కూడా రావటం దేశంలో ప్రజల మద్దతు బిజెపి అధికార దాహ రాజకీయాలు తెచ్చిన విభజన ఫలితం అనక తప్పదు. సిఇసి కి వ్యతిరేకంగా, మోదీ ప్రభుత్వం ఆయన్ను మర్యాదగా సాగనంపేవరకు ఆందోళనలు దశలవారీ ఉధృతమయ్యే సూచనలే కనిపిస్తున్నాయి. రెండోవైపున, సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లు, వాటి విచారణ ప్రాథమిక దశలోనే న్యాయమూర్తులు చేసిన వ్యాఖ్యలు జ్ఞానేశ్ కుమార్ 'ఏకపక్ష, నిరంకుశ' చట్ట వ్యతిరేక చర్యలపట్ల ప్రతికూల భావనను ప్రతిబింబిస్తున్నాయి. కేంద్రప్రభుత్వం, ఇసిఐ సహా సంబంధిత ప్రతివాదులకు కోర్టు జారీచేసిన నోటీసులకు గడువులోగా సమాధానాలు దాఖలైతే వచ్చేవారం విచారణ మరింత ఆసక్తిదాయకంగా ఉంటుంది. ఫారం–6లో మార్పులకు తమ ఆమోదం లేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టంగా చెప్పినప్పటికీ, కోర్టు ఆమోదంతోనే తాము అదనపు డిక్లరేషన్ జత చేశామని సమర్థించుకుంటూ జ్ఞానేశ్‌కుమార్ విడుదల చేసిన ప్రకటన కోర్టు ధిక్కారం కిందకు వస్తుంది. కోర్టుకు సమర్పించే అఫిడవిట్‌లో ఎన్నికల సంఘం తన వాదన వినిపించవచ్చు, ఆధారాలు ఉటంకించవచ్చు, కాని ముందే ప్రతికూల ప్రకటన ద్వారా న్యాయమూర్తుల అభిప్రాయాన్ని నిరాకరించటం నిస్సందేహంగా అతిక్రమణ కిందకే వస్తుంది. ఇసిలో నిర్ణయాలు ఏకగ్రీవంగా లేదా మెజారిటీతో జరగాలన్న చట్ట ఆదేశాన్ని న్యాయమూర్తులు ప్రస్తావించటం, చట్టవ్యతిరేకంగా, ఏకపక్షంగా నిర్ణయాలు జరిగి ఉంటే వాటిని రద్దు చేస్తామని హెచ్చరించటం, సుప్రీంకోర్టు జడ్జీలకు, ప్రధాన మంత్రి సైతం లేని ఇమ్యూనిటీని ఎన్నికల కమిషనర్లకు (ప్రాసిక్యూషన్ నుంచి రక్షణ) కల్పించిన 2023 చట్ట నిబంధనను ఒక న్యాయమూర్తి ప్రస్తావించటం వగైరాలు ఎన్నికల కమిషన్‌కు, సిఇసి కి, ప్రభుత్వానికి చురకలంటివి. జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలన్న పిటిషనర్ల వాదనను ధర్మాసనం తిరస్కరించకుండా, ఆ పనిచేస్తే ఎన్నికలు ఎవరు నిర్వహిస్తారని ప్రశ్నించగా, మిగతా ఇద్దరు కమిషనర్లు చూసుకుంటారని పిటిషనర్ల న్యాయవాదులు సమాధానమివ్వటం సీరియస్‌గా తీసుకోవలసిన అంశాలు. అయితే ప్రతి కదనాలపై తాము నిర్ణయం చేయలేమని, ప్రతివాదులకు నోటీసులిచ్చి, వారి అఫిడవిట్లు దాఖలైనాక కేసును లోతుగా విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. సర్ నిర్వహణకు ఇసికి అధికారముందని సుప్రీంకోర్టు చెప్పినందున, తమ చర్యలన్నిటికీ సుప్రీంకోర్టును అడ్డంపెట్టుకుంటున్న సిఇసి నిర్వాకం కోర్టులో పరీక్షకు గురికావాలి. ఓటును తొలగించే అధికారం ఇసికి లేదని రిటైర్డ్, వర్తమాన జడ్జీలు వ్యాఖ్యానించటం ఇసిని నిలదీయాల్సిన అంశం.

ప్రతిపక్షాలు తమ డిమాండ్ల పరిధి విస్తరించాయి. 'జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలి, సర్ రద్దు చేయాలి, అంతకుముందున్న ఓటరు జాబితాలు పునరుద్ధరించాలి. అన్ని ఎన్నికలు బ్యాలెట్ పేపరుతో జరపాలి' అని ప్రతిపక్షాలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నాయి.

ప్రధాన ఎన్నికల కమిషనర్ కుమార్ దుశ్చర్యలకు పశ్చిమ బెంగాల్‌లో ఓట్ల తొలగింపే నిలువెత్తు సాక్ష్యం. 98లక్షలకు పైగా ఓట్లు తొలగించి అధికారాన్ని బిజెపికి కట్టబెట్టారు. సుప్రీంకోర్టు ఆదేశంపై న్యాయాధికారులతో ఏర్పాటుచేసిన ట్రిబ్యునల్ తమకు అందిన మొత్తం 38.31లక్షల అప్పీళ్లలో 1.26లక్ష మాత్రమే(కేవలం 3శాతం) పరిష్కరించాయి. వాటిని జాబితాలో చేర్చారు. ఈ లెక్కన మొత్తం అప్పీళ్ల పరిష్కారానికి 19ట్రిబ్యునల్స్‌కు 21సంవత్సరాలు పడుతుందని కలకత్తా హైకోర్టు జడ్జి ఒకరు వ్యాఖ్యానించారు. మంగళవారం ఉప ఎన్నికలకు పోలింగ్ జరిగిన నందిగ్రామ్, రెజినగర్ నియోజకవర్గాల్లో దాదాపు 19 వేల ఓట్లు ఓటు హక్కు తొలగింపుకు గురైన బెంగాల్ ఓటర్లలో ఉన్నారు. కాబట్టి ఈ సమస్యకు పరిష్కారం చూపవలసిన బాధ్యత కూడా సుప్రీంకోర్టుపై ఉంది.13 కోట్లకు పైగా ఓట్లు తొలగించినందున ఇలాంటి సమస్యలు పలు రాష్ట్రాల్లో ఉన్నాయి. ఏ పౌరుడూ ఓటు హక్కు కోల్పోకుండా కచ్చితమైన కాలనిర్ణయ పరిష్కారం ఆదేశం సుప్రీంకోర్టు నుంచి రావాలి.



### అద్వానీ పేరునే తీసేసారు

**ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని బిజెపి మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్‌లోని ఒక వర్గం కోరుతోంది. భారత సుప్రీంకోర్టుకు సిఇసి తప్పుడు సమాచారం ఇవ్వడం ద్వారా మోదీ ప్రభుత్వానికి ఇబ్బందికరమైన పరిస్థితిని సృష్టించారని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన వర్గాలు తెలిపాయి. సర్ ప్రక్రియను సిఇసి అస్తవ్యస్తం చేశారు. భారతదేశ మాజీ ఉప ప్రధాని లాల్ కృష్ణ అద్వానీ పేరు కూడా ఓటర్ల జాబితాలో లేకుండా పోయింది. ఇది క్షమించరాని తప్పిదం అని ఆయన వర్గాలు తెలిపాయి.**

-పరంజోయ్ గుహ ఠకుర్తా,
సీనియర్ జర్నలిస్ట్

## పరమాణువు రహస్యాలు ఛేదించిన మేధావి నీల్స్ బోర్



ఆధునిక భౌతిక శాస్త్ర చరిత్రలో 20వ శతాబ్దం అత్యంత ప్రాముఖ్యమైనది. పరమాణు ప్రపంచం యొక్క రహస్యాలను ఛేదించి, క్వాంటమ్ సిద్ధాంతానికి బలమైన పునాదులు వేసిన శాస్త్రవేత్తలలో నీల్స్ బోర్ అగ్రగణ్యులు. అక్టోబర్ 7, 1885న డెన్మార్క్‌లోని కోపెన్‌హేగన్‌లో జన్మించిన ఆయన, భౌతికశాస్త్రాన్ని సరికొత్త కోణంలోకి తీసుకెళ్లారు. పరమాణు నిర్మాణం మరియు క్వాంటమ్ మెకానిక్స్ రంగానికి ఆయన అందించిన సేవలకుగాను 1922లో నోబెల్ బహుమతి లభించింది. నీల్స్ బోర్ జయంతి సందర్భంగా, మానవాళి శాస్త్ర విజ్ఞాన పురోగతిలో ఆయన వహించిన విప్లవాత్మక పాత్రను విశ్లేషించడం ఎంతైనా ప్రాముఖ్యమైనది.

నీల్స్ బోర్ తండ్రి క్రిస్టియన్ బోర్ కోపెన్‌హేగన్ విశ్వవిద్యాలయంలో శారీరక శాస్త్ర ఆచార్యుడిగా పనిచేయగా, తల్లి ఎల్లెన్ అడ్లర్ బోర్ ఒక సంపన్న బ్యాంకింగ్ కుటుంబానికి చెందిన విద్యాధికురాలు. తండ్రి శాస్త్రీయ దృక్పథం, ఇంట్లో నిరంతరం జరిగే విజ్ఞాన శాస్త్ర చర్చలు.. నీల్స్ బోర్ చిన్నతనం నుంచే భౌతిక, గణిత శాస్త్రాల పట్ల అమితమైన ఆసక్తినీ, శోధనాత్మక ఆలోచనా ధోరణినీ పెంచుకోవడానికి బలమైన పునాదిగా నిలిచాయి.

20వ శతాబ్దం ప్రారంభంలో రూథర్‌ఫోర్డ్ ప్రవేశపెట్టిన పరమాణు నమూనాలోని లోపాలను సరిదిద్దుతూ, 1913లో నీల్స్ బోర్ ప్రతిపాదించిన 'బోర్ పరమాణు నమూనా' సైన్స్ ప్రపంచాన్ని పెద్ద మలుపు తిప్పింది. ఎలక్ట్రాన్లు కేంద్రకం చుట్టూ ఇష్టమొచ్చినట్లు కాకుండా, నిర్దిష్ట శక్తి స్థాయిలలో మాత్రమే తిరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఎలక్ట్రాన్ ఒక కక్ష్య నుండి మరొక కక్ష్యలోకి దూకినప్పుడు మాత్రమే కాంతి లేదా శక్తి ఉద్గారం/శోషణం జరుగుతుందని వివరించారు. ఈ నమూనా హైడ్రోజన్ పరమాణువు యొక్క స్పెక్ట్రమ్‌ను విజయవంతంగా వివరించడమే కాకుండా, క్వాంటమ్ సిద్ధాంతానికి అత్యంత ఆమోదయోగ్యమైన రూపాన్ని ఇచ్చింది.

నీల్స్ బోర్ కేవలం ప్రయోగాలకే పరిమితం కాకుండా, కాంతి మరియు పదార్థం యొక్క ద్విత్వ స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి 'పూరకత్వ నియమం' అనే ప్రాథమిక భావనను ప్రతిపాదించారు. కాంతి లేదా ఎలక్ట్రాన్ ఒకే సమయంలో తరంగంగానూ, కణంగానూ ప్రవర్తించవచ్చని, కానీ ప్రయోగం చేసే విధానాన్ని బట్టి మాత్రమే దాని యొక్క ఏదో ఒక స్వభావం బయటపడుతుందని ఆయన వివరించారు. ఈ సిద్ధాంతం భౌతిక శాస్త్ర ఆలోచనా ధోరణిలోనే ఒక గొప్ప తత్వశాస్త్ర మార్పును తీసుకొచ్చింది.

నీల్స్ బోర్ స్థాపించిన 'ఇన్‌స్టిట్యూట్ ఫర్ థియరిటికల్ ఫిజిక్స్' (ప్రస్తుతం నీల్స్ బోర్ ఇన్‌స్టిట్యూట్) ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ మేధావులకు కేంద్ర బిందువుగా మారింది. వెర్నర్ హైసెన్‌బర్గ్, ఉల్ఫ్‌గ్యాంగ్ పౌలీ వంటి ప్రసిద్ధ భౌతిక శాస్త్రవేత్తలు ఇక్కడే పరిశోధనలు చేశారు. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌తో బోర్ జరిపిన సైంటిఫిక్ చర్చలు, సంవాదాలు క్వాంటమ్ మెకానిక్స్ వికాసానికి ఎంతగానో దోహదపడ్డాయి. ఐన్‌స్టీన్ క్వాంటమ్ సిద్ధాంతంలోని కొన్ని అంశాలను తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ, బోర్ తన తార్కిక ఆలోచనలతో క్వాంటమ్ భౌతిక శాస్త్ర ప్రామాణికతను కాపాడారు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో పరమాణు కేంద్రక విచ్ఛిత్తి లో బోర్ అందించిన సిద్ధాంతాలు 'మాన్‌హటన్ ప్రాజెక్ట్' రూపాంతంలో కీలక పాత్ర పోషించాయి. అయితే, అణుబాంబు తెచ్చే వినాశనాన్ని ముందుగానే ఊహించిన బోర్, అణుశక్తిని కేవలం శాంతియుత అవసరాలకే ఉపయోగించాలని ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. ఐక్యరాజ్యసమితికి బహిరంగ లేఖ రాస్తూ 'ఓపెన్ వరల్డ్ (స్వేచ్ఛా ప్రపంచం)' భావనను ప్రతిపాదించారు, ఇందులో శాస్త్రీయ పరిజ్ఞానాన్ని దేశాల మధ్య పంచుకోవడం ద్వారా యుద్ధాలను నివారించవచ్చని సూచించారు.

సమకాలీన శాస్త్ర రంగానికి దిశా నిర్దేశం చేసిన నీల్స్ బోర్ 1962 నవంబర్ 18న మరణించారు. నేడు మనం ఉపయోగిస్తున్న సెమీకండక్టర్లు, లేజర్లు, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలన్నింటికీ ఆయన వేసిన పునాదులే ఆధారం. నీల్స్ బోర్ జయంతి సందర్భంగా, కేవలం ఒక శాస్త్రవేత్తగానే కాకుండా, మానవాళి శ్రేయస్సు కోరిన ఒక గొప్ప మానవతావాదిగా ఆయన సేవలను స్మరించుకోవడం మన బాధ్యత.

*(నేడు నీల్స్ బోర్ జయంతి సందర్భంగా)*

సుధాకర్ ఏ.వి, 9000674747

# మోదీ అభివృద్ధి : ప్రచారం, వాస్తవాలు



ఎం.కోటేశ్వరరావు

పన్నెండేళ్ల నరేంద్ర మోదీ ఏలుబడి తీరు: 'మంచి నీళ్ల సీసాలు, ఐస్ క్రీమ్ తయారీలో భారత్, భవిష్యత్ పరిశ్రమల నిర్మాణంలో చైనా!'

ఈ మాటలు నావి కాదు, ప్రముఖ పారిశ్రామిక, వాణిజ్యవేత్త ఆర్ పిజి గ్రూప్ అధ్యక్షుడు హర్ష గోయంకా సెప్టెంబరు 22న ఎక్స్‌లో చేసిన వ్యాఖ్య అంశాలు. రానున్న ఇరవై సంవత్సరాల పరిణామాలను నిర్దేశించే భవిష్యత్ పరిశ్రమలను చైనా ఏర్పాటు చేస్తుండగా భారత్ సీసాల్లో మంచినీళ్లు, ఐస్‌క్రీమ్‌లు, తినుబండారాల తయారీ, వాటిని వెంటనే అందచేసే ప్రక్రియలో ఉన్నదని అన్నారు. ఎక్స్‌లో ఏముందంటే ''పరిశ్రమల్లో ఆధిపత్యాన్ని చైనా నిర్మిస్తోంది. అది రానున్న ఇరవై సంవత్సరాలను నిర్దేశిస్తుంది. విలువైన ఖనిజాలు, అయస్కాంతాలు, బ్యాటరీలు, విద్యుత్ వాహనాలు, రోబోటిక్స్, సెమికండక్టర్లు, ఆధునిక ఉత్పాదకతలు ఉన్నాయి. జెఎల్ మాగ్ ఒక చక్కటి ఉదాహరణ. అది ఇప్పటికే అధిక సామర్థ్యంతో పనిచేసే విలువైన ఖనిజాలతో అయస్కాంతాల తయారీలో ఆధిపత్యంలో ఉంది. ఇప్పుడు మానవ రూపంలో ఉండే రోబోల తయారీకి అవసరమైన విడి భాగాలను తయారు చేసేందుకు ముందుకు పోతున్నది. వ్యూహరచన సాధారణమే స్వంతంగా ముడిసరకులు, సాంకేతిక పరిజ్ఞానం, ఉత్పత్తి మరియు మొత్తంగా అవసరమైన పని పరిస్థితి ని కల్పించటం. ఇదిలా ఉండగా ఎక్కువ మంది భారతీయ వాణిజ్యవేత్తలు సుకుమారమైన అవకాశాల కోసం ఇప్పటికీ చూస్తున్నారు. సీసాల్లో మంచినీరు, ఐస్‌క్రీమ్‌లు, తినుబండారాలు, పాకేజ్‌డ్ ఫుడ్ మరియు వాటిని వెంటనే అందచేయటం. చివరికి మన గొప్ప సాఫ్ట్‌వేర్ విజయం కూడా ఎక్కువగా శ్రమశక్తిని ఖర్చు తగ్గించే బేరం చేసేదిగా ఉంది. చైనా రేపటి మౌలికసదుపాయాలను నిర్మిస్తోంది. రేపు ప్రపంచానికి అవసరమైన వాటిని మనం నిర్మిస్తున్నామా అని భారత్‌లో ఉన్న మనం మనల్ని ప్రశ్నించుకోవాలి''. గత ఏడాది 2025 ఏప్రిల్ మొదటి వారంలో స్టార్టప్ మహాకుంభ జరిగింది. ఆ సమావేశంలో సందేశమిచ్చిన వాణిజ్యశాఖ మంత్రి పియూష్ గోయల్ కూడా ఇదే విధమైన వ్యాఖ్యలు చేయటం గమనించాల్సిన అంశం. చైనా సెమీ కండక్టర్లు, రోబోలు, విద్యుత్ వాహనాల తయారీలో ముందుకు పోతుంటే మన దేశంలో స్టార్టప్స్ (అంకుర కంపెనీలు) ఐస్‌క్రీమ్‌లు, ఆహార సరఫరా, వేగవంతమైన వాణిజ్య కార్యకలాపాలపై కేంద్రీకరించాయన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త మోహనదాస్ పాయి మంత్రి వ్యాఖ్యలపై స్పందిస్తూ మనదేశంలో కూడా ఉన్నత సాంకేతిక పరిజ్ఞాన సంస్థలున్నాయని, అయితే అంకుర సంస్థలకు పెట్టుబడులు ఎక్కడ అని ప్రశ్నించారు. మన దేశంలో 2014–24 మధ్య ఈ సంస్థలు కేవలం 160 బిలియన్ డాలర్లు మాత్రమే పొందితే చైనాలో 845 బిలియన్ డాలర్లు వచ్చాయన్నారు. నియంత్రణ ఆటంకాలు ఉన్నాయన్నారు.

అంటే అన్నారని బిజెపి పెద్దలు రుసరుసలాడుతారు.కాంగ్రెస్ యాభై సంవత్సరాల్లో చేయలేని వాటిని తాను ఐదు సంవత్సరాల్లోనే చేశానని 2019 ఎన్నికల్లో కోతలు కోశారు. పన్నెండేండ్ల ఏలుబడి తరువాత హర్ష గోయంకా ఇలాంటి వ్యాఖ్యలు చేసినపుడు బిజెపి నేతలు సిగ్గుతో తలదించుకోవాలి కదా! తన మాటలు విధాన నిర్ణేతలకు సూటిగా తగులుతాయని తెలిసి కూడా ఇప్పుడు ఒక ప్రముఖ పారిశ్రామికవేత్త ఇలా మాట్లాడటానికి ధైర్యం ఎక్కడి నుంచి వచ్చింది. నరేంద్రమోదీ ఏలుబడి బలహీనతలు దీనికి దోహదం చేస్తున్నాయని వేరే చెప్పాలా? ఇది ఆరంభం మాత్రమే. హర్ష గోయంకా చెప్పిన మాటలు వాస్తవాన్ని ప్రతిబింబిస్తున్నాయి. నూతన ఆర్థిక విధానాల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం 1990 దశకం నుంచి ప్రభుత్వ రంగం పెట్టుబడులను నిలిపివేసింది. ఆ సంస్కరణలను మరింత ముందుకు తీసుకుపోతానని 2014 ఎన్నికల్లో మోదీ ప్రచారం చేయలేదా? ఫలితం, పర్యవసానాలు ఇవే కదా! దేశ భవిష్యత్ మొత్తాన్ని ప్రైవేటు రంగానికి వదలిపెడితే పెద్దగా కష్టపడకుండా లాభం ఇచ్చే వాటి మీదే కేంద్రీకరిస్తుంది.



మనదేశంతో ఉన్న అవసరాల రీత్యా కొన్ని సంస్థలు, వ్యక్తులు మనల్ని ఆకాశానికి ఎత్తి నేతల్ని మునగచెట్టు ఎక్కించవచ్చు. కానీ వాస్తవాలను మూసిపెట్టలేరు. దిగుమతి చేసుకొనే వస్తువుల వినియోగం పెరిగిందంటే దాని అర్థం మోదీ ఏలుబడిలో కొనుగోలు శక్తి పెరిగినట్లే కదా అని బిజెపి పెద్దలు అంటారు. వారి భుజాలను వారే చరుచుకుంటారు. నిజానికి మనదేశంలో 145 కోట్ల మంది వినియోగదారులున్నారని చెప్పటం పెద్ద వక్రీకరణ. వారంతా వస్తు వినియోగం చేస్తే పన్నెండేండ్లలో పారిశ్రామిక ఉత్పత్తి ఇబ్బడిముబ్బడి కావాలి. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే మాదిరి ఎందుకు ఉంది? పదేండ్ల యుపిఏ పాలనా కాలంలో జిడిపిలో పారిశ్రామిక ఉత్పత్తి వాటా 15.3 నుంచి 17.3శాతం మధ్య ఉంది. మోదీ అధికారానికి వచ్చిన తరువాత మేకిన్ ఇండియా, మేడిన్ ఇండియా పిలుపులతో 25శాతానికి పెంచుతామని చెప్పినప్పటికీ

**సంవత్సరం—ఎఫ్‌డిఐ**

| | | | | | |
|---|---|---|---|---|---|
| 2014 | — | 31.36 | 2020 | — | 64.00 |
| 2015 | — | 36.00 | 2021 | — | 44.73 |
| 2016 | — | 44.49 | 2022 | — | 49.94 |
| 2017 | — | 39.90 | 2023 | — | 28.09 |
| 2018 | — | 42.23 | 2024 | — | 27.14 |
| 2019 | — | 50.61 | 2025 | — | 39.10 |

గత పన్నెండు సంవత్సరాల్లో 15.6శాతానికి తగ్గింది తప్ప పెరగలేదు. ఏటా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) బిలియన్ డాలర్లలో ఎలా వచ్చాయో చూడవచ్చు. ఈ వివరాలు(పట్టికలో) మన రిజర్వుబ్యాంక్, ప్రపంచ బ్యాంకు వెల్లడించినవే.

పన్నెండు సంవత్సరాల్లో వచ్చిన మొత్తం 470.45 బిలియన్ డాలర్లంటే సగటున ఏటా 39.20 బిలియన్ డాలర్లు మాత్రమే. మేకిన్ ఇండియా, మేడిన్ ఇండియా, ఆత్మనిర్భరత, పిఎల్ఐ స్కీములను ఎన్ని ప్రవేశపెట్టినప్పటికీ పరిస్థితి ఇది. ఇదే కాలంలో మన దేశం నుంచి విదేశాలకు వెళ్లిన పెట్టుబడి మొత్తం 250 బిలియన్ డాలర్లన్నది పెద్దగా ప్రచారంలో లేని అంశం. చైనాకు వచ్చిన పెట్టుబడి 2,195.17 బిలియన్ డాలర్లు. అయితే 2014లో 268 బిలియన్ డాలర్లు కాగా, 2025లో 79.98 బిలియన్ డాలర్లకు తగ్గినప్పటికీ ప్రపంచ ఎగుమతుల్లో చైనా వాటా పెరుగుతూనే ఉంది తప్ప తగ్గటం లేదు. చైనా నుంచి కూడా పెట్టుబడులు గత పన్నెండు సంవత్సరాల్లో సగటున ఏటా వంద బిలియన్ డాలర్ల వంతున బయటకు వెళుతున్నాయి. ఇక మన దేశభక్తులైన కార్పొరేట్ల సంగతి చూద్దాం. వారికి ఇస్తున్న రాయితీలు తప్ప వారి పెట్టుబడులు పెరగటం లేదు. ఈ పన్నెండు సంవత్సరాలలో ప్రైవేటు పెట్టుబడి జిడిపిలో 11–12శాతం మధ్య నిలకడగా ఉంది. ఇటీవలి కాలంలో వస్తున్న పెట్టుబడులలో అధికభాగం ఉపాధి రహిత వృద్ధి, కార్పొరేట్లకు లబ్దిచేకూర్చేవే కావటం విశేషం. అందుకే అసలు ఉపాధి దొరకని వారితో పాటు అరకొరవేతనాలతో పనిచేసే వారి సంఖ్య కూడా రోజు రోజుకూ పెరుగుతున్నది. యుపిఏ పాలనా కాలంలో పదేండ్ల జిడిపి వృద్ధి రేటు 7.5 నుంచి 7.8శాతం, మోదీ ఏలుబడిలో 6–7 శాతం మధ్య ఉన్నది. మరోవైపున 2017–24 మధ్య ఏటా గ్రామీణ వ్యవసాయేతర కార్మికుల వేతనాలు ఇదే కాలంలో పెరిగింది 5.4, రోజువారీ కూలీలకు 5.69, వేతన జీవులకు 3.54. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే పెరిగింది అత్యధికులకు సున్నా లేదా అతి తక్కువగా ఉంది. వ్యవసాయ కార్మికులదీ ఇదే పరిస్థితి. దీని అర్థం ఏమిటీ? జిడిపి పెరిగినంత మాత్రాన కష్టజీవులకు దక్కుతున్నదేమీ లేదు. అవసరాలకు అనుగుణంగా రాబడి పెరగని కారణంగా కుటుంబాలు అప్పులపాలవుతున్నాయి. మోదీ అధికారానికి వచ్చినపుడు జిడిపిలో రుణ భారం 26 శాతం ఉండగా 2026లో 45.5శాతానికి పెరిగింది. సగటున 2025లో రు.4.8లక్షల కోట్లు ఉంది. వేతనాలు, ఉపాధి పెరగనపుడు జిడిపిలో ఎంత వృద్ధి రేటు ఉంటే ఉపయోగం ఏమిటి?

రైల్వేల్లో 8,868 ఉద్యోగాలకు 2025 నవంబరులో నోటిఫికేషన్ ఇవ్వగా కోటీ ఇరవైలక్షలకు పైగా దరఖాస్తు చేశారు, ఒక్కో ఉద్యోగానికి సగటున 1,370 మంది పోటీ పడ్డారు. కొన్నింటికి రెండువేలకు పైగా దరఖాస్తులు వచ్చాయట. అదే ఏడాది అంతకు ముందు జైపూర్‌లో ఒక్కో ప్యూన్ ఉద్యోగానికి పిహెచ్‌డిలతో సహా విద్యావంతులు 47 మంది పోటీపడ్డారు. సంబల్‌పూర్‌లో 187 హోం గార్డు పోస్టులకు ఎనిమిది వేల మంది దరఖాస్తు చేశారు. తాజా కార్మికశక్తి సర్వే ప్రకారం 60కోట్ల మంది పనిచేసే వయస్సు ఉన్నవారిలో నిరుద్యోగులు 56శాతం ఉన్నారు, అంటే మూడు నుంచి మూడున్నర కోట్ల మంది నిరుద్యోగులున్నారు. నామమాత్రపు పని దొరుకుతున్నవారిని కూడా నిరుద్యోగులుగా పరిగణిస్తే అలాంటి వారు ఇరవై కోట్లని అంచనా. పన్నెండు కోట్ల మంది కాజువల్ లేబర్ ఉన్నట్లు అంచనా, వీరికి రోజూ పని దొరుకుతుందనే హామీ లేదు.

మన ప్రభుత్వం సేకరిస్తున్న గణాంకాల ను చూస్తే 60శాతం మంది స్వయం ఉపాధి, నెల వారీ లేదా రోజూ వేతనం పొందేవారు 20, క్యాజువల్ లేబర్ 20శాతం ఉన్నారని తెలుతున్నది తప్ప, రోజుకు నాలుగైదు గంటలు పనిచేసే పాక్షిక ఉపాధి పొందుతున్నవారెంత మంది అన్నది సేకరించటం లేదు. పకోడీల బండి పెట్టుకున్నప్పటికీ ఉపాధి కల్పించినట్లే కదా అని మోదీ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ప్రధాన స్రవంతి మీడియా ఎన్నడైనా ఈ సమస్య గురించి చర్చించిందా! అమెరికా, ఐరోపా దేశాల్లో ఉపాధి గురించి కచ్చితమైన లెక్కలు తీస్తున్నారు, ఎందుకంటే అక్కడ నిరుద్యోగ భృతి చెల్లించాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఇటలీలో 2024 వివరాల ప్రకారం నిరుద్యోగులు ఏడు శాతం, పాక్షికంగా పని చేసేవారు 20 శాతం ఉన్నట్లు తేలింది. అదే టర్కీలో 25శాతం, మనదేశం లో పూర్తిగా పనిలేని వారు 90శాతం ఉన్నట్లు అంచనా.

ఆర్థికవేత్త జీన్ డ్రెజ్, అతని సహచరులు మన గ్రామీణ నిజవేతనాల పెరుగుదల 2015–16 నుంచి 0.1, పట్టణాల్లో 0.8 అని చెప్పారు. నెలవారీ వేతన కార్మికుల నిజవేతనాలు 2017–18 నుంచి గణనీయంగా పడిపోయినట్లు, కాజువల్ కార్మికుల వేతనాలు కాస్త పెరిగినప్పటికీ 2021–22 తరువాత గిడసబారినట్లు పేర్కొన్నారు. ఈ సంవత్సరాలన్నీ జిడిపి వృద్ధి రేటు ఎక్కువగా ఉన్నవే అయినప్పటికీ నిజవేతనాలు దానికి అనుగుణంగా పెరగలేదు. పన్నుల అనిశ్చితి ఉన్నప్పటికీ భారత ఎగుమతులు పెరిగాయి చూడండి అని మొత్తాల అంకెలను చూపుతారు. జిడిపిలో ఎగుమతులదిగుమతుల శాతాలు ఎలా ఉన్నా యో చెబితే అసలు రంగు బయటపడుతుంది. మోదీ అధికారానికి వచ్చినపుడు డాలరుకు రూపాయి విలువ 60కంటే తక్కువ, ఇప్పుడు 95 దాటింది. పది వస్తు, సేవల ఎగుమతుల ద్వారా 2014లో వంద డాలర్ల ఆదాయం వచ్చిందంటే ఆరువేలు, అదే పదింటికి 2026లో అంతే మొత్తం ఎగుమతి చేస్తే 9,500 వస్తాయి. చూశారా మేము ఎలా పెంచామో అంటారు. అనేక మంది మోదీ దేశాన్ని రక్షించాడని బిజెపి ఐటి సెల్, దాన్ని అనుసరించేవారు భజన చేస్తారు, అదే నిజమైతే యుపిఏ కంటే వృద్ధి రేటు ఎందుకు తగ్గినట్లు?

## ఎచ్చమ్మ కథలతో సాహిత్య ప్రకియ చేసిన పాకాల యశోదా రెడ్డి

ఒక జాతి సంస్కృతిలో ఆ జాతి జీవన విధానం ప్రతిఫలిస్తుంది. ఈ సంస్కృతీ సర్వస్వం ఆ జాతి భాషలో నిక్షిప్తమై జీవిస్తుంది. ఒక భాషలో ఒక నానుడి కానీ, సామెత కానీ, జాతీయం కానీ అలవోకగా పుట్టదు. ఆయా జాతీయులు తలలు పండిన వారి అనుభవరాశిని కాచి, వడబోసి నిగ్గుదేల్చిన సారమే ఈ నుడికారపు ఇంపు సొంపులు. అందుకే అవి భాషకు జీవనాడి, ప్రాణధాతువుల వంటివి అంటారు యశోదారెడ్డి.

తెలంగాణ ప్రాంతం నిజాం పాలనలో కునారిల్లిన సమాజం నుంచి మొదలుకొని అంటే 1930వ దశకం నుండి 2007 దశకం సగం కాలం వరకూ యశోదారెడ్డి మూడు తరాలనూ, ఆ తరాలలో వచ్చిన అనేక మార్పులనూ గమనించారు. గ్రామాల్లో, పట్టణాల్లో వేగవంతంగా వచ్చిన మార్పులు, కుటుంబాల్లో వాటి భావజాలాల్లో వాటి ప్రభావాలూ, తదనుగుణంగా వచ్చిన మార్పులనూ గుర్తించిన ఆమె వాటన్నింటిని తన కథల్లో ప్రస్ఫుటింపజేస్తూ ప్రస్తావించారు. ఆచార్య పాకాల యశోదారెడ్డి 1929 ఆగష్టు 8న మహబూబ్‌నగర్ జిల్లా బిజినేపల్లి గ్రామంలో జన్మించారు. ఆమె తండ్రి కత్తి కాశిరెడ్డి, తల్లి సరస్వతమ్మ. గ్రామంలో అందరూ ఆమెను ఎచ్చా, ఎచ్చమ్మా అని పిలిచేవారట.

తెలుగు నుడికారాన్ని గురించి ఈ తెలంగాణ భాషా ప్రేమికురాలు ఏమంటారంటే 'ఇప్పటి మన వ్యవహార భాష సామెతల సొంపును, నుడికారపు సొగసును, జాతీయపు బిగువును కోల్పోయి కేవలం అభిప్రాయ ప్రకటనకు ఉపకరణ రూపంలో యాంత్రికంగా మారింది. ఈ స్థితి అనేక భాషల ప్రభావంతో సంభవించిన దారిద్ర్యం అంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ అసలు సిసలైన తెలుగు భాషా రుచిని ఆస్వాదించ దలిచితే 'తెలంగాణపు తెలుగును చదవండి, వినండి' అంటారు.

సాహిత్యంలోని అనేక ప్రక్రియలను తన కలం ద్వారా సృజించినప్పటికీ పల్లె తెలంగాణను అక్షరాల ఆవిష్కరించిన ఎచ్చమ్మ కథలు ఆమెకు గుర్తింపు నిచ్చాయి. అచ్చమైన తెలంగాణ మాండలికంలో కథలు రాసిన తొలితరం తెలంగాణ రచయిత్రిగా చరిత్రలో ఆమె పేరు శాశ్వతంగా నిలిచిపోయింది. ఆమె ప్రముఖ రచయిత్రి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షురాలు డాక్టర్ పాకాల యశోదారెడ్డి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత అచ్చమైన యాస వినిపిస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో నిరాదరణకు గురైన తెలంగాణ యాసను తన కథల ద్వారా బతికించారు యశోదరెడ్డి. ప్రతి కథలోనూ తెలంగాణ గ్రామీణ ప్రాంత ఆత్మ అక్షరాల్లో పొదిగి ఉంటుంది. చదివిన తర్వా త పాఠకుల మనసులో ఒదిగిపోతుంది. దక్కన్ రేడియోలో తెలంగాణ మాండలికంలో ప్రసంగాలు చేసిన తొలి రచయిత ఆమె. యశోద రెడ్డి రచనలు భాషాభిమానులకు నిధులు. వెతుక్కుంటే అందులో ఎన్నో సామెతలు, ఉపమానాలు, చమత్కారాలు అంతర్లీనమై పాఠకులను అలరిస్తాయి. ఆమె ప్రసంగాలు విని తెలంగాణ భాష ఇంత అందమైన యాస అని చాలామంది అబ్బుర పడే వారట. మహబూబ్‌నగర్ జిల్లా బిజినేపల్లిలో



యశోద జన్మించారు. ఆమె తల్లి దండ్రులు సరస్వతమ్మ, కాశిరెడ్డి. చిన్నతనంలోనే అమ్మను కోల్పోయిన ఆమె బంధువుల వద్ద పెరిగారు. చదువుపై ఆమెకు ఉన్న ఆసక్తిని గమనించిన రాజా బహదూర్ వెంకట్రామరెడ్డి ఆమెను హైదరాబాద్ నారాయణగూడలోని మాడపాటి బాలికల పాఠశాలలో చేర్చారు. ఆ రోజుల్లో హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ గా పనిచేసే ఆయన చదువుపై ఆసక్తి ఉన్న ఆడపిల్ల లు పట్టణంలో చదువుకునేందుకు వీలుగా వసతి ఏర్పాటు కూడా చేసేవారట. అలా హైదరాబాద్ లో ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేసిన యశోద విజయవాడలో ఆంధ్ర మెట్రిక్ పరీక్షను ప్రత్యేక అనుమతితో రాశారు. ఆమెతో పాటు మరో ముగ్గురు అమ్మాయిలు కూడా ఈ పరీక్ష రాశారు. గుంటూరు ఎసి కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్, హైదరాబాద్ ఉమెన్స్ కాలేజీలో సెకండ్ ఇయర్ పూర్తి చేశారు.

కరీంనగర్ జిల్లా మానకొండూరు సమీపంలోని అన్నారం గ్రామవాసి ప్రముఖ చిత్రకారుడు పాకాల తిరుమలరెడ్డితో పెళ్లి జరిగింది. రాతకు గీత తోడైంది. భర్త ప్రోత్సాహంతో ఆమె ఉన్నత విద్య పూర్తి చేశారు. ప్రైవేట్‌గా డిగ్రీ చదివి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎం.ఎ (తెలుగు), ఎం.ఎ (సంస్కృతం) పూర్తిశారు. తెలుగు సాహిత్యంలో పిహెచ్‌డి తో పాటు ఆలీగర్ యూనివర్సిటీ నించి డి.లిట్ కూడా అందుకున్నారు. హిందీ, ఉర్దూ, కన్నడ భాషల్లో ప్రావీణ్యంతో పాటు జర్మన్ భాషలో డిప్లొమా కూడా చేశారు. కోఠీ విమెన్స్ కాలెజిలో తెలుగు అధ్యాపకురాలిగా తన ప్రస్థానం ప్రారంభించి ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్ పదవీవిరమణ చేశారు. యూనివర్సిటీ అకడమిక్ కౌన్సిల్ మెంబర్ గా, కేంద్ర సాహిత్య అకాడమీ మెంబర్‌గా, అధికార భాషాసంఘం అధ్యక్షురాలిగా అనేక స్థాయిలో పనిచేశారు.

కథ, కవిత, వ్యాస ప్రక్రియల్లో ఆమె ఎన్నో రచనలు చేశారు. వందకు పైగా కథలు రాసినా అందులో కొన్ని కథలు మాత్రమే మూడు కథా సంపుటాలుగా వచ్చాయి. ఎచ్చమ్మ కతలు బాగా ప్రాచుర్యం పొందిన కథా సంపుటి. ఉగాదికి ఉయ్యాల, భావిక కవితా సంపుటాలు, కథలూ నవలలూ ఒక పరిశీలన, కథా చరిత్ర, భారతంలో స్త్రీ, ఆంధ్ర సాహిత్య వికాసం, హరివంశము ఉత్తర భాగము, పారిజాతాపహరణం, తెలుగులో హరివంశములు వ్యాస సంపుటాలుగా వచ్చాయి.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉత్తమ రచయిత్రి అవార్డు, సుశీలా నారాయణ రెడ్డి అవార్డు, నాళం కృష్ణారావు అవార్డు, సురవరం ప్రతాపరెడ్డి అవార్డులూ అందుకున్న ఆమె ఎచ్చమ్మ కతల యశోదగా పాఠకుల మనసులో నిలిచిపోయారు. యశోద రెడ్డి అక్టోబర్ 7, 2007 న మరణించారు. తెలంగాణ యాసలో సాగే ఆమె రచనలపై చాలా మంది పరిశోధనలు చేసి డాక్టరేట్‌లు అందుకున్నారు.

**(అక్టోబర్ 7 న కవయిత్రి పాకాల యశోద రెడ్డి వర్ధంతి సందర్భంగా)**

కామిడి సతీష్ రెడ్డి, 9848445134

# 8వేల మెగావాట్ల అదనపు భారం

అయినా విద్యుత్ కోతలు లేవు..
జలవిద్యుత్ ఉత్పత్తి 4వేల మెగావాట్లు తగ్గినా నిరంతర సరఫరా
గృహ వినియోగదారులకు 24 గంటల విద్యుత్ అందిస్తున్నాం
ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/చింతలపాలెం :** రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరగడంతోపాటు జల విద్యుత్ ఉత్పత్తి తగ్గినప్పటికీ ప్రజలకు ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. గతంలో ఇదే సమయంలో రాష్ట్ర విద్యుత్ పీక్ డిమాండ్ 15వేల మెగావాట్లు ఉండగా ప్రస్తుతం దాదాపు 20వేల మెగావాట్లకు చేరిందన్నారు. ఎలినో ప్రభావం వల్ల ఏర్పడిన వర్షాభావ పరిస్థితులతో నదులు, ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తగ్గడంతో జలవిద్యుత్ ఉత్పత్తి సుమారు 4వేల మెగావాట్లు తగ్గిందని చెప్పారు. దీంతో మొత్తంగా 8వేల మెగావాట్ల అదనపు భారం ఏర్పడినప్పటికి ట్రాన్స్‌కో, ఎస్‌పిడిసిఎల్, ఎన్‌పిడిసిఎల్ సంస్థలు సమర్థంగా పనిచేస్తూ నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నాయని వెల్లడించారు. మంగళవారం మండలంలోని పులిచింతల జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, ఇప్పటి వరకు జరిగిన ఉత్పత్తి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. యూనిట్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన అనంతరం అధికారులు ఏర్పాటు చేసిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకించారు. మీడియాతో భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జల విద్యుత్ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రాజెక్టులు యంత్రాలు, యూనిట్లు పూర్తి సామర్థ్యంతో పని చేసే స్థితిలోనే ఉన్నాయని చెప్పారు. అవసరమైన స్థాయిలో నీటి లభ్యత లేకపోవడం వల్లే జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గిందన్నారు. వర్షాభావ పరిస్థితులు, ఎండల తీవ్రత పెరగడం ఇందుకు ప్రధాన కారణాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగినప్పటికి గృహ వినియోగదారులకు 24 గంటలు విద్యుత్ సరఫరా చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో పెరిగే విద్యుత్ డిమాండ్‌ను థర్మల్ పవర్ ద్వారా అధిగమిస్తున్నామని తెలిపారు. ప్రజలు విద్యుత్ సరఫరాపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మనకంటే పెద్దదైన కర్ణాటకలో పీక్ విద్యుత్ డిమాండ్ సుమారు 20వేల మెగావాట్లు ఉండగా తెలంగాణలోనూ ప్రస్తుతం అదేస్థాయికి చేరిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పీక్ డిమాండ్ సుమారు 12వేల మెగావాట్లుగా ఉందన్నారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగినప్పటికీ ప్రజలకు నిరంతర సరఫరా అందిస్తున్నామని చెప్పారు. రాబోయే రోజుల్లో వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోతే నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని తెలిపారు.
తదుపరి వర్షాకాలం వరకు అందుబాటులో ఉన్న నీటిని మనుషులు, పశువులు, పక్షుల తాగునీటి అవసరాలకు జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. తాగునీటిని భవిష్యత్ కోసం నిల్వ చేసుకోవడం సాధ్యం కాదని, ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. విద్యుత్ రంగంలో నిరంతరం శ్రమిస్తున్న జెన్‌కో సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్‌పి కె. నరసింహ, జెన్‌కో ప్రతినిధులు, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అగ్రిగోల్డ్ బాధితులకు తిరిగి
# సొమ్ము ఇప్పించే బాధ్యత ప్రభుత్వాలదే

సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసి, వారి సొమ్మును తిరిగి ఇప్పించే బాధ్యత ప్రభుత్వాలదేనని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, అగ్రిగోల్డ్ కంపెనీ బాధితుల సంఘం జాతీయ నాయకుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు.
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి తక్షణమే బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాజ్ బహదూర్ గౌర్ హాల్‌లో తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. అధ్యక్షురాలు పశ్యపద్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, అగ్రిగోల్డ్ కంపెనీ బాధితుల జాతీయ నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు హాజరయ్యారు.

**డిపాజిట్లు సేకరించే సంస్థలపై నియంత్రణ ఉండాలి : నెల్లికంటి సత్యం**

సత్యం మాట్లాడుతూ అగ్రిగోల్డ్‌లో పొదుపు చేస్తే కుటుంబ అవసరాలకు, పిల్లల పెళ్లిళ్లకు ఉపయోగపడుతుందనే నమ్మకంతో ప్రజలు డబ్బులు పెట్టారని, సంస్థ మోసం చేయడంతో లక్షలాది కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని సత్యం అన్నారు. ఇంత పెద్ద సంస్థ ప్రజల నుంచి డిపాజిట్లు సేకరిస్తున్నప్పుడు ప్రభుత్వ నియంత్రణ, పర్యవేక్షణ లేకపోవడంపై ప్రభుత్వాలే బాధ్యత వహించాల్సి ఉంటుందని, ఇప్పటివరకు సాగిన పోరాటాలతోపాటు జిల్లాల వారీగా బాధితులను సమీకరించి ఉద్యమాన్ని మరింత విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు. బాధితులు పెద్ద సంఖ్యలో రోడ్డెక్కితేనే ప్రభుత్వాలపై ఒత్తిడి పెరుగుతుందని అన్నారు. తెలంగాణలోని అగ్రిగోల్డ్ బాధితుల సమస్యపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి బాధితుల ప్రతినిధులతో చర్చించాలని సత్యం కోరారు. తన వంతుగా బాధితుల ప్రతినిధి బృందాన్ని ముఖ్యమంత్రిని కలిసేందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి : ముప్పాళ్ల నాగేశ్వరరావు**

అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. తెలంగాణలోని సుమారు మూడు లక్షల అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధితుల ప్రతినిధులతో నేరుగా చర్చించాలని కోరారు. అగ్రిగోల్డ్ బాధితుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీని క్రియాశీలం చేసి, సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలని సూచించారు. బాధితుల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తే ఆందోళనలకు బదులుగా చర్చల ద్వారా ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తెలిపారు. పశ్యపద్మ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అగ్రిగోల్డ్ బాధితుల బాండ్ల పరిశీలనకు 10 కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతిరావు మాట్లాడుతూ వెంటనే ఉమ్మడి జిల్లాల స్థాయిలో కస్టమర్స్‌ను, ఏజెంట్స్‌ను అధిక సంఖ్యలో సమీకరించి జిల్లా సమావేశంలో ఏర్పాటు చేసిపాలకులపై ఒత్తిడి పెంచాలని కోరారు.
ఈ సమావేశంలో తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం ప్రధాన కార్యదర్శి జివిఆర్, ఉపాధ్యక్షురాలు రజిత, కార్యదర్శి శ్రీనివాస్, ఆనంద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉపనాయకుడు
తన్నీరు హరీశ్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకులు తన్నీరు హరీశ్ రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెంచిన విద్యుత్ ఛార్జీల నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకుని, ఆ భారాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ప్రజా ఉద్యమాన్ని చేపడతామన్నారు. ఈ పోరాటంలో ఇతర ప్రతిపక్షాలు, కమ్యూనిస్టులు కూడా భాగస్వాములు కావాలని కోరారు. దసరా, దీపావళి పండుగల వేళ ప్రజలకు శుభ వార్త చెప్పాల్సిన ప్రభుత్వం, ట్రూఅప్ ఛార్జీల పేరుతో ఏకంగా రూ. 5,420 కోట్ల భారాన్ని మోపేందుకు సిద్ధమవ్వడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. విద్యుత్ కొనుగోళ్లకు వెచ్చించిన సొమ్మును వినియోగదారుల ముక్కు పిండి వసూలు చేయాలనుకోవడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు.

# సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సింగరేణి బొగ్గు గని కార్మికులు, వారి కుటుంబాల దీర్ఘకాలిక సమస్యలకు సత్వరమే పరిష్కారించేందుకు చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ ప్రజాభవన్‌లో మంగళవారం సింగరేణి ప్రాంత మంత్రులు, ప్రజాప్రతినిధులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, ప్రేమ్ సాగర్ రావు, డాక్టర్ మట్టా రాగమయి, కోరం కనకయ్య, మాలోతు రాందాస్ నాయక్, పాయం వెంకటేశ్వర్లు, గండ్ర సత్య నారాయణ రావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, గడ్డం వినోద్ వెంకటస్వామి, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్, సంస్థ ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.



ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 250–300 డిపెండెంట్ ఉద్యోగ ఆర్డర్లను 15 రోజుల్లో పూర్తి చేయాలని, పేర్ల మార్పు కేసులను మానవీయ కోణంలో పరిష్కరించాలని ఆదేశించారు. మెడికల్ ఇన్‌వాలిడేషన్ కోసం అన్ని ఏరియా ఆసుపత్రుల్లో నెలవారీ మెడికల్ బోర్డులు నిర్వహించాలని, కరోనా తదితర కారణాలతో ఉద్యోగాలు కోల్పోయిన వారిని వన్‌టైమ్ ఆప్షన్ కింద తిరిగి తీసుకునే చర్యలు చేపట్టాలని సూచించారు. సింగరేణి ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసి కార్డియాక్, క్యాథ్‌ల్యాబ్ సేవలు అందుబాటులోకి తేవాలని, సింగరేణి పరిధిలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. జీవో 76 ప్రకారం 1,250 ఎకరాల్లో అర్హులకు ఇళ్ల స్థలాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.సింగరేణి కాలనీల ఆధునీకరణ, సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు, కార్మికులకు ఆరు నెలలకు ఒకసారి భద్రతా కిట్ల పంపిణీకి చర్యలు చేపట్టాలని సూచించారు. రామగుండంలో సింగరేణి ఆధ్వర్యంలో థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

# ఈశ్వరయ్యను పరామర్శించిన సిపిఐ, బిఆర్‌ఎస్ నేతలు





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఛాతీనొప్పితో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్యను మంగళవారం సిపిఐ జాతీయ కార్యదర్శులు పల్లా వెంకట్‌రెడ్డి, కె.రామకృష్ణ, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, బిఆర్‌ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈశ్వరయ్య త్వరగా కోలుకుని ప్రజా జీవితంలో తిరిగి చురుకైన పాత్ర పోషించాలని వారు ఆకాంక్షించారు.

# ఖరీఫ్‌లో ఎరువుల కొరత లేకుండా పకడ్బందీ సరఫరా

యాప్‌లతో పారదర్శక పంపిణీ..
రాష్ట్రంలో 2.33 లక్షల టన్నుల యూరియా నిల్వలు :
మంత్రి తుమ్మల నాగేశ్వరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎరువుల కొరత లేకుండా ముందస్తు నిల్వలు, పకడ్బందీ సరఫరా, డిజిటల్ పర్యవేక్షణతో పంపిణీ విజయవంతంగా నిర్వహించామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర యాప్ ద్వారా 33.39 లక్షల మంది రైతులకు 128.18 లక్షల యూరియా బస్తాలు, కేంద్ర ఎఫ్‌ఎఫ్‌ఎస్ యాప్ ద్వారా 37.48 లక్షల మంది రైతులకు 104.99 లక్షల అన్నిరకాల ఎరువుల బస్తాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.ఎరువుల కొరత రాకుండా ముందుగానే నిల్వలు సమకూర్చడంతో పాటు, దిగుమతి ఎరువుల షిప్‌మెంట్లు వేగంగా రాష్ట్రానికి చేరేలా షిప్‌యార్డుల్లో ప్రత్యేక అధికారులను నియమించి కేంద్రంతో సమన్వయం చేసినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర యూరియా యాప్, కేంద్ర ఫెర్టిలైజర్ యాప్‌ల ద్వారా నిల్వలు, బుకింగ్, విక్రయాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం వల్ల అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు అడ్డుకట్ట పడిందన్నారు. ఈ ఖరీఫ్‌లో గత ఏడాదితో పోలిస్తే 35 వేల టన్నుల యూరియా వినియోగం తగ్గిందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 2.33 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందని, గత ఏడాది ఇదే సమయంలో 0.50 లక్షల టన్నులు మాత్రమే ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం 0.39 లక్షల టన్నుల డిఎపి, 2.72 లక్షల టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 0.36 లక్షల టన్నుల ఎంఒపి, 0.18 లక్షల టన్నుల ఎస్‌ఎస్‌పీ నిల్వలు ఉన్నాయని చెప్పారు. రైతుల సమగ్ర సమాచారాన్ని డిజిటల్‌గా నమోదు చేయడంలో తెలంగాణ ముందంజలో ఉందని తుమ్మల తెలిపారు.

# ‘నషా ముక్త్’ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుదాం

2029 కంటే ముందే
మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి
మెదక్‌లో ‘నషా ముక్త్ భారత్’ర్యాలీని
ప్రారంభించిన గవర్నర్ శివప్రతాప్ శుక్లా




**ప్రజాపక్షం/మెదక్ :** మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేసి 2029 కంటే ముందే తెలంగాణను నషా ముక్త్ రాష్ట్రంగా తీర్చిదిద్దాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వం చేపట్టిన ‘నషా ముక్త్ భారత్’ ఉద్యమంలో భాగంగా మెదక్‌లో మంగళవారం నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో గవర్నర్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న గవర్నర్‌కు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, మెదక్ ఎంపి రఘునందన్ రావు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిశోర్, మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు అధికారులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. అనంతరం ‘నషా ముక్త్ భారత్’ ర్యాలీని గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల పచ్చజెండా ఊపి ప్రారంభించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, యువత భవిష్యత్తును కాపాడుకోవాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నషా ముక్త్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో గవర్నర్ పాల్గొని మీడియా సమావేశంలో మాట్లాడారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులు, యువతకు వివరించి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు. మత్తు పదార్థాల నిర్మూలనలో తెలంగాణ పోలీసులు ముందుండి పనిచేస్తున్నారని, అయితే పోలీసుల కృషితో మాత్రమే లక్ష్యాన్ని సాధించలేమని అన్నారు. ప్రజాప్రతినిధులు, యువత, మీడియా, స్వచ్ఛంద సంస్థలు, అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో మీడియా సహకారంతో నిర్వహిస్తున్న మత్తు పదార్థాల వ్యతిరేక కార్యక్రమాల తరహాలో తెలంగాణలోనూ మీడియా కీలక పాత్ర పోషించాలని గవర్నర్ కోరారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు సమష్టి కృషి జరిగితే తెలంగాణను దేశంలోనే ఆదర్శ నషా ముక్త్ రాష్ట్రంగా నిలపవచ్చని గవర్నర్ విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాగంగా ‘మహిళా శక్తి’ స్టాళ్లను గవర్నర్ సందర్శించి, స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమయ్యారు. మహిళలు చేపడుతున్న స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారత కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు.
అనంతరం నూతనంగా ఎన్నికైన రెడ్‌క్రాస్ ప్రతినిధులతో సమావేశమై వారి సేవా కార్యక్రమాలపై చర్చించారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి గవర్నర్ నషా ముక్త్ భారత్ సెల్ఫీ పాయింట్ దగ్గర ఫోటో దిగారు. అంతకు ముందు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపి రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్, ఎమ్మెల్యే రోహిత్ రావ్‌లు మాట్లాడుతూ యువత ఆరోగ్యంగా ఉంటేనే భారతదేశం అభివృద్ధి చెందుతుందన్నారు. దేశ భవిష్యత్తు యువతపైనే ఉందన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల పట్ల తల్లిదండ్రులు, పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ నగేష్, ఆర్డీవో రమాదేవి, డిఎస్పీ ప్రసన్న కుమార్, జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ‘నేడు’ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్
# ఓపెన్ యూనివర్సిటీ 27వ స్నాతకోత్సవం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 27వ స్నాతకోత్సవం బుధవారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని యూనివర్సిటీ క్యాంపస్‌లో ఉన్న భవనం వెంకట్రామ్ ఆడిటోరియంలో వైభవంగా జరగనుంది. ఈ మేరకు కార్యక్రమానికి సంబంధించిన వివరాలను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.వి.కె.రెడ్డి వెల్లడించారు. ఈ స్నాతకోత్సవానికి తెలంగాణ రాష్ట్ర గౌరవ గవర్నర్, విశ్వవిద్యాలయ ఛాన్సలర్ శివ్‌ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. కార్యక్రమంలో భాగంగా ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఎం.ఫిల్, పిహెచ్‌డి పట్టాలతో పాటు ప్రతిభాపాటవాలు చూపిన వారికి బంగారు పతకాలు, బుక్ ప్రైజ్‌లను గవర్నర్ ప్రదానం చేయనున్నారు. న్యాక్ మాజీ డైరెక్టర్, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.ఎస్. ప్రసాద్ ఈ వేడుకలో ముఖ్య స్నాతకోత్సవ ప్రసంగం చేయనున్నారు. ఈ వేడుకల్లో భాగంగా ప్రముఖ చిత్ర నిర్మాత, రచయిత, నటులు బి.నరసింగరావుకి విశ్వవిద్యాలయం తరపున గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రభుత్వ అధికారులు, ఉన్నత విద్యాసంస్థల ప్రతినిధులు, తెలంగాణలోని వివిధ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు, డైరెక్టర్లు, భాగస్వాములు హాజరుకానున్నారు. ఈ 27వ స్నాతకోత్సవంలో మొత్తం 36,145 మంది విద్యార్థులకు వివిధ డిగ్రీ, పిజి, డిప్లొమా, సర్టిఫికేట్ కోర్సులలో పట్టాలను అందజేయనున్నారు.




వీటితో పాటు 38 బంగారు పతకాలను, 23 మంది పరిశోధక విద్యార్థులకు పిహెచ్‌డి, ఒకరికి ఎం.ఫిల్ డిగ్రీలను ప్రదానం చేయనున్నారు. విశేషంగా, చెర్లపల్లి, రాజమండ్రి, కడప సెంట్రల్ జైళ్ల నుంచి 26 మంది పురుష ఖైదీలు, ఒక మహిళా ఖైదీతో కలిపి మొత్తం 27 మంది ఖైదీలు కూడా ఈ స్నాతకోత్సవంలో డిగ్రీ పట్టాలు అందుకోనుండటం గమనార్హం. హాజరయ్యే విద్యార్థుల సౌకర్యార్థం జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్, పెద్దమ్మగుడి మెట్రో స్టేషన్లు, జర్నలిస్ట్ కాలనీ బస్సు స్టాప్‌ల నుంచి యూనివర్సిటీ క్యాంపస్ వరకు ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పించినట్లు విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు.



# టూరిజం కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఎండికి వినతిపత్రం అందజేసిన ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు చాడ వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ టూరిజం కార్పొరేషన్‌లో ఏళ్ల తరబడి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, డైలీవేజ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టూరిజం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి డిమాండ్ చేశారు. ఈ మేరకు టూరిజం ఎండి వల్లూరు క్రాంతిని కలిసి వినతిపత్రం అందజేశారు. టూరిజం కార్పొరేషన్‌లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, డైలీవేజ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగుల వయోపరిమితిని 61ఏళ్లకు పెంచాలని చాడ వెంకట్‌రెడ్డి కోరారు. గతంలో కల్పించిన విధంగా బస్సు పాస్ సౌకర్యాన్ని పునరుద్ధరించడంతో పాటు ఉద్యోగులకు తెలంగాణ ఇంక్రిమెంట్లు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. టూరిజం ప్లాజా, ఏజెన్సీ, డైలీవేజ్ ఉద్యోగుల జీతాలను పెంచాలని కోరారు. టూరిజం ప్లాజాకు ప్రత్యేక జనరల్ మేనేజర్‌ను నియమించి, ఎండి ఆధీనంలో రెండు విజిలెన్స్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత టూరిజం కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలు కాలేదని సబ్బు రాజమౌళి అన్నారు. దీంతో ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలను గుర్తించి వాటి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా రాష్ట్ర పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని వారు సూచించారు. టూరిజం ఆధ్వర్యంలో ప్రస్తుతం నడుస్తున్న హోటళ్లను ఆధునికీకరించి లాభాల బాటలోకి తీసుకురావాలని, ప్రైవేటు సంస్థల ఆధీనంలో ఉన్న హోటళ్లను తిరిగి పర్యాటక సంస్థ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు ఉడుత రమేష్, పొంగలి శ్రీను, మనోహర్, మౌలాలి పాల్గొన్నారు.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ : సికింద్రాబాద్ జోన్**

**NIT No.** టెండర్ నోటీసు నెం. 16/EE-II/Cir-43/SBZ/GHMC/2026-27, తేది: 06.10.2026, **పని పేరు:** బతుకమ్మ పనులు : 4 నెం.లు, **అంచనా విలువ:** రూ.9.45లక్షలు, **బిడ్ సమర్పణకు ప్రారంభ తేది & సమయం / బిడ్ సమర్పణకు ఆఖరి తేది & సమయం :** 08.10.2026 సా.4.00గం.ల నుండి 13.10.2026 సా.4.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-43, తార్నాక. సెల్ నెం. 9704405076. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-43, తార్నాక, ఎస్‌బిజెడ్, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 11376-PP/CL/ADVT/2026-27, Date: 06-10-2026

**పురపాలక సంఘం - సిరిసిల్ల, జిల్లా: రాజన్న సిరిసిల్ల**

Lr. No. E1/SRCL/Quotation Notice-06/2026-27 Date: 05-10-2026

పురపాలక సంఘం, సిరిసిల్ల - పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేయుటకు గాను వస్తువులు / పరికరాలకు సంబంధించిన రేట్లు SSRలో లేని వాటి యొక్క యూనిట్ రేటు కొరకు సంబంధిత సప్లయ్‌దారులు లేదా ఏజెన్సీల నుండి సీల్డ్ కొటేషన్లు కోరనైనది.
1. చైన్ మౌంటెడ్ ప్రొక్లెయిన్ వెహికల్ యొక్క యూనిట్ రేట్లు
2. ఎలక్ట్రికల్ ఆటో వెహికల్ (EV-Autos) యొక్క యూనిట్ రేట్లు
3. 110 KW (Model No. PSE 370-600-70) సాఫ్ట్ స్టార్టర్ యొక్క యూనిట్ రేట్లు
4. బతుకమ్మ విగ్రహం (తల్లి & బిడ్డ) యొక్క యూనిట్ రేట్లు
కావున, సంబంధిత సప్లయ్‌దారులు లేదా ఏజెన్సీలు **తేది: 08.10.2026 రోజున సా.4.00 గంటలలోపు** మీ యొక్క సీల్డ్ కొటేషన్లు **ఇంజనీరింగ్ విభాగం, పురపాలక సంఘం, సిరిసిల్ల** యందు సమర్పించగలరు. మరియు ఏదేని వివరాల కొరకు ఇంజనీరింగ్ విభాగం, పురపాలక సంఘం, సిరిసిల్ల యందు కార్యాలయ పని వేళలో సంప్రదించగలరు.

సం/- కమిషనర్
పురపాలక సంఘం, సిరిసిల్ల.

DIPR R.O. No. : 11301-PP/CL/ADVT/2026-27, Date: 06-10-2026

## భార్య ఆత్మహత్య కేసులో భర్తకు శిక్ష

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** భార్య ఆత్మహత్య చేసుకోవటానికి కారకుడైన భర్తకు ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ జిల్లా సెషన్స్ జడ్జి భరతలక్ష్మి మంగళవారం తీర్పు చెప్పినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ధర్పల్లి రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపిన వివరాలు ఇందల్వాయి మండలం చంద్రాయన్‌పల్లికి చెందిన వేముల సాయిలు డిచ్‌పల్లి గ్రామ వాస్తవ్యులు మనోజకు 2016 లో వివాహం జరిగింది. పెళ్లిలో ఎలాంటి వరకట్నం లేకుండా పెళ్లి నిర్వహించుకున్నారు. కొన్నాళ్లకు వరకట్నం కావాలని సాయిలు భార్య మనోజను మానసిక, శారీరక చిత్రహింసలకు గురి చేసేవాడు. 'భార్యను ఉద్దేశించి నువ్వు చనిపోతే నేను మరొక పెళ్లి చేసుకుంటే నగదు కట్నం డబ్బులు వస్తాయని బాధలకు, హింసకు గురి చేసేవాడు. భర్త పెట్టే చిత్రహింసలు భరించలేని ఆమె చంద్రాయన్‌పల్లి గ్రామశివారులోని పెద్ద పోశవ్వ గుడి దగ్గర వేప చెట్టుకు 2024 అక్టోబర్ 13న ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. డిచ్‌పల్లి సర్కిల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కోర్టులో దాఖలు చేసిన చార్జిషీట్ ఆధారంగా సాక్షుల వాంగూల్మాలు నమోదు చేసిన సెషన్స్ జడ్జి భారత లక్ష్మి ధ్రువీకరించుకున్న పత్రాలు, వస్తుగత సాక్ష్యాలు మార్క్ చేసిన అనంతరం ముద్దాయి వేముల సాయిలుపై నేర నిరూపణ అయినట్లు నిర్ధారిస్తూ తీర్పు వెలువరించారు. భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 85 వరకట్న వేధింపులకు గాను మూడు సంవత్సరాల జైలుశిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధించారు. ఆత్మహత్య చేసుకోవటానికి కారకుడైనందున సెక్షన్ 108 ప్రకారం ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ సెషన్స్ జడ్జి భారతలక్ష్మి తీర్పు చెప్పారు.

## పటిష్టంగా పాఠశాలల మానిటరింగ్

### కలెక్టర్ ప్రతీక్ జైన్



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** జిల్లాలోని ఎఫ్‌ఎల్‌ఎస్ కాంపిటెంట్ స్కూల్స్ లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు ప్రాథమిక అక్షరాస్యత సంఖ్యా పరిజ్ఞానంతో నిర్దేశిత అభ్యసన ఫలితాలను సాదించేలా సమగ్ర శిక్షణ కార్యక్రమాలను సమర్థవంతగా అమలు చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబందిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ అదికారులు, ఎంఇఒలు, సిహెచ్‌ఎంలు సంబందిత పాఠశాలల ప్రదానోపాధ్యాయులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎఫ్‌ఎల్‌ఎస్ కాంపిటెంట్ స్కూల్స్‌లో సమగ్ర శిక్షణ కార్యక్రమాల అమలు పాఠశాలల పర్యవేక్షణ ఉపాధ్యాయుల హాజరు విద్యార్థుల అభ్యసన స్థాయి,,తదితర అంశాలపై కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎఫ్ఎల్ ఎస్ పాఠశాలల పర్యవేక్షణ పటిష్టంగా నిర్వహించాలని అధికారులు, క్షేత్ర స్థాయిలో పాఠశాలలను సందర్శించి విద్యాబోధన, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల అభ్యసన స్థాయిలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరును ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా క్రమం తప్పకుండా నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరుకు సంబంధించిన రోజువారీ నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. గైర్హాజరయ్యే ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. వచ్చే సోమవారం నుంచి జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు స్పష్టంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా విద్యాధికారి రోహిణి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి ప్రోటేషనరీ డిప్యూటీ కలెక్టర్లు, ఎంఇఒలు, సిహెచ్‌ఎంలు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వంలో ఆర్‌టిసి విలీనం ఎంప్లాయిస్ యూనియన్‌కే సాధ్యం




**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్:** ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను ప్రారంభించకుండా కాలయాపన చేస్తుంటే ఎఐటియుసి, టిఎంయు యూనియన్ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో ప్రభుత్వంపై చేసిన ఒత్తిడి మూలంగా ఎన్నికలకు ప్రభుత్వం అంగీకరించడం జరిగిందని, ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడం ఈ యూనియన్ల ద్వారానే జరిగిందని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య అన్నారు. మంగళవారం ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య, ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి బాల్‌రాజ్, టిఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్‌టిసి ఎన్నికల్లో కార్మిక సోదర సోదరీ మణులందరూ తమ అమూల్యమైన ఓటును ఎంప్లాయిస్ యూనియన్ బస్సుగుర్తుపైన టిఎంయు నిచ్చెన గుర్తుపైన వేసి భారీ మెజార్టీతో గెలిపించాల్సిందిగా కోరారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో కార్మికులు చేసిన సమ్మె ఫలితంగా ఆర్‌టిసిలో యూనియన్ల పునరుద్ధరణకు తలొగ్గి, ఆర్‌టిసి కార్మికుల సమస్యలను పరిష్కరించిందని, ప్రధాన డిమాండ్ అయిన ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను ఎఐటియుసి ఎంప్లాయిస్ యూనియన్ ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని ఎంప్లాయిస్ యూనియన్ గెలుపు ద్వారా ఖచ్చితంగా ఆర్‌టిసి కార్మికులకు బహుమతిగా ప్రభుత్వంలో విలీనం చేసి చూపిస్తామన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నెల హనుమాండ్లు, జిల్లా ఉపాధ్యక్షుడు చక్రపాణి, ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు. ఎఐటియుసి నాయకులు గోవర్ధన్, కవిత, అలీ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## భైంసాలో బీడీ కార్మికులు ధర్నా




**ప్రజాపక్షం/భైంసా :** బీడీ కార్మికులకు ఆసరా పెన్షన్ పథకంలో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ. మంగళవారం తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో, భైంసా ఐబి నుండి బస్టాండ్ వైపుగా, ప్రభుత్వ ఆసుపత్రి ముందు నుండి కోర్టు మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు బీడీ కార్మికులతో ధర్నా నిర్వహించారు, కార్యాలయ సిబ్బందికి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్ట రాజన్న మాట్లాడుతూ బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న వేలాది మంది కార్మికులు అనేక సంవత్సరాలుగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. 2014 ఫిబ్రవరి 28 నాటి కటాఫ్ డేట్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీడీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం.బక్కన , జిల్లా ఉపాధ్యక్షుడు రామలక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శి గంగన్న, జిల్లా కమిటీ సభ్యురాలు లక్ష్మి , సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకుడు మహేందర్, తదితరులు పాల్గొన్నారు

# మొక్కలు నాటితేనే కాదు..
# పెంచితేనే పర్యావరణ పరిరక్షణ

### కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలి
### రైతులకు అదనపు ఆదాయం కల్పించాలి
### గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా



**ప్రజాపక్షం/రామాయంపేట:** పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి విస్తృతంగా మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు బాధ్యత తీసుకోవాలని తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా మెదక్ ఎంపి రఘునందన్‌రావు రామాయంపేట నుండి సిద్దిపేట వరకు జాతీయ రహదారి 765 డిజి పక్కన చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమానికి గవర్నర్ ముఖ్యఅతిథిగా పాల్గొని జీడిమామిడి మొక్కలను నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. రైతులకు పర్యావరణ పరిరక్షణతో పాటు ఆర్థిక ప్రయోజనం కల్పించేలా ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. జీడిమామిడి వంటి పంటలతో తోటల పెంపకం చేపట్టడం ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా అదనపు ఆదాయ మార్గాలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాగు పద్దతులను అవలంబిస్తూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఉద్యాన పంటల సాగును విస్తరించాలని రైతులకు సూచించారు. ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సమస్త మానవ జీవితం ప్రకృతిపైనే ఆదారపడి ఉందని, భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాకు ఎంపి దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, లోక్‌భవన్ ప్రభుత్వ కార్యదర్శి దానకిషోర్, మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజుతో పాటు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిదులు, వివిద శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

### కలెక్టర్ హరిత



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్:** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి సేవల తీరు, మందుల పంపిణీ, భోజనం నాణ్యతను తెలుసుకున్నారు. గతంలో పాడైన లిఫ్ట్‌ను తన దృష్టికి వచ్చిన వెంటనే మరమ్మతులు చేయించి అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు అండగా ఉండాలని స్పష్టం చేశారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను కలెక్టర్ ప్రారంభించారు. రోగులకు, వారి సహాయకులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. క్యాంటీన్ల నిర్వహణతో మహిళా సంఘాలకు ఆర్థికంగా ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకుడు కిరణ్, వైద్యులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల వేతనాల పెంపునకు కృషి

### ఎమ్మెల్యే హరీష్ బాబు



**ప్రజాపక్షం / కాగజ్‌నగర్:** అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల వేతనాల పెంపు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు పేర్కొన్నారు. కాగజ్‌నగర్ మండలం రాస్పల్లిలో నిర్వహించిన పోషణ మాసం, అంగన్ మిలన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని టీచర్లు, ఆయాలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చాలీచాలని జీతాలతో అంగన్‌వాడీ సిబ్బంది సమాజానికి విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిడబ్ల్యూఒ స్వరూప, సిడిపిఒ రెబెకా, ఇన్‌చార్జ్ మాధవి, సూపర్‌వైజర్లు చందన, మాధవి, సర్పంచులు సుమన్, కోట వేణు, నాయకులు పుల్ల అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ ద్వారా పొలం రోడ్ల పనులు పూర్తి చేయాలి

### రైతుల సహకారం తీసుకొని పనులు చేయించాలి
### ఎమ్మెల్యే పవా ర్ రామారావు పటేల్



**ప్రజాపక్షం/భైంసా :** ముధోల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పొలం రోడ్ల పనులు పూర్తిచేయాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సూచించారు. మంగళవారం బైంసాలోని తన నివాసంలో ఎంపిడిఒలు,ఉపాధి హామీ ఎపిఒలు, టిఎలు, ఇసిలతో సమీక్షా సమావేశం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విబి–జి రాంజీ పథకంలో గ్రామాల్లో ఫార్మేషన్ రోడ్లకు పెద్ద మొత్తంలో నిధులు ఉన్నాయని,రోడ్లు వేసి,రైతులకు సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గత మూడు సంవత్సరాలుగా పనులు చేయాలని సమీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ పనులు నత్తనడక నా కొనసాగుతున్నాయని ఇకనైనా ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా సూచించారు. ప్రతి ఒక్కరు రైతు బిడ్డలేనని రైతులకు పొలాలకు వెళ్లడానికి రహదారి బాగుంటే ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు.రోడ్లకు అవసరమైనన్ని నిధులు ఇస్తానని, కావాలంటే 24 గంటల్లో ప్రొసీడింగ్ అందజేస్తానని పనులు పూర్తి చేయాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు.గ్రామ సభలు నిర్వహించి రైతుల సహకారం తీసుకొని రోడ్లు పూర్తి చేయాల్సిందిగా చెప్పారు.అదేవిధంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటల నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు.నిధులు కాగితాలకే పరిమితం కాకుండా వాటిని సద్వినియో గం చేసుకొని ప్రజలకు ఉపయోగపడేలా చూడాలన్నారు. లక్ష్య సాధనతో ముం దుకు సాగి పనులను దశలవారీగా పూర్తి చేయాల్సిందిగా సూచించారు. వి ధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు.సమావేశం లో ఎపిడి నాగవర్ధన్, ఎంపిడిఒలు, ఎపిఒలు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నా రు.

## ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తం

### ఎస్‌పి జానకి షర్మిల




**ప్రజాపక్షం /నిర్మల్ టౌన్ :** ప్రస్తుత ఆధునిక కాలంలో సైబర్ నేరగాళ్లు రకరకాల మార్గాల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ కార్యకలాపాలు నిర్వహించేటప్పుడు తీవ్ర అప్రమత్తత వహించాలని ఎస్‌పి డా. జి. జానకి షర్మిల సూచించారు. అక్టోబర్ జాతీయ సైబర్ భద్రత అవగాహన మాసాన్ని పురస్కరించుకుని సైబర్ నేరాల నివారణకు రూపొందించిన ప్రత్యేక అవగాహన పోస్టర్లను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆమె ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ, ప్రజలందరూ 'ఆగండి, ఆలోచించండి, ధృవీకరించండి' అనే ప్రధాన సూత్రాన్ని తప్పనిసరిగా పాటించాలని పిలుపునిచ్చారు. ఏదైనా అనుమానాస్పద ఫోన్ కాల్, సందేశం, లింక్ లేదా ఆన్‌లైన్ ఆఫర్ వచ్చినప్పుడు తొందరపడి స్పందించకుండా, ఒక్క క్షణం ఆగి ఆలోచించి, నిజానిజాలు ధృవీకరించుకున్న తర్వాతే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నకిలీ లోన్ యాప్‌లు, భారీ డిస్కౌంట్ ఆఫర్లు, ఆన్‌లైన్ పెట్టుబడులు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, నకిలీ కస్టమర్ కేర్, సోషల్ మీడియా మరియు యూపీఐ లావాదేవీల పేరుతో జరిగే మోసాల పట్ల ప్రజలు చైతన్యవంతంగా ఉండాలని కోరారు.బ్యాంకింగ్ మోసాలు పెరిగిపోతున్న దృష్ట్యా ఒటిపి, పిన్, సివివి, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు ఖాతా వివరాలు వంటి రహస్య సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. తెలియని లింకులపై క్లిక్ చేయడం, అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడం లేదా గుర్తుతెలియని వ్యక్తులకు డబ్బులు పంపడం వంటి పొరపాట్లు చేయవద్దని తెలిపారు. ఒకవేళ ఎవరైనా దురదృష్టవశాత్తు సైబర్ మోసానికి గురైతే, ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. సకాలంలో ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు సైబర్ క్రైమ్ విభాగానికి చెందిన అధికారులు,డబ్ల్యూఎస్‌ఐ శ్రావణి, ఎస్‌ఐ ముత్యం,తదితరులు పాల్గొన్నారు.

## భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### ఎమ్మెల్యే కోవలక్ష్మి



**ప్రజాపక్షం / కెరమెరి:** మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని, జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ కెరమెరి మండలం ధనోరా గ్రామ పంచాయతీ పరిధిలోని మిషన్ భగీరథ ప్లాంట్ వద్ద కార్మికులు చేపట్టిన ధర్నాకు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఇఇ, అకౌంటెంట్‌తో ఆమె ఫోన్‌లో మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరగా.. 14వ తేదీలోగా ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రజల తాగునీటి కష్టాలను తీర్చేందుకు కెసిఆర్ మిషన్ భగీరథ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనాలు కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ కార్మికులు, బిఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

### కలెక్టర్ భవేశ్ మిశ్రా



**ప్రజాపక్షం /ఖానాపూర్ :** అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఖానాపూర్ ఎంపిడిఒ కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ భూముల పరిరక్షణ,ప్రజా సమస్యల పరిష్కారంపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటించాలని, నిజమైన అర్హులకే ప్రభుత్వ ప్రయోజనం అందేలా క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టాలని సూచించారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి, నిర్మాణ పనులు వేగంగా జరిగేలా పర్యవేక్షించాలన్నారు. వివిధ శాఖల మధ్య సమన్వయం ఉండాలని తెలిపారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని,ఇప్పటికే ఆక్రమణకు గురైన భూములపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ.. అధికారులు ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సమగ్ర విచారణ చేపట్టాలని సూచించారు. సంక్షేమ పథకాల ఫలాలు అర్హులందరికీ చేరేలా చూడాలని, ముఖ్యంగా గిరిజనుల భూ సమస్యలను పరిష్కరించాలని కో రారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, ఆర్‌డిఒ దేవీదాస్, డివైఎస్‌పి శ్రీ కాంత్ రెడ్డి,తహసీల్దార్లు సుజాత, ఖాజా మొయినుద్దీన్,ఎంపిడిఒ రాధా రాథోడ్, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాత్రివేళల్లో అటవీ అధికారులు ప్రత్యేక గస్తీ

### అడవిపందుల బెడదపై అటవీశాఖ స్పందన

ప్రజాపక్షం ఎఫెక్ట్



**ప్రజాపక్షం / సిర్పూర్ (టి) :** సిర్పూర్ (టి) మండల కేంద్రంలో అడవిపందుల సంచారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారంటూ సోమవారం 'ప్రజాపక్షం' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అటవీశాఖ అధికారులు తక్షణమే స్పందించారు. పట్టణంలోని బస్టాండ్ చౌరస్తా నుంచి రై ల్వే స్టేషన్ రహదారి వరకు రాత్రి వేళల్లో అడవిపందులు గుం పులుగా తిరుగుతున్నాయన్న వార్తపై ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ) శ్రీనివాస్ ఆదేశాలతో సిబ్బంది రాత్రిపూట ప్రత్యేక గస్తీ చేపట్టారు. ప్రధాన రహదారులు, నివాస ప్రాం తాల్లో అడవిపందుల కదలికలను నిశితంగా గమనిస్తూ అప్రమత్తంగా ప హారా కాశారు. ప్రజాపక్షం దినపత్రిక కథనానికి స్పందించి వెంటనే రాత్రి గస్తీని ఏర్పాటు చేసిన ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్‌తో పా టు అటవీశాఖ సిబ్బందికి మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# సుధాకర్‌ది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే

### బాధితుడి కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి
### మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** భీమ్‌గల్‌లో చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పొలాస సుధాకర్ పోలీసుల వేధింపులు తాళలేక పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని, చికిత్స పొందుతూ మృతి చెందటం అత్యంత విషాదకరమని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. సుధాకర్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు తనను పోలీసులు ఇబ్బందులు పెడుతున్నారని సుధాకర్ కాలిన గాయాలతో స్వయంగా చెప్పిన సంగతి తెలిసిందే. చావుబతుకుల మధ్య ఉన్న వ్యక్తి చేసిన ఆరోపణలను కూడా పట్టించుకోకుండా పోలీసుల ప్రమేయం లేదని జిల్లా పోలీసు అధికారి సిపి అనడం బాధ్యతారాహిత్యమని వేముల అన్నారు. మృతుడి కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుధాకర్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు మేము ప్రజాస్వామిక పద్ధతిలో పోరాటం కొనసాగిస్తాం. తొందరలోనే ఎస్‌ఐపై హ్యూమన్ రైట్ కమిషన్‌లో ఫిర్యాదు చేస్తామని వేముల స్పష్టం చేశారు.

## సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ కోసం గిడ్డంగి పరిశీలన



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారంతో కూడిన అల్పాహారంను అందించేందుకు ప్రభుత్వ భాగస్వామ్యంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ కోసం నవీపేట్ మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ గిడ్డంగిని మంగళవారం ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులతో కలిసి పరిశీలించి, కిచెన్ ఏర్పాటుకు గిడ్డంగి భవనం అన్ని విధాలుగా అనుకూలంగా ఉందని నిర్ధారించారు. సుమారు 70 వేల మంది విద్యార్థులకు దీంతో అల్పాహారం అందించటం జరుగుతుందన్నారు. విద్యార్థుల ప్రయోజనాలతో ముడిపడి ఉన్న అంశం అయినందున అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు. వీరి వెంట తాహెర్‌బిన్ హందాన్, గంగాధర్, భుజంగరావు, రాజేంద్రకుమార్, సాయన్న, రాజేశ్వర్, రాకేష్, నర్సారెడ్డి, శేఖర్‌గౌడ్, నగేష్‌రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్ పోస్టుల ఇంటర్వ్యూలు

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండలం చల్మెడ గ్రామంలో అంగన్‌వాడీ టీచర్ పోస్ట్ భర్తీ విషయంలో అప్లై చేసిన వాళ్లందరి సర్టిఫికెట్లు గత నెలలో పరిశీలించి అర్హుల జాబితా తీశారు. ఈ మేరకు ఈరోజు ఎలిజిబుల్ అయినా ప్రతి దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూకి సంబంధించిన కాల్ లెటర్ ఇవ్వడం జరిగింది. ఇంటర్వ్యూ 15న ఐసిడిఐసి ప్రాజెక్టు రామాయంపేటలో నిర్వహించడం జరుగుతుందని సూపర్‌వైజర్ లక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లేశం ఉపసర్పంచ్ మహేష్ అంగన్వాడి ఆయాలు టీచర్లు ప్రజలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలోపేతానికి కృషి



**ప్రజాపక్షం / వాంకిడి:** ప్రజా సమస్యల పరిష్కారానికి, సంక్షేమ పథకాల అమలుకు కార్యకర్తలు నిరంతరం ప్రజలతో మమేకమై పనిచేయాలని డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క పిలుపునిచ్చారు. వాంకిడి మండలం ఆకిని, సరండీ, ఖమాన గ్రామాలకు చెందిన సుమారు 50 మంది మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి ఆమె కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ విధానాలు, సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు నూతనంగా చేరిన వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు తారిక్, భీంరావు, వాంకిడి మండల అధ్యక్షుడు గూర్నూలే మెంగాజీ, ఉపాధ్యక్షుడు పెంటూ, ఆసిఫాబాద్ పట్టణ అధ్యక్షుడు ఇమ్రాన్, జాబురె గణేష్, మాజీ సింగిల్ విండో చైర్మన్ దాదాజీ, అజ్జుమ్, అస్ఫాక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉప్పుల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వేతో భూ భారతికి శాశ్వత పరిష్కారం

కలెక్టర్ కోయ శ్రీహర్ష




**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** భూ భారతి రీసర్వే ద్వారా క్షేత్రస్థాయిలో ప్రతి భూమి హద్దులను ఖచ్చితంగా నిర్ధారించి, సమగ్ర భూ రికార్డులను రూపొందించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. రీసర్వే ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేలా రైతులు, ప్రజలు అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. మంగళవారం ఓదెల మండలం ఇందుర్తి గ్రామంలో నిర్వహించిన భూభారతి రీసర్వే అవగాహన సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొని, రీసర్వే ఉద్దేశ్యం, చేపట్టనున్న ప్రక్రియ, ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో చివరిసారిగా 1937లో భూ సర్వే జరిగిందని తెలిపారు. అనేక సంవత్సరాల అనంతరం ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అన్ని గ్రామాల్లో సమగ్ర రీసర్వే నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. భూముల హద్దులు, రికార్డులలో మార్పులతో సమస్యలుగతంలో ఒక సర్వే నంబర్‌లోని భూమి ఒకే వ్యక్తి వద్ద ఉండేదని, కాలక్రమేణా కొనుగోళ్లు, అమ్మకాలు, వారసత్వ బదలాయింపులు తదితర కారణాలతో భూములు అనేక చేతులు మారాయని తెలిపారు. పట్టాదారు పాస్‌పుస్తకాల్లో మార్పులు జరిగినప్పటికీ క్షేత్రస్థాయిలో ప్రతి భూమికి సంబంధించిన ఖచ్చితమైన మ్యాప్ అందుబాటులో లేకపోవడం వల్ల భూముల విస్తీర్ణంలో తేడాలు, హద్దులకు సంబంధించిన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నారు.ఈ సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు భవిష్యత్‌లో భూ వివాదాలకు అవకాశం లేకుండా చేయడమే సమగ్ర రీసర్వే ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రతి భూమిని క్షేత్రస్థాయిలో సర్వే చేసి ఖచ్చితమైన హద్దులను నిర్ధారిస్తామని చెప్పారు. పెద్దపల్లి జిల్లాలో మొత్తం 190 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని, మొదటి దశలో 70 గ్రామాలను రీసర్వే కోసం ఎంపిక చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ గ్రామాల్లో ఇందుర్తి కూడా ఒకటని పేర్కొన్నారు. రీసర్వేలో భాగంగా ముందుగా గ్రామ సరిహద్దులను నిర్ధారించి, అనంతరం ఇళ్లు, ప్రభుత్వ ఆస్తులు, వ్యవసాయ భూములను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేస్తామని తెలిపారు. సర్వే అనంతరం 21 రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణరీసర్వే పూర్తయిన అనంతరం గ్రామాల్లో భూ వివరాలను ప్రజల పరిశీలనకు ప్రకటిస్తామని తెలిపారు. భూ వివరాలపై ప్రజలకు 21 రోజుల గడువు ఇస్తామని, ఈ సమయంలో వచ్చిన అభ్యంతరాలను స్వీకరించి పరిశీలించి పరిష్కరిస్తామని పేర్కొన్నారు.అభ్యంతరాల పరిష్కారం అనంతరం తుది భూ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి భూధార్ కార్డులను జారీ చేస్తామని తెలిపారు. భవిష్యత్‌లో భూములకు సంబంధించిన వివరాలు సులభంగా గుర్తించేందుకు, భూ హక్కులకు భద్రత కల్పించేందుకు ఈ ప్రక్రియ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీసర్వే ద్వారా సుమారు 99 శాతం భూ సమస్యలను పరిష్కరించగలిగామని జిల్లా కలెక్టర్ తెలిపారు. భూముల విస్తీర్ణం, హద్దులు, ఇతర భూ సంబంధిత సమస్యలకు రీసర్వే ద్వారా శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి పోర్టల్ ద్వారా ఇప్పటికే అనేక భూ సమస్యలను పరిష్కరించామని తెలిపారు. రీసర్వే ద్వారా రూపొందించే ఖచ్చితమైన భూ రికార్డులు భూభారతి వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. రీసర్వేలో భాగంగా రోజుకు సుమారు 40 నుంచి 50 ఎకరాల వరకు సర్వే నిర్వహించే అవకాశం ఉందని తెలిపారు. రీసర్వే సమయంలో అధికారులు, సర్వే సిబ్బందికి రైతులు, ప్రజలు పూర్తి సహకారం అందించాలని, భూ వివరాలకు సంబంధించి ఏవైనా సందేహాలు లేదా అభ్యంతరాలు ఉంటే నిర్దేశిత ప్రక్రియలో వాటిని తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వనజ,సంబంధిత రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది, రైతులు, గ్రామస్థులు,తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాత ఆలయానికి కమ్యూనిటీ హాల్ మంజూరు కోరుతూ మంత్రికి వినతి



**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి మండలం తీగల ధర్మారం గ్రామంలోని పురాతన శ్రీ దుర్గామాత ఆలయానికి కమ్యూనిటీ హాల్ రేకుల షెడ్డు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ఆలయ కమిటీ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ధర్మపురి మండలంలో ఏకైక దుర్గామాత ఆలయంగా ఉన్న ఈ ఆలయానికి భక్తుల సౌకర్యార్థం కమ్యూనిటీ హాల్ అవసరమని వారు మంత్రికి వివరించారు.వినతిపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సానుకూలంగా స్పందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పందిరి అశోక్, మాజీ సర్పంచులు జంగిలి ప్రభాకర్, పందిరి తిరుపతి, ఆలయ కమిటీ చైర్మన్ జంగిలి రవీందర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.*నవరాత్రోత్సవాల కరపత్రం ఆవిష్కరణ* నవదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో ధర్మపురిలో అక్టోబర్ 11 నుంచి 20 వరకు నిర్వహించనున్న 13వ సంవత్సరం దేవి శరన్నవరాత్రోత్సవాల ఆహ్వాన కరపత్రాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమ్మవారి దయతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని కాపాడాలి: అందె అశోక్



**ప్రజాపక్షం/చేర్యాల :** సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని పార్టీ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ పార్టీ ఆద్వర్యంలో చేర్యాల తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్బంగా అశోక్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన బాధ్యతను విస్మరిస్తోందని ఆరోపించారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు, ప్రతిపక్ష పార్టీల ఫిర్యాదులపై స్పందిచకపోవడంవంటి పరిణామాలతో ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసం సన్నగిల్లుతోందన్నారు. “ రాజ్యాంగబద్ధ సంస్థగా ఎన్నికల సంఘం స్వతంత్రతను కాపాడాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తక్షనమే పదవి నుంచి తొలగించాలని, సమస్యలపై స్పందిచకపోతే దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామని సీపీఐ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, కుడిక్యాల బాల్ మోహన్, నంగి కనుకయ్య, సత్తయ్య గౌడ్, పొన్నబోయిన మమత, నాయకులు తదితరులు పాల్గోంన్నారు.

## ఆర్టీసి కార్మికులకు అండగా ఉన్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం



**ప్రజాపక్షం/హుజురాబాద్ :** కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. ఐక్య కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఈ నెల 9న జరిగే ఆర్టీసి ఎన్నికలకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్టీసి కార్మికులను ప్రభుత్వం ఎలా ఇబ్బంది పెట్టిందో వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్టీసి కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విశేషంగా కృషి చేస్తున్నారని అన్నారు. కార్మికులు ప్రభుత్వానికి వారధిగా మంత్రి పొన్నం నిలుస్తున్నారని గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో ప్రభుత్వానికి మద్దతుగా కార్మికులు నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, ఐక్య కూటమి నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**ప్రజాపక్షం/బెజ్జంకి:** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మానకొండూర్ ఎంఎల్‌ఏ డా.కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయలంలో 65 మంది లబ్దిదారులకు రూ.25.49 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు,41 మందికి కళ్యాణలక్ష్మి చెక్కులతో పాటు 12 మందికి ఇందిరమ్మ ఇళ్ళ మంజూరి పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు లింగాల శ్రీనివాస్,ఫ్యాక్స్ చైర్మెన్ ఒగ్గు దామోదర్,మండల పార్టీ మాజీ అధ్యక్షులు ముక్కీస రత్నాకర్ రెడ్డి,ఏఎంసీ చైర్మెన్ పులి కృష్ణ,సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షులు గూడెల్లి శ్రీకాంత్,నాయకులు బైర సంతోష్,రావుల నర్సయ్య,బొనగం రమేష్,వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఐఐటి–నీట్–సివిల్స్ పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్




**ప్రజాపక్షం/ములవాడ టౌన్:** వేములవాడ పట్టణంలోని హంసిని డిజి హైస్కూల్ కరస్పాండెంట్ నరాల సంతోష్ 4 నుండి 8 తరగతుల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రచించిన ఐఐటీ–నీట్–సివిల్స్ పుస్తకాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, నాయకులు ప్రతాప రామకృష్ణ, స్థానిక కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. చిన్న వయస్సు నుంచే విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి, భవిష్యత్తులో ఐఐటీ, నీట్, సివిల్స్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు అవసరమైన బలమైన పునాదిని వేసేందుకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందని అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అన్నారం శ్రీనివాస్, తూమ్ మధు, పాఠశాల డైరెక్టరు సన్నిధి వెంకట కృష్ణ, అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎసిబి వలలో జక్కాపూర్ పంచాయతీ కార్యదర్శి, కారోబార్

15వేలు స్వాధీనం




**ప్రజాపక్షం/సిద్దిపేట:** ఇంటి మ్యూటివేషన్ కోసం లంచం డిమాండ్ చేసిన గ్రామ పంచాయతీ కార్యదర్శి అరుణ, కారోబార్ సంతోష్‌ను ఏసిబి అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న సంఘటన మంగళవారం సిద్దిపేట జిల్లా నారాయణరావు పేట మండలంలో జరిగింది. జక్కాపూర్ గ్రామానికి చెందిన కయ్యాల కిషన్‌కు సంబంధించిన ఇంటిమోటివేషన్ చేసేందుకు పంచాయతీ కార్యదర్శి అరుణను ఆశ్రయించగా 20 వేల రూపాయలు డిమాండ్ చేసినట్లు తెలిపారు. దీంతో కిషన్ ఏసిబి అధికారులను ఆశ్రయించారు. ఈమేరకు పథకం ప్రకారం లంచం తీసుకుంటుండగా ఏసిబి అధికారులు పంచాయతీ కార్యదర్శి అరుణ,సంతోష్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్జీ-1లో గ్రావిటీ ఫిల్టర్ బెడ్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి

శుద్ధి చేసిన తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలి

ఎఐటియుసి నాయకుల డిమాండ్



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** సింగరేణి రామగుండం రీజియన్ పరిధిలోని కార్మిక కుటుంబాలకు శుద్ధి చేసిన తాగునీటిని అందించేందుకు రూ. 20 కోట్లతో చేపట్టిన గ్రావిటీ ఫిల్టర్ బెడ్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులను పరిశీలించిన తర్వాత ఆర్జీ వన్ సివిల్ డిపార్ట్మెంట్ కు వెళ్లి డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజు ను కలిసి నిర్మాణం పనుల పురోగతి ని తెలుసుకుని అనంతరం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను మాట్లాడుతూ రామగుండం రీజియన్ పరిధిలోని కార్మిక కుటుంబాలకు శుద్ధి చేసిన తాగునీటిని అందించేందుకు గ్రావిటీ ఫిల్టర్ బెడ్ నిర్మాణం చేపట్టాలని ఏఐటీయూసీ గత మూడు సంవత్సరాల క్రితం యాజమాన్యంపై ఒత్తిడి చేయడం వల్ల ఆర్జీ1 లో రెండు సంవత్సరాల క్రితం యాజమాన్యం ఫిల్టర్ బెడ్ నిర్మాణ పనులను ప్రారంభించిందని తెలిపారు.ఇంకా 50 శాతం పనులు పూర్తి చేసేందుకు బడ్జెట్ ను యాజమాన్యం కేటాయించకపోవడం వల్ల నిర్మాణ పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని ఆరోపించారు. తక్షణమే యాజమాన్యం పూర్తి స్థాయిలో బడ్జెట్ కేటాయించి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆర్జీ1 బ్రాంచి సహాయ కార్యదర్శి మాదన మహేష్, ఉపాధ్యక్షులు సంకె అశోక్, బోగ సతీష్ బాబు, బ్రాంచి నాయకులు దొంత సాయన్న, చెప్యాల భాస్కర్, బిట్టి వెంకటేశ్వర్లు, ఫిట్ సెక్రటరీలు మానాల శ్రీనివాస్, వెంకటయ్య, వెంకన్న, ప్రభుదాస్, నాయిని శంకర్, సమ్మయ్య, దాసరి శ్రీనివాస్, అటికేటి రాజు, బొల్లి శ్రీనివాస్, ఏ.వి.ఎస్. ప్రకాశ్,తాళ్ళపెల్లి కనకయ్య,సానా జలపతి, అజీం, అవునూరి రాజేశం, ముద్దసాని రంజిత్, దేవయ్య, చేరాలు, రమేశ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కుల సాధనకు ఐక్య కూటమికి అండగా నిలవాలి



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** ఈ నెల 9న జరగనున్న టీజీఎస్‌ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఈయూ–టీఎంయూ–ఎన్‌ఎంయూ జేఏసీ ఐక్య కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఏశమేని గణేష్, ప్రధాన కార్యదర్శి ఎం.డి. ముక్రం కోరారు. మెట్‌పల్లి ఆర్టీసీ డిపోలో కార్మికులను కలిసి ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు.కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, వేతన సవరణ, పీఆర్‌సీ, పదోన్నతులు తదితర సమస్యల పరిష్కారం కోసం ఐక్య కూటమి పోరాడుతోందన్నారు.ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధనకు కూటమికి మద్దతు ఇవ్వాలని కోరారు.బస్సు,నిచ్చెన గుర్తులపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో డిపో యూనియన్ అధ్యక్షుడు మురళీధర్,సెక్రటరీ రాములు, నాయకులు ప్రవీణ్, ఎంపీ రెడ్డి పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో 30 మంది కార్మికుల ఆత్మబలిదానాలు

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

టిడబ్ల్యూయు రాష్ట్ర అధ్యక్షులు అశ్వత్థామరెడ్డి



**ప్రజాపక్షం/గజ్వేల్:** బిఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆర్టీసీ కార్మికులు ఆత్మ బలిదానాలు చేసుకోగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని టిడబ్ల్యూయూ ఆర్టీసీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు అశ్వత్థామరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని జిపిపి డిపోను సందర్శించి ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారం చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలని గుర్తు చేశారు. ముఖ్యంగా ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు ఆరోగ్య సమస్యలు, పదవీ విరమణ అనంతరం లభించాల్సిన ప్రయోజనాలను సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వ వ్యతిరేక విధానాలతో 30 మంది ఆర్టీసీ కార్మికులు ఆత్మబలిదానాలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని చెప్పారు. ఎన్నికల సీఎం సమయంలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను ప్రారంభించాలని అన్నారు. ఆర్టీసీలో పని చేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రతతో పాటు మెరుగైన ఆరోగ్య సదుపాయాలు కల్పించాలనీ అశ్వత్థామరెడ్డి అన్నారు. కార్మికుల ఐక్యతతోనే హక్కులను సాధించుకోవచ్చని, గతంలో కూడా ఐక్య పోరాటాల ద్వారా 43 శాతం ఫిట్‌మెంట్ సాధించామని, అనంతరం మరో 16 శాతం సాధించామని వివరించారు. ఎన్నికల్లో బాణం గుర్తుపై ఓట్లు వేసి టిడబ్ల్యూయూ సంఘం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు పీఆర్సీ రెడ్డి, డిపో కార్యదర్శి నర్సింలు, సీనియర్ నేత ఆర్‌పీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ‘సర్’ ప్రక్రియ పారదర్శకంగా పూర్తి

ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బాల మాయా దేవి



**ప్రజాపక్షం/జగిత్యాల :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను పూర్తి పారదర్శకతతో, నిబంధనల మేరకు పకడ్బందీగా నిర్వహించాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బాల మాయా దేవి అధికారులను ఆదేశించారు. =అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా,అనర్హులైన లేదా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పేర్లపై చట్టబద్ధమైన విధానాలను అనుసరిస్తూ చర్యలు తీసుకోవాలని సూచించారు. మంగళవారంజగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో ఎస్ఐఆర్ ప్రక్రియపై ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బాల మాయ దేవి, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాయ దేవి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. హెల్ప్‌డెస్కుల వద్దకు వచ్చే ఓటర్లకు దరఖాస్తుల విధానం, అవసరమైన పత్రాలు, నోటీసులకు సంబంధించిన వివరాలను స్పష్టంగా తెలియజేసి, వారి సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఇప్పటివరకు సుమారు 70 శాతం పనులు పూర్తయ్యాయని అభినందించారు. అలాగే మిగిలిన 30 శాతం పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూరాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతి వారం సమావేశాలు నిర్వహించి, ఫారం6,7,8 దరఖాస్తుల స్వీకరణ, పరిష్కారం,పెండెన్సీ తదితర అంశాలపై తాజా పురోగతి వివరాలను పారదర్శకంగా తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్,జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధుసూదన్,జీవాకర్ రెడ్డి,నరసింహారావు,తదితరులు ఉన్నారు.

## రాజేశ్వరరావుపేటలో రూ.26 లక్షలతో కల్వర్ట్

నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



**ప్రజాపక్షం/మెట్‌పల్లి:** మెట్‌పల్లి మండలం రాజేశ్వరరావుపేట గ్రామంలో రూ. 26 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న నూతన కల్వర్ట్ నిర్మాణ పనులకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల శంకుస్థాపన చేశారు. కల్వర్ట్‌ని ర్మాణం పూర్తయితే శ్మశాన వాటికకు వెళ్లే మార్గంలో గ్రామ ప్రజలు, రైతులకు రాకపోకలు సులభతరం కానున్నాయి. ఈ సందర్భంగా గ్రామస్థులు కల్వర్ట్ ని ర్మాణానికి చర్యలు చేపట్టినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,అధికారులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ: టైటిల్ పోరులో విజేతగా నల్గొండ, కొత్తగూడెం జట్లు

విజయకేతనం ఎగరేసిన క్రీడాకారులు!

మంత్రి పొన్నం చేతుల మీదుగా బహుమతులు



**ప్రజాపక్షం/వేములవాడ టౌన్:** వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నమెంట్ తుది ఘట్టం సంచలన విజయాలతో ముగిసింది. గత కొన్ని రోజులుగా ఉత్కంఠభరితంగా, హోరాహోరీగా సాగిన ఈ క్రీడా సమరం క్రీడాభిమానులను విశేషంగా అలరించింది. మైదానమంతా అభిమానుల కేరింతలు, ఉత్సాహపూరిత వాతావరణం నడుమ జరిగిన గ్రాండ్ ఫైనల్స్ లీగ్ మ్యాచ్‌లలో విజేతలు జయకేతనం ఎగరవేశారు.

బాలుర విభాగంలో నల్గొండ విజయం: ఎంతో ఉత్కంఠగా సాగిన బాలుర విభాగం తుదిపోరులో వనపర్తి జట్టుపై నల్గొండ జట్టు అద్భుత ప్రదర్శనతో విజయం సాధించింది. ఆరంభం నుంచే వ్యూహాత్మక రైడింగ్‌లు, పక్కా ట్యాకిళ్లతో ఆధిపత్యం ప్రదర్శించిన నల్గొండ క్రీడాకారులు తుది వరకు హోరాహోరీగా పోరాడి టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. బాలికల విభాగంలో కొత్తగూడెం ఘనవిజయం: మరోవైపు బాలికల విభాగం ఫైనల్ మ్యాచ్‌లో ఖమ్మం జట్టుపై భద్రాద్రి కొత్తగూడెం జట్టు సంచలన విజయాన్ని నమోదు చేసింది. పాయింట్ పాయింట్‌కూ సాగిన ఈ హోరాహోరీ సమరంలో కొత్తగూడెం క్రీడాకారిణులు అద్భుతమైన సమన్వయంతో రాణించి విజేతగా నిలిచారు. మంత్రి చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.

## సిద్దిపేట మా అమ్మగారి ఇల్లు.. ఇక్కడికి ఎప్పుడైనా వస్తా: కవిత



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట మా అమ్మగారి ఇల్లు..ఇక్కడికి ఎప్పుడైన వస్తా ..వెళ్తూంటా వెంకట నారాయణ మా కుటుంబానికి ఆప్తులు అని తెలంగాణ రక్షణ సేనా చీఫ్ కల్వకుంట కవిత అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శివాజినగర్‌లో మాజీ సిఎం కెసిఆర్ పిఎ వెంకటనారాయణ మాతృమూర్తి మృతిచెందటంతో వారిని పరామర్శించి, సంతాపం వ్యక్తం చేశారు.కుటుంబ సభ్యులను ఓదార్చారు. విషాద ఘటనలో దేవుడు ఆకుటుంమానికి అండగా ఉండాలన్నారు. ఈసందర్భంగా కల్వకుంట కవిత మాట్లాడుతూ రానున్న రోజుల్లో సిద్దిపేటలో విస్తృతంగా పార్టీ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి జిల్లాలో పెద్దఎత్తున మీటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.రానున్న రోజుల్లో ఉమ్మడి జిల్లాలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సిద్దిపేటలో సైతం పార్టీ ఆఫీస్ నిర్మాణం చేపడుతామన్నారు. పెద్ద ఎత్తున క్యాడర్ నిర్మాణం జరుగుతుందన్నారు. యువతి, యువకులు గ్రామాల్లో ఉన్న ప్రజలు టిఆర్ఎస్ పార్టీని ఆదరిస్తున్నట్లు తెలిపారు. సిద్దిపేటలో కార్యచరణ బలంగా తీసుకుంటామన్నారు.

# కొత్తగూడెం కార్పొరేషన్ రూపురేఖలు మారుస్తా

- సుజాతనగర్ కేంద్రంలో రూ.10 కోట్లతో కళాశాల, పబ్లిక్ స్కూల్
- నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలి: సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- రూ.5.33 కోట్లతో 37 అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/సుజాతనగర్/పాల్వంచ:** సుజాతనగర్ కేంద్రంలో రూ.10 కోట్ల వ్యయంతో త్వరలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవనాల నిర్మాణాలు చేపట్టబోతున్నామని, ఈ ప్రాంత ప్రజలు, విద్యార్థుల చిరకాల ఆకాంక్షను నెరవేర్చడాన్ని గర్వంగా భావిస్తున్నానని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సుజాతనగర్ పట్టణం కోమటిపల్లి, నిమ్మలగూడెం, నాయకులగూడెం, డేగల మడుగు, లెనిన్ నగర్, లక్ష్మి దేవిపల్లి, మంగపేట, సుజాతనగర్, నర్సింహసాగర్ పరిధిలోని 20, 21, 23 డివిజన్లలో మొత్తం రూ.5.33 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న రోడ్లు, డ్రైన్లు, పార్కులు, ఇతర 37 అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపనలు చేశారు. ఇందులో భాగంగా 20వ డివిజన్‌లో రూ.1.99 కోట్లతో 16 పనులకు, 21వ డివిజన్‌లో రూ.1.43 కోట్లతో 9 పనులకు, 23వ డివిజన్‌లో రూ.1.91 కోట్లతో చేపట్టనున్న 12 అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో జరిగిన సభల్లో ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ డివిజన్లలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించి దశలవారీగా ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామని, తద్వారా కొత్తగూడెం కార్పొరేషన్ రూపురేఖలు మారుస్తానని స్పష్టం చేశారు. పట్టణ పరిధిలోని కాలనీల్లో నెలకొన్న రహదారులు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించి పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల నిర్మాణాల్లో ఎలాంటి నాణ్యతా లోపాలు లేకుండా అధికారులు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. కేటాయించిన ప్రజాధనం సద్వినియోగమయ్యేలా చూస్తూ, నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, నగర మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ లలిత, కాంగ్రెస్ నాయకులు నాగా సీతారాములు, మండే హనుమంతరావు, కమిషనర్ సుజాత, తాసిల్దార్ కృష్ణ ప్రసాద్, ఎస్ హెచ్ ఓ కళ్యాణి, కార్పొరేషన్ మేనేజర్ సత్యనారాయణ, డీఈ నరేష్, ఏఈ శ్రీకాంత్, హౌసింగ్ ఏఈ అర్పిత, విద్యుత్ ఏఈ కిషన్, వార్డు ఆఫీసర్లు రవికుమార్ విజయలక్ష్మి, మల్లిక, కృష్ణకుమారి, కార్పొరేటర్లు అనిత, శ్రావణి, స్థానిక నాయకులు భూక్య దస్రు, వాసిరెడ్డి మురళి, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, ఈర్ల మల్లేష్, తాళ్లూరి పాపారావు, బొడ్డు కేశవరావు, కొమారి కృష్ణ, భాగం కృష్ణ, బానోత్ వెంకట్, మంగ్యా, చందర్, హత్తిరామ్, కున్సోత్ శంకర్, భీమా, గుగులోత్ రవి, బండి రమేష్, దండు సురేష్, గడ్డం రాజేందర్, లావుడియా పాల్గొన్నారు.

**పల్లె పల్లెకూ బస్సు సౌకర్యం**
**ఆర్‌టిసిని ఆదరించాలి**
**గ్రామాల రహదారుల సమస్యలు పరిష్కరిస్తాం**



ప్రతీ పల్లెకు ఆర్‌టిసి బస్సు ప్రయాణ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండల పరిధి నారాయణరావుపేట గ్రామంలో మంగళవారం నూతనంగా ఏర్పాటు చేసిన పాల్వంచ టు దంతెలబోర ఆర్‌టిసి బస్ సర్వీసును లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా జెండా ఊపి బస్ సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ మారుమూల గ్రామాల ప్రధానరోడ్ల సమస్యలను పరిష్కరించామని అతి త్వరలో అంతర్గత రహదారుల పనులుకూడా పూర్తి చేస్తామని తెలిపారు. ప్రజా రవాణా ఆర్‌టిసి బస్సులను ప్రజలు ఆదరించాలని చెప్పారు. ఆర్‌టిసి బస్సుల్లో తక్కువ ఖర్చుతో సురక్షితంగా ప్రయాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నాగసీతారాములు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, సంగం, నారాయణరావుపేట,దంతెలబోర సర్పంచ్‌లు బానోత్ రవి, బండి సరస్వతి, నాయకులు బానోత్ రంజిత్, ప్రేమ్‌చంద్, ప్రశాంత్, సాయిలి శ్రీను, సిహెచ్ శ్రీను, సాయిలి వెంకన్న, వెల్లంకి శివరావు, సత్యనారాయణ రాజు, మేకా రాంబాబు, గ్రామ పెద్దలు, ఆర్‌టిసి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా పెసర కొనుగోళ్లు చేపట్టాలి



మార్కెట్‌ను సందర్శించిన రైతు సంఘం నేతలు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రైతులకు ఇబ్బందులు లేకుండా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పెసర కొనుగోళ్లు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ తెలిపారు. రైతు సంఘం బృందం మంగళవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి పెసర పంట కొనుగోళ్లను పరిశీలించి రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెసర పంట కొనుగోలు చేస్తున్నారని మార్కెట్‌కు వచ్చామని కానీ గోనే సంచులను అధికారులు ఏర్పాటు చేయడం లేదని రైతు సంఘం నాయకులకు తెలిపారు. ఈ సందర్భంగా దొండపాటి రమేష్ మాట్లాడుతూ పెసర కొనుగోళ్లలో రైతులకు ఎటువంటి కొర్రీలు, ఇబ్బందులు లేకుండా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని తెలిపారు. రైతులకు సమస్యలు లేకుండా అధికారులు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కార్యదర్శిని కలిసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు స్వర్ణ రమేష్, సుదర్శన్‌రెడ్డి, వెన్నా భాస్కర్, మాచర్ల శంకర్ పాల్గొన్నారు.

## స్వయం ఉపాధికి నైపుణ్య శిక్షణ దోహదం: ఎమ్మెల్యే జారే



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** బెండాలపాడు గ్రామానికి చెందిన మహిళలు ది మదర్ ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టు మిషన్ శిక్షణను పూర్తి చేశారు. శిక్షణ పూర్తిచేసిన మహిళలకు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మంగళవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఎంఎల్‌ఏ మాట్లాడుతూ వృత్తి నైపుణ్య శిక్షణతో మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. శిక్షణలో పొందిన నైపుణ్యంతో ఇంటి వద్దే టైలరింగ్ పనులు చేపట్టి ఆదాయం పొందాలని సూచించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఉపయోగకరమన్నారు. సర్టిఫికెట్లు అందుకున్న మహిళలు ఎంఎల్‌ఏకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఫజిల్ బక్షి, జూపల్లి ప్రమోద్, వెలుపుల సత్యనారాయణ, కారం శ్రీను, సందీప్, కుంజ గోపాల్, ఎస్‌కె నాసిర్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమగ్రాభివృద్ధే లక్ష్యం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** విద్యార్థుల సమగ్రాభివృద్ధే లక్ష్యమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. మంగళవారం పాల్వంచ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాబోధన, విద్యార్థులహాజరు పరీక్షలు నీట్‌కోచింగ్ మౌలిక వసతులు భోజన సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని వారి విద్యాప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. నీట్ కోచింగ్ విభాగం నిర్వహిస్తున్న అదనపు తరగతులను సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలను సాధించేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి పరీక్షల సన్నద్ధత తరగతుల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి విద్యతోపాటు నాణ్యమైన వసతులు, పౌష్టికాహారం పరిశుభ్రమైన వాతావరణం ఎంతో అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి: కలెక్టర్ దివాకర టిఎస్

**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్:** వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల నియోజక వర్గానికి సంబంధించి ఓటరు జాబితాను కొత్తగా తయారు చేస్తున్నందున అర్హత కలిగిన పట్టభద్రులు తప్పనిసరిగా తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మంగళవారం తెలిపారు. 2023 అక్టోబర్ 31 నాటికి పట్టభద్రులైన వారు అర్హులుగా 2 026 నవంబర్ 1ను అర్హత తేదీగా పరిగణిస్తూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాను కొత్తగా తయారు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. 2027 మార్చిలో శాసన మండలిలో ఏర్పడనున్న ఖాళీల నేపథ్యంలో ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల నియోజక వర్గంలో ఓటరుగా నమోదుకు అర్హత ఉన్న పట్టభద్రులు ఫారం 18లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్‌తో పాటు సంబంధిత ఏఈఆర్‌వో, అధికారికి ఫారం 18ను నేరుగా అందజేయవచ్చునని తెలిపారు. అవసరమైన ఆధార్ పత్రాలను దరఖాస్తుతో పాటు సమర్పించాలన్నారు. ఫారం 18 సమర్పించేందుకు నవంబర్ ఆరు చివరి తేదీ అని తెలిపారు.

## ‘రేపు’ ఖమ్మంలో జాబ్‌మేళా

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల ఎనిమిదిన ఖమ్మంలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హరేకృష్ణ మూవ్మెంట్ చారిటి ఫౌండేషన్, లెఅర్నెట్ స్కిల్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ ఎంపికలు జరగనున్నాయన్నారు. ఖమ్మం నగరంలోని టిటిడిసి భవన్‌లో గురువారం ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని తెలిపారు. హరేకృష్ణ ఫౌండేషన్‌లో ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్, డిస్ట్రిబ్యూషన్ ఇంచార్జి, మెయింటెనెన్స్ ఎగ్జిక్యూటివ్, స్టోర్ ఇంచార్జి, క్వాలిటీ కంట్రోల్ (ఇంచార్జి అండ్ ఎగ్జిక్యూటివ్), చెఫ్స్, ఐటి, హెచ్‌ఆర్ విభాగాల్లో ఖాళీలు ఉన్నాయని అర్హత, అనుభవం బట్టి నెలకు రూ. 18వేల నుంచి రూ.80వేల వరకు వేతనం చెల్లిస్తారని పని ప్రదేశం ముల్కలపల్లిలో ఉంటుందని తెలిపారు.ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతల ధృవపత్రాలు జిరాక్స్ కాపీలతో జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 7075936289, 9912465999 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## కోయ భాషను పరిరక్షించుకోవాలి

కమిషనర్ దివ్య దేవరాజన్



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలతో పాటు కోయ మాతృభాషను పరి రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలంగాణ పంచాయితీరాజ్ స్త్రీ, శిశు సంక్షేమశాఖ కమీషనర్ దివ్య దేవరాజన్ అన్నారు. స్థానిక గిరిజన భవన్‌లో నిర్వహించిన 12వ గోండి కోయ భాషా ప్రామాణిక వర్క్‌షాపులో ఆమె పాల్గొని మాట్లాడారు. వివిధ రాష్ట్రాల నుండొచ్చిన గిరిజన ప్రతినిధులు ఐదు రోజులపాటు సుదీర్ఘ జర్చలు జరిపి 15వేల భాషా ప్రామాణిక పదాలను సేకరించడం అభినందీయమన్నారు. కోయభాషకు లిపి లేకున్నప్పటికీ నిఘంటువు రూపకల్పన ద్వారా భాషా పరిమళలాను పరిరక్షించుకోవచ్చన్నారు. అనంతరం భద్రాచలం ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ తల్లి దండ్రులు పిల్లలకు విద్యతో పాటు కోయభాష సంస్కృతి సాంప్రదాయాలను నేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విద్యాచందన, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు ఆదివాసీ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## జిఓ నెం.76 ప్రక్రియ వేగవంతం చేయాలి: కలెక్టర్ అంకిత్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** జిఓ నెం.76 క్రింద వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కొత్తగూడెం ఆర్‌డిఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. దరఖాస్తుల స్క్రూటిని రికమండేషన్ డిమాండ్ నోటీసుల జారీ చెల్లింపుపై సమీక్షించారు. జిల్లాలో మొత్తం 4031దరఖాస్తులకు గానూ 2267 దరఖాస్తుల స్క్రూటిని పూర్తయిందని మిగిలిన వాటిని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే రికమండేషన్ చేసిన దరఖాస్తులను కూడా సంబంధిత రెవెన్యూ రికార్డులు ఆధారంగా మరోసారి ధృవీకరించాలని ఆదేశించారు. డిమాండ్ నోటీసులు చెల్లింపులు సేల్ ఆర్డర్లు, పట్టాల జారీ వివరాలు వేర్వేరుగా నమోదు చేసి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ప్రత్యేక దృష్టి సారించి పెండింగులు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

## విద్యుత్ చార్జీలు తగ్గించాలి

సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్



**ప్రజాపక్షం/భద్రాచలం:** ప్రజలు భారంగా మారుతున్న విద్యుత్ చార్జీలను తగ్గించాలని, నిత్యవసర సరుకుల ధరలు నియంత్రించాలని కోరుతూ సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో మంగళవారం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విద్యుత్ చార్జీలను పెంచుతూ ఇచ్చిన సర్క్యూలర్‌ను నిరశిస్తూ రాష్ట్రపార్టీ పిలుపులో భాగంగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలని, ఆకాశాన్ని అంటుతున్న నిత్యవసరాల ధరలను నియంత్రించాలని, భద్రాచలం నియోజకవర్గంలో ఇసుక లారీల బెడద నానాటికీ పెరిగిపోతోందని తద్వారా రోడ్లు ధ్వంసం కావడంతో పాటు ప్రజల ప్రాణాలు కూడా పోతున్నాయని చెప్పారు. ఏజెన్సీ 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని చట్టాన్ని ప్రభుత్వం విస్మరిస్తుందని దుయ్యబట్టారు. నిరుపేదలకు ఇంటి స్థలాలు కేయించి ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వాలని, డిమాండ్ల పరిష్కారం కోసం ప్రజలు ఐక్య ఉద్యమాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెచ్చల కల్పన, మధుసూధన్ రెడ్డి దాసరి సాయన్న, మునిగెల శివ ప్రశాంత్ మునిగెల మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## మద్దతు ధరలపై వివక్ష

- ఖమ్మంను కరువు జిల్లాగా ప్రకటించాలి
- 12న కలెక్టరేట్ వద్ద ధర్నా
- విద్యుత్ కోతలను నివారించాలి
- బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/ఖమ్మం :** కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరల ప్రకటన విషయంలో దక్షిణ భారతదేశం పట్ల తీవ్ర వివక్ష ప్రకటించిందని ఇక్కడ పండే ప్రధాన పంటలకు సంబంధించి ముఖ్యంగా వరి, పత్తి, మిర్చి పంటలకు మద్దతు ధరను ప్రకటించకపోవడం శోచనీయమని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు తెలిపారు. ఎల్‌నినో వల్ల ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటల నష్టాన్ని అంచనా వేసి కరువు జిల్లాలుగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మంజిల్లా సమితి సమావేశం మంగళవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ విద్యుత్ కోతలను నివారించాలని, కరువు జిల్లాలుగా ప్రకటించాలని, పంటల బీమాను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న కలెక్టరేట్ల వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి, పత్తి, మిర్చి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని వరికి ఎకరాకు రూ. 30వేలు, పత్తి, మిర్చికి రూ.50వేలు, ఇతర పంటలకు రూ. 20వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలన హేమంతరావు డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలు దారుణంగా విధిస్తున్నారని ఒక పక్క సాగునీరు లేక పంటలు ఎండిపోతుంటే మరో పక్క భూగర్భ జలాలు ఉన్న విద్యుత్ సరఫరా లేక పంటలు ఎండిపోతున్నాయని, నాణ్యమైన విద్యుత్‌ను 24 గంటల పాటు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. దారుణమైన కోతల కారణంగా రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని హేమంతరావు తెలిపారు. రైతు బీమాను అమలు చేయడం లేదని రైతు బీమాను నిలిపివేసిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మంది రైతులు వివిధ కారణాలతో చనిపోయారని హేమంతరావు తెలిపారు. తక్షణం రైతు బీమా, పంటల బీమా పథకాలను అమలు చేయాలని ఆయన కోరారు. ఇప్పటికే పత్తి దిగుబడి ప్రారంభమైనందున సిసిఐ కేంద్రాలను ఏర్పాటు చేసి క్వింటా రూ.10వేల చొప్పున పత్తిని కొనుగోలు చేయాలని లేని పక్షంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతామన్నారు. ప్రభుత్వం తీసుకు వచ్చిన ఎరువుల యాప్ రైతుల పాలిట శాపంగా మారిందని యాప్‌ను రద్దు చేసి స్వేచ్ఛగా మార్కెట్‌లో ఎరువులు లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తులను సకాలంలో కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగానికి ప్రభుత్వ తాత్సర్యం శాపంగా మారిందని సరైన సమయంలో సీతారామ ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే ఈనాడు ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదని ఉమ్మడి జిల్లా ప్రజలకు గోదావరి జలాలతో కరువు ఉండేది కాదన్నారు. ఇప్పటికైనా సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, రైతు సంఘం నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, రైతు సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారుల సమస్యలపై స్పందించండి



**ప్రజాపక్షం/కల్లూరు:** విద్యుత్ వినియోగదారుల సమస్యలపై వెంటనే స్పందించి సేవలు అందించాలని కల్లూరు లోని విద్యుత్ ఉప కేంద్రం నందు విద్యుత్ వినియోగదారుల సదస్సు ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ వరంగల్ వారు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక అధ్యక్షులు కే మాధవరావు ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. పెనుబల్లి విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని కల్లూరు, పెనుబల్లి, లంకపల్లి, తల్లాడ, పెద్ద కోరుకొండి , కుర్నవల్లి, విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో విద్యుత్ వినియోగదారుల సదస్సు జరిగింది. కొత్త వ్యవసాయ కనెక్షన్లు, మధ్య స్తంభాలు, దూరం సర్వీసులకు స్తంభాలు, గృహ జ్యోతి, ఉచిత బిల్లులు వినియోగదారుల సమస్యలు వేదిక వద్ద కొన్ని పరిష్కరించారు. మరికొన్ని వాయిదా వేశారు. ఆర్థికపరమైన ప్రమేయము ఉన్న సమస్యలు నమోదు చేసుకొని అధికారులకు అట్టి సమస్యలు పరిష్కారం కొరకై సలహాలు సూచనలు ఇచ్చారు. అదేవిధంగా సమస్యలు పరిష్కారం లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు పెడతామని పేర్కొన్నారు. తల్లాడ మండలం ముద్దనూరు కల్లూరు మండలం యజ్ఞ నారాయణపురంలో అదేవిధంగా డివిజన్ పరిధిలోని పలు గ్రామాలలో విద్యుత్ శాఖ సిబ్బంది కొందరు వినియోగదారుల వద్ద నుండి లంచాలను డిమాండ్ చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని వారిపై చర్యలు కు సిద్ధమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎల్ ని నో వర్షాభావంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని వారికి విద్యుత్ సరఫరాను చేయడంలో ఇబ్బందులు పెట్టవద్దని అదేవిధంగా విద్యుత్ ఘాతంతో గేదె మరణిస్తే ఆన్లైన్ చేయడానికి ఐదు నెలలు పట్టిందని ఈ విషయంపై అధికారులు కిందిస్థాయి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లాడ మండలంలో అధికారుల నిర్లక్ష్యంతో రెండు ఎకరాలలో బొప్పాయి తోట ఎండిపోయిందని అధికారుల ముందు రైతు ఏపూరి రామ్ గోపాల్ వాపోయాడు. సమాచారం అందించాలని స్పందించనిచో చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బందికి డబ్బులు ఇవ్వవద్దు అని వినియోగదారులను కోరారు. ఒకవేళ అడిగితే 1912 కిఫిర్యాదు చేయాలనిఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఆర్ శేషారావు, టెక్నికల్ సత్యనారాయణ, ఫైనాన్స్ ఎం రామారావు, స్వతంత్ర సభ్యులు, ఖమ్మం జిల్లా ఎస్ ఇ శ్రీనివాస చారి సత్తుపల్లి డిఇ శ్రీరాములు ,పెనుబల్లి డి ఈ శ్రీరాములు, పెనుబల్లి ఏడి ఇ రామారావు, ప్రసాదు తల్లాడ ఏడి సతీష్, కల్లూరు ఏ ఈ కె మహేంద్ర బాబు ,పెద్ద కోరుకొండి అధికారి ఆసిఫ్, సత్తుపల్లి ఏఈ ఉబ్బన శరత్ తోపాటు వినియోగదారులు పాల్గొన్నారు.

## కార్మికుల ఉసురుపోసుకుని ఇప్పుడు చిలుక పలుకులా!

- అక్రమ పొత్తులను కార్మికులు నమ్మే పరిస్థితి లేదు
- భారీ మెజారిటీతో ఎంప్లాయిస్ యూనియన్ కూటమిని గెలిపించండి : ఇయు రాష్ట్ర అధ్యక్షులు ఎస్. బాబు



**ప్రజాపక్షం/భద్రాచలం:** ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ పంచన చేరుతూ కార్మికుల ఉసురు పోసుకుంటున్న దొడ్డిదారి నాయకులు ఇప్పుడు మరోసారి టిఎస్ ఆర్‌టిసి కార్మిక లోకాన్ని మోసం చేసేందుకు చిలుక పలుకులు పలుకుతున్నారని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ బాబు ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గుర్తింపు సంఘం ఎన్నికల్లో భాగంగా ఎంప్లాయిస్ యూనియన్, ఎన్‌ఎంయూ, థామస్ రెడ్డి టిఎంయూ కూటమి జిల్లాలో మంగళవారం భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు డిపోల్లో కార్మికులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాచలం డిపో ఆవరణలో జరిగిన కార్యక్రమంలో శంకర్ గౌడ్ చిత్రపటానికి పూల మాలలేసి నివాళ్లర్పించారు. అనంతరం ఇయూ కూటమి పట్టణంలోని డిపో ఆవరణ నుండి అంబేద్కర్ సెంటర్ మీదుగా బ్రిడ్జి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ బాబు మాట్లాడుతూ జెఎసి ఆధ్వర్యంలో 55 రోజుల పాటు సమ్మె చేయించి 35 మందికార్మికులను అశ్వద్ధామరెడ్డి తన స్వార్థం ప్రయోజనాల కోసం పొట్టనపెట్టుకున్నారని, కనీసం మృతి చెందిన కార్మిక కుటుంబాల నేటి కూడా పరామర్శించక పోవడం సిగ్గ చేటన్నారు. వారికి అధికార దాహమే తప్ప కార్మిక శ్రేయస్సు పట్టదని యద్దేవా చేశారు. టిఎస్ ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయించే సత్తా ఉన్న ఏకైక యూనియన్ ఎంప్లాయిన్ యూనియన్, ఆ కూటమి అని చెప్పారు. ప్రభుత్వంతో జతకట్టే నాయకులు కార్మిక సమస్యలను పరిష్కరించే పరిస్థితి ఉండదని, ప్రభుత్వానికి అనుకూలంగా వంతపాడుతారని అలాంటి వారివల్ల కార్మిక వర్గానికి ఒరిగేదేమీ లేదన్నారు. అనంతరం ఎన్‌ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి మౌలానా మాట్లాడుతూ టిఎస్ ఆర్‌టిసికి చెందిన విలువైనా ఆస్తులను కాజేసే కుట్రతో అక్రమ పొత్తున పెట్టుకుని బాణం గుర్తుని దొంగిలించి కార్మిక ఎన్నికల్లో పాల్గొంటున్నారని, ఇది ముమ్మాటికీ అక్రమ పొత్తే అన్నారు. నిరంతరం కార్మికుల పక్షాన నిలబడి కార్మికులకు మేలు చేసేందుకు పనిచేసే యూనియన్ ఎంప్లాయిస్ యూనియన్ కూటమి అని, కాకీ, కద్దర్ మధ్య జరిగే ఈ ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ కూటమి క్లాజ్ 3 బస్సు గుర్తు, క్లాజ్ 2 కాగడ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ అప్పారావు, రాష్ట్ర కార్యదర్శులు జిఎస్ నారాయణ, కుందల భాస్కర్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, సిపిఐ పట్టణ కన్వీనర్ మారెడ్డి శివాజీ తో డిపోల నాయకులు సురేష్ మురళీ పవన్ క్రాంతి కుమార్ అక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అందాల పోటీ విజేతగా ఖమ్మం యువతి అలైఖ్య



**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ :** ఢిల్లీలోని వివాంటా హోటల్‌లో డికే పేజెంట్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు జిమ్మి గరిమా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రైడ్ ఆఫ్ ఇండియా 2026 గ్రాండ్ ఫినాలేలో ఖమ్మం నగరంలోని మమత రోడ్డు ప్రాంతానికి చెందిన కోవూరి అలైఖ్య విజేతగా నిలిచారు. ప్రైడ్ మిసెస్ తెలంగాణ 2026 (జి2) విభాగంలో ఆమె విజేతగా నిలిచి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈ కార్యక్రమంలో మిస్టర్, మిస్, మిస్ టీన్, మిసెస్ విభాగాలలో దేశ వ్యాప్తంగా పలువురు పోటీదారులు పాల్గొన్న ఈ వేడుకల్లో ఖమ్మం నుంచి కోవూరి అలైఖ్య పోటీలో పాల్గొన్నారు. కోవూరి అలైఖ్య అందంతో పాటు ప్రతిభా, ఆత్మవిశ్వాసం, ఆకట్టుకునే ప్రదర్శనతో పోటీలో అందరి దృష్టికి ఆకర్షించి వివిధ దశల్లో ప్రతిభ కనబర్చి టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. జ్యూరి ప్యానల్ సభ్యురాలిగా సోనాల్ గోపాలియా, వ్యాఖ్యాతగా అమన్ యాతన్ వర్మ వ్యవహరించారు. విజేతగా నిలిచిన అలైఖ్యను కుటుంబ సభ్యులతో పాటు పలువురు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఖమ్మంజిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు.







'సేవ్ డెమాక్రసీ' పేరుతో పార్లమెంట్ నుంచి నిర్వాచన్ భవన్ వరకు పాదయాత్ర చేపట్టిన ఇండియా కూటమి పార్టీల ఎంపిలు, నాయకులు. అడ్డుకున్న పోలీసులు. అరెస్టులు. బస్సుల్లో నాయకుల తరలింపు దృశ్యాలు

ఫొటోలు: ఎస్ఎస్ సిన్హా, న్యూఢిల్లీ


తెలంగాణ ప్రభుత్వం
జిల్లా కలెక్టర్, వరంగల్
రూఢి ప్రకటన
ఫారం - VII
( సబ్ రూల్ -1 రూల్-25, సెక్షన్ -19(1) చట్టం - 30/2013 ప్రకారం)

వరంగల్ జిల్లా రాజ పత్రము
నెం. 62/వరంగల్/2026, తేది: 03.10.2026

శ్రీయుత జిల్లా కలెక్టర్, వరంగల్ వారి
ఉత్తర్వు నెం. జి./1190/2026, తేది: 03.10.2026

ఆర్.సి.నెం.బి /961/2026 తేది: 09.09.2026

జిల్లా కలెక్టర్, వరంగల్ వారి ఆదేశానుసారం ఈ దిగువ నిర్దిష్టపరచిన వరంగల్ జిల్లాలోని రాయపర్తి మండలములోని బుర్హన్ పల్లి గ్రామములో ఉన్న భూమి విస్తీర్ణం ఎ. **4-10 1/2 గుంటలు** ప్రజా ప్రయోజనం నిమిత్తం అనగా నష్కల్ ప్రధాన కాలువకు 2R-6L-7L డిస్ట్రిబ్యూటర్ కొరకు KM 0.000 నుండి 0.975 వరకు విస్తరణ నిమిత్తం ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము / జిల్లా కలెక్టర్, వరంగల్ గారు భావించినారు. కావున ఇట్టి రూఢి ప్రకటన జారిచేయనైనది.
కావున, వరంగల్ జిల్లాలోని రాయపర్తి మండలములోని బుర్హన్ పల్లి గ్రామములలో ఉన్న ప్రతిపాదిత భూమి మొత్తం విస్తీర్ణం ఎ. **4-10 1/2 గుంటలు** ఎక్కువ లేదా తక్కువ స్టాండర్డ్ కొలత గల భూమి అవసరమయి ఉన్నదని బావించి, ఇట్టి రూఢి ప్రకటన చేయబడుతుంది.

షెడ్యూల్

గ్రామం: బుర్హన్‌పల్లి మండలం: రాయపర్తి జిల్లా: వరంగల్

| క్రమ సంఖ్య | సర్వే నెం. / ఇంటి నెం. | యాజమాన్యపు హక్కు | భూమి రకం | ప్రకటిత విస్తీర్ణం (ఎ.గుం.) | పట్టాదారులు (భూభారతి ప్రకారం) | వాస్తవ స్వాధీనదారు ఎంజాయ్‌మెంట్ ప్రకారం | విస్తీర్ణం | చెట్లు / కట్టడములు |
|---|---|---|---|---|---|---|---|---|
| 2R-6L-7L డిస్ట్రిబ్యూటరీ నష్కల్ కెనాల్ కి.మీ. 0.000 నుండి 0.975 వరకు | | | | | | | | |
| 1 | 310 | పట్టా | మెట్ట | 1-03 | కద్దూరి అంజయ్య తండ్రి ఉప్పలయ్య కరుదురి రాధమ్మ భర్త ఉప్ప లయ్య లావుడియ చెక్రు తండ్రి లాలు లవుద్య సంతోష్ తండ్రి చక్ర కర్దూరి కుమార్ తండ్రి అంజయ్య కద్దురి మల్లేష్ తండ్రి అంజయ్య | కదుదూరి అంజయ్య తండ్రి ఉప్పలయ్య | 0-22 | యూకలిప్టస్ ట్రీస్ - 350 |
| | | | | | | లావుడియ చక్రు తండ్రి లాల్కు | 0-21 | పైప్ లైన్ |
| | | | | | విస్తీర్ణం | | 1-03 | |
| 2 | 313 | పట్టా | మెట్ట | 0-22 | లావుడియ చెక్రు తండ్రి లాలు లవుద్య సంతోష్ తండ్రి చక్రు కద్దూరి సోయిలు తండ్రి ఎల్లయ్య కద్దూరి రజినీష్ తండ్రి బిక్షపతి కద్దురి మల్లేష్ తండ్రి అంజయ్య సూదుల ఉమాదేవి భర్త దేవేందర్ | కదుదూరి అంజయ్య తండ్రి ఉప్పలయ్య | 0-13 | |
| | | | | | | కదుదూరి బిక్షమ్ తండ్రి ఉప్పలయ్య | 0-09 | |
| | | | | | విస్తీర్ణం | | 0-22 | |
| 3 | 328 | పట్టా | మెట్ట | 1-10 | కొనుకటి సువర్ణ భర్త యాకయ్య కొనుకటి యాదమ్మ భర్త సాయిలు | కొనుకంటి సువర్ణ భర్త యాకయ్య | 0-01 | |
| | | | | | | కొనుకంటి సువర్ణ భర్త యాకయ్య | 0-14 1/2 | |
| | | | | | | కొనుకటి యాదమ్మ భర్త సాయిరెడ్డి | 0-11 | |
| | | | | | | కొనుకంటి సువర్ణ భర్త యాకయ్య | 0-12 1/2 | |
| | | | | | | కొనుకటి యాదమ్మ భర్త సాయిరెడ్డి | 0-11 | |
| | | | | | విస్తీర్ణం | | 1-10 | |
| 4 | 328 | పట్టా | మెట్ట | 0-14 | కొనుకటి యాదమ్మ భర్త అంజయ్య కోన్కటి మల్లయ్య భర్త వెంకయ్య | కొనుకటి పెద్ద యాదమ్మ భర్త అంజయ్య | 0-14 | |
| 5 | 330 | పట్టా | మెట్ట | 0-29 | కొనుకటి యాదమ్మ భర్త అంజయ్య యార సోమన్న తండ్రి మల్లయ్య కప్పల సోమరాజు తండ్రి అంజయ్య కొనుకటి వెంకన్న తండ్రి మల్లయ్య కప్పల అంజయ్య తండ్రి అయిలయ్య మేకల వెంకన్న తండ్రి కొమురుమల్లు యార రాజు తండ్రి మల్లయ్య | కొనుకటి మల్లయ్య తండ్రి వెంకటయ్య | 0-10 | పైప్ లైన్ |
| | | | | | | యార రాజు తండ్రి మల్లయ్య | 0-19 | పైప్ లైన్ |
| | | | | | విస్తీర్ణం | | 0-29 | |
| 6 | 331 | | | 0-12 1/2 | దొంతూరి కొమురయ్య తండ్రి రాజయ్య బొమ్మగాని మల్లయ్య తండ్రి బుచ్చయ్య బొమ్మగాని రాజేందర్ తండ్రి మల్లయ్య పిట్టల యాకయ్య తండ్రి సోమనర్సయ్య ఖమ్మం సోమయ్య తండ్రి సత్తయ్య పిట్టల సత్తమ్మ భర్త సోమ నర్సయ్య | బొమ్మగాని మల్లయ్య తండ్రి బుచ్చయ్య | 0-01 1/2 | |
| | | | | | | దొంతూరి కొము రయ్య తండ్రి రాజయ్య | 0-11 | |
| | | | | | విస్తీర్ణం | | 0-12 1/2 | |
| | మొత్తం : 4-10 1/2 | | | | మొత్తం : 4-10 1/2 | | | |

ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) భూసేకరణలో సముచిత పరిహారము మరియు పారదర్శకత, పునరావాస, పునరాశ్రయ హక్కు చట్టం, 2013 (నెం. 30/2013) లో సెక్షన్ -15 అనుసరించి భూసేకరణ పై ఆసక్తి గల వ్యక్తులు దాకలు చేసిన అభ్యంతరములు / ఆక్షేపణలు విచారించిన మీదట ఈ ప్రకటన జారి చేయడమైనది మరియు చట్టం నం.30/2013లోని U/s 15 అందించిన ప్రకారం ఆసక్తిగల వ్యక్తుల అభ్యంతరాలను విన్న తర్వాత మరియు తగిన విచారణ తర్వాత ఈ ప్రకటన చేయబడింది.

భూసేకరణ కారణంగా నిరాశ్రయం పొందే అవకాశం ఉన్న కుటుంబాలు ఏమి లేవు, ప్రభుత్వ ఆస్తులు ఏమి ఇందులో లేవు, మతపరమైన కట్టడములు కానీ ప్రదేశములు కానీ ఇందులో లేవు మరియు ఎటువంటి కులవృత్తులవారు, చిరు వ్యాపారులు, స్వయం ఉపాధి పొందేవారు కాని ఈ ప్రాజెక్ట్ మూలంగా నష్టపోవడం లేదు.

కావున, సెక్షన్ 31 మరియు చాప్టర్ III, భూసేకరణలో సముచిత పరిహారము మరియు పారదర్శకత, పునరావాస, పునరాశ్రయ హక్కు చట్టం, 2013 (నెం. 30/2013) లోని విషయములు ఈ ప్రాజెక్ట్ కు వర్తించవు.

భూసేకరణ చేపట్టబడిన భూమిలో బొగ్గు, ఇనుము, సున్నపు రాయి మరియు ఖనిజములు, ఇట్టి భూములలో లేదా కొంత భాగము లభ్యమైనచో ఆ ఖనిజములు ప్రాజెక్ట్ నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును, లేనియెడల స్వీకంచబడవు.

పైన చూపిన భూసేకరణ చేయు భూమి యొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, వరంగల్ మరియు రెవెన్యూ డివిజినల్ అధికారి, వరంగల్ గారి కార్యాలయములో అందుబాటులో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు భూసేకరణకు సంబందిచిన భూముల ప్లానును కార్యాలయము పని చేయు దినములలో తనిఖి చేసుకోవచ్చును.

సం/- భూసేకరణ అధికారి మరియు, రెవిన్యూ డివిజినల్ అధికారి, వరంగల్
సం/- అదనపు కలెక్టర్, (రెవెన్యూ) వరంగల్
సం/- జిల్లా కలెక్టర్, వరంగల్

DIPR RO NO. 964/LA/PP/Advt/Pub/2026-27


# 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' వెనక కుట్ర

- 'ఒకే దేశం, ఒకే రాజకీయ పార్టీ' అనేదే అసలు లక్ష్యం
- బిజెపి సర్కార్‌పై సిజెపి మండిపాటు
- 10న జంతర్‌మంతర్ వద్ద నిరసనకు వెళ్లొద్దని నోటీసులిస్తూ పోలీసులు బెదిరిస్తున్నారు : అభిజీత్ దీప్కే



**ఛత్రపతి సంభాజీనగర్ :** 'సర్' ప్రక్రియ, ఎన్నికల సంఘం పనితీరుపై విమర్శలు ఎదుర్కొంటున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ, ఈనెల 10 నుండి జంతర్ మంతర్ వద్ద కొత్తగా ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు సిజెపి ప్రకటించింది. అయితే మహారాష్ట్రలోని చంద్రపూర్ పోలీసులు సిజెపి కార్యకర్తలకు నోటీసులు పంపి, అక్టోబర్ 10న ఢిల్లీలో జరగనున్న నిరసనలో పాల్గొనవద్దని వారిపై ఒత్తిడి తెస్తున్నారని ఆ పార్టీ నాయకుడు అభిజీత్ దీప్కే ఆరోపించారు. మంగళవారం ఛత్రపతి సంభాజీనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీప్కే మాట్లాడుతూ బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అనేది కేవలం ఒక నినాదం మాత్రమేనని, దాని అసలు లక్ష్యం 'ఒకే దేశం, ఒకే రాజకీయ పార్టీ' అని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఎందుకు 'యోగి ఆదిత్యనాథ్ 2.0'గా మారడానికి ప్రయత్నిస్తున్నారని ప్రశ్నించారు. పోలీసుల చర్యలను నిరంకుశత్వంగా అభివర్ణించిన ఆయన, తన రాజకీయ ఆశయాల కోసం ఫడ్నవీస్ పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేయకూడదన్నారు. 'మహారాష్ట్ర పోలీసులే దేశంలోనే అత్యుత్తమ పోలీసు బలగమని, ఢిల్లీ పోలీసులు వారి నుండి నేర్చుకోవాలని నేను అనేకసార్లు చెప్పాను. కానీ చంద్రపూర్ పోలీసులు సిజెపి కార్యకర్తలకు నోటీసులు జారీ చేసి, జంతర్ మంతర్ వద్ద జరిగే నిరసనలో పాల్గొనవద్దని కోరడం బాధాకరం. అంతేకాకుండా, జంతర్ మంతర్ ప్రయాణానికి నిధులు ఎక్కడి నుండి వస్తున్నాయని కూడా వారు సిజెపి కార్యకర్తలను అడుగుతున్నారు. ఈ ఆందోళన హింసాత్మకంగా ఉంటుందని పోలీసులు (నోటీసులో) పేర్కొన్నారు. ఆందోళన హింసాత్మకంగా ఉంటుందని పోలీసులకు అంత ముందుగానే ఎలా తెలుసు? వారు ముందుగానే ఏదైనా ప్లాన్ చేశారా?' అని దీప్కే ప్రశ్నించారు. మహారాష్ట్ర పోలీసులు ఢిల్లీ పోలీసుల మాదిరిగా ఎందుకు ప్రవర్తిస్తున్నారు?, చంద్రపూర్ నుండి ఒక వ్యక్తి ఢిల్లీకి వెళ్తుంటే వారు ఏమి చేయాలి? అని ఆయన ప్రశ్నించారు. ఫడ్నవీస్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ, మహారాష్ట్ర గొప్ప వారసత్వం గురించి ఆయనకు అవగాహన ఉండాలని సిజెపి నాయకుడు అన్నారు. దేవేంద్ర ఫడ్నవీస్ ఎందుకు యూపి సిఎం యోగి ఆదిత్యనాథ్ 2.0 లాగా మారడానికి ప్రయత్నిస్తున్నారు? ఆయనకు మహారాష్ట్ర వారసత్వం గురించి తెలిసి ఉండాలని, రాజకీయ ఆశయాల కోసం మహారాష్ట్ర పోలీసులను అగౌరవపరచడం లేదా దుర్వినియోగం చేయడం సరి కాదన్నారు. తమ కార్యకర్తలను వేధించడానికి బదులుగా, తనను అరెస్టు చేయాలని, కావాలంటే తనను జైలులో పెట్టి ఉపా, ఎన్ఎస్ఎ వంటి చట్టాల కింద కేసులు నమోదు చేయవచన్నారు. కానీ తమ కార్యకర్తలను మాత్రం వేధించ వద్దన్నారు. చంద్రపూర్ జిల్లాలో పోలీసులు జారీ చేసిన రెండు నోటీసులు తన దృష్టికి వచ్చాయని, అలాగే రాజస్థాన్‌లో కూడా, అక్టోబర్ 10న జరగబోయే నిరసనలో పాల్గొంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ ముఖేష్ అనే వ్యక్తికి స్థానిక సిఐడి నోటీసులు జారీ చేసిందని ఆయన పేర్కొన్నారు. హింసకు దారితీసేలా సోషల్ మీడియాలో ఏమీ పోస్ట్ చేయవద్దని సిజెపి కార్యకర్తలకు పోలీసులు ఇచ్చిన ఆదేశాలను కూడా ఆయన విమర్శించారు. మహారాష్ట్రలో గిరిజన విద్యార్థుల నిరసన కార్యక్రమానికి నాయకత్వం వహిస్తున్న రాహుల్ పవారా కూడా పోలీసుల వేధింపులను ఎదుర్కొంటున్నారని దీప్కే ఆరోపించారు.

# సుప్రీంకోర్టుకు ... ముగ్గురు కొత్త న్యాయమూర్తులు ప్రమాణం

- 37కు చేరిన జడ్జీల సంఖ్య
- ప్రమాణస్వీకారం చేసిన వారిలో తెలంగాణ హైకోర్టు ప్రధానన్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ అపరేశ్ కుమార్‌సింగ్



**న్యూఢిల్లీ :** ప్రధానన్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ మంగళవారం సుప్రీంకోర్టుకు పదోన్నతి పొందిన ముగ్గురు కొత్త న్యాయమూర్తులచే ప్రమాణస్వీకారం చేయించారు. దీంతో సుప్రీంకోర్టులో పనిచేస్తున్న న్యాయమూర్తుల సంఖ్య 37కి చేరింది. ఇది మంజూరైన 38మంది న్యాయమూర్తుల కన్నా ఒకటి తక్కువ. న్యాయమూర్తులు సునీతా అగర్వాల్, దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ,అపరేశ్ కుమార్ సింగ్ ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఉన్నారు. వీరంతా కొత్త సుప్రీంకోర్టు బ్లాక్‌లోని ఆడిటోరియంలో ప్రమాణ స్వీకారం చేశారు.సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, న్యాయాధికారులు, వివిధ హైకోర్టుల అధికారులు హాజరయ్యారు. న్యాయమూర్తుల కుటుంబసభ్యులు, సుప్రీంకోర్టు, ఇతర హైకోర్టుల న్యాయవాదులు కూడా హాజరయ్యారు. సోమవారం కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రభుత్వం ముగ్గురు న్యాయమూర్తుల పేర్లను క్లియర్ చేసినట్లు ప్రకటించారు. సుప్రీంకోర్టు కొలీజియం సెప్టెంబరు 28న న్యాయమూర్తుల పేర్లను సిఫారసు చేసింది. ప్రస్తుతం సుప్రీంకోర్టులో పనిచేస్తున్న న్యాయమూర్తుల సంఖ్య 34కాగా, ముగ్గురు కొత్త న్యాయమూర్తులు ప్రమాణం చేయడంతో ఆ సంఖ్య 37కు పెరిగింది. భారత ప్రధాన న్యాయమూర్తితో సహా సుప్రీంకోర్టులో మంజూరైన న్యాయమూర్తుల సంఖ్య 38. సుప్రీంకోర్టు సవరణ చట్టం 2026 తర్వాత ఈ సంఖ్యను ఇటీవల 34 నుంచి 38కి పెంచారు. జస్టిస్ సునీతా అగర్వాల్ నియామకంతో 2021 ఆగస్టు 31నుండి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ బివి.నాగరత్న, 2026 జూన్ 2న నియమితులైన జస్టిస్ వెంకట సుబ్రమణి మోహనలతో కలిసి, సుప్రీంకోర్టులో మహిళా న్యాయమూర్తుల సంఖ్య మూడుకు పెరిగింది.జస్టిస్ సునీతా అగర్వాల్, జస్టిస్ నాగరత్నలకు హైకోర్టులో పనిచేసిన అనుభవం ఉండగా,జస్టిస్ మోహన్ బార్ నుంచి నేరుగా పదోన్నతి పొందారు. ఆమె సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాదిగా పనిచేశారు.జస్టిస్ నాగరత్న 2027లో ఒక నెలకంటే తక్కువ కాలంపాటు భారత ప్రధాన న్యాయమూర్తిగా కూడా బాధ్యతలు చేపట్టనున్నారు. జస్టిస్ అగర్వాల్, ఉపాధ్యాయ్ అలహాబాద్ హైకోర్టుకు చెందిన వారుకాగా, జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ జార్ఖండ్ హైకోర్టుకు చెందినవారు. జస్టిస్ సునీతా అగర్వాల్ గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, జస్టిస్ ఉపాధ్యాయ ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు.

# 10న జంతర్‌మంతర్ నిరసనలో పాల్గొంటాం

- ఐదు వామపక్ష విద్యార్థి సంఘాలు ప్రకటన

**న్యూఢిల్లీ :** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేస్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 10న ఇక్కడ జంతర్ మంతర్ వద్ద జరగనున్న నిరసనలో ఐదు వామపక్ష విద్యార్థి సంఘాలు పాల్గొంటాయని మంగళవారం విడుదల చేసిన ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ ప్రకటనలో, ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎఐఎస్ఎఫ్), స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ), ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా), ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్ (పిఎస్‌యు), ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ (ఎఐఎస్‌బి) తాము ఈ నిరసనలో పెద్ద సంఖ్యలో పాల్గొంటామని తెలిపాయి. తమ సామాజిక, సాంస్కృతిక నేపథ్యాలు, రాజకీయ అనుబంధాలతో సంబంధం లేకుండా వేలాది మంది, ఆధునిక భారతదేశపు ఊహ నిర్మించబడిన ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడానికి ఏకమైనట్లు ఆ ప్రకటన పేర్కొంది. భారత ఎన్నికల సంఘానికి, దాని పనితీరుకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలను ఢిల్లీ పోలీసులు బలప్రయోగంతో అణచివేస్తున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. నిరసనకారులపట్ల ఢిల్లీ పోలీసులు దురుసుగా ప్రవర్తిస్తున్నారు, లాఠీఛార్జ్ చేస్తున్నారు, ఈడ్చుకెళ్తున్నారు, దాడి చేస్తున్నారు, అసభ్యంగా తాకుతున్నారు, జర్నలిస్టులను కూడా వదిలిపెట్టడం లేదు అని ఐదు వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు ఆరోపించారు. విస్తృత ఉద్యమాన్ని నిర్మించడానికి తాము ఏకమవుతున్నామని విద్యార్థి సంఘాలు తెలిపాయి. రాజ్యాంగ విలువలను గౌరవించే ప్రజాస్వామ్య సంస్థలు, వ్యక్తులు అక్టోబర్ 10న జరిగే నిరసనలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ఎఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీరంగరాజన్, ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి సృజన్ భట్టాచార్య, ఎఐఎస్ఎ ప్రధాన కార్యదర్శి ప్రసేన్‌జీత్ కుమార్, పిఎస్‌యు ప్రధాన కార్యదర్శి బలరామ్ సజీవ్, ఎఐఎస్‌బి కన్వీనర్ అమిత్ సింగ్ ఈ ప్రకటనను విడుదల చేశారు.

# భౌతికశాస్త్రంలో ఫ్రాన్సిస్ హాల్జెన్‌కు నోబెల్



**స్టాక్‌హోమ్ :** భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతికి ఈ ఏడాది ప్రఖ్యాత శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ హాల్జెన్ ఎంపికయ్యారు. ఐస్‌క్యూబ్ న్యూట్రినో అబ్జర్వేటరీ ఏర్పాటుకు అందించిన విశేష సేవలతో పాటు ఖగోళ మూలాలు కలిగిన అత్యుత్తమ శక్తివంతమైన న్యూట్రినోలను కనుగొన్నందుకు ఫ్రాన్సిస్ హాల్జెన్ ఈ పురస్కారాన్ని గెలుచుకున్నారు. స్టాక్‌హోమ్‌లో జరిగిన కార్యక్రమంలో విజేత పేరును అకాడమీ అధికారికంగా వెల్లడించింది. ఈ ఏడాది నోబెల్ బహుమతి నగదు బహుమానం 1.2 మిలియన్ అమెరికన్ డాలర్లుగా ఉంది. ఫ్రాన్సిస్ హాల్జెన్ అంతర్జాతీయ పరిశోధకులు, ఇంజినీర్ల బృందానికి నాయకత్వం వహించి ప్రపంచానికి అద్భుతమైన పరికరాన్ని అందించారని, ఆయన పట్టుదల, శాస్త్రీయ దృక్పథం సరికొత్త ఖగోళ శాస్త్రానికి బాటలు వేశాయని నోబెల్ ఫిజిక్స్ కమిటీ చైర్మన్ మార్క్ పియర్స్ కొనియాడారు. బెల్జియంలో జన్మించిన 82 ఏళ్ల శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ హాల్జెన్ అమెరికాలోని విస్కాన్సిన్‌మాడిసన్ విశ్వవిద్యాలయంలో సేవలందిస్తున్నారు. తాను నోబెల్ బహుమతి గెలుస్తానని ముందే అంచనా వేసినప్పటికీ, ఈ ప్రకటన తనకు ఇంకా వింతగా అనిపించిందని హాల్జెన్ చెప్పారు. న్యూట్రినోలను భూత కణాలు (ఘోస్ట్ పార్టికల్స్)గా భావిస్తుంటారు. ఇవి మన చుట్టే తిరుగుతుంటాయి. న్యూట్రినోలు అనేవి ఊహించలేనంత చిన్న ద్రవ్యరాశి కలిగిన సూక్ష్మ మైన విశ్వ కణాలు. అయినప్పటికీ అవి ప్రతిచోటా ఉన్నాయి. అవి సూర్యుని వంటి నక్షత్రాల నుంచి వెలువడతాయి. ప్రతి సెకనుకు లక్షల కోట్ల కణాలు మన శరీరాల గుండా దూసుకుపోతాయి. వీటిని గుర్తించడం దాదాపు అసాధ్యం. ఈ కణాలను గుర్తించేందుకు దక్షిణ ధ్రువం వద్ద ఉన్న మంచును ఉపయోగించవచ్చని ఫ్రాన్సిస్ హాల్జెన్ కనుగొన్నారు. మంచు, కాంతి సెన్సార్లతో కూడిన ఐస్‌క్యూబ్ న్యూట్రినో అబ్జర్వేటరీ స్థాపనలో ఆయన కీలక పాత్ర పోషించారు. గతేడాది సబ్ అటామిక్ కణాల వింత ప్రవర్తనపై పరిశోధనలు చేసిన ముగ్గురు శాస్త్రవేత్తలకు భౌతికశాస్త్ర నోబెల్ లభించింది. వారి క్వాంటం టన్నెలింగ్ పరిశోధనల వల్లే ఎంఆర్ఐ మెషీన్లలో అత్యంత సున్నితమైన కొలతలు సాధ్యమయ్యాయి. మెరుగైన సెల్ ఫోన్లు, వేగవంతమైన కంప్యూటర్ల తయారీకి అది పునాది వేసింది. ఇప్పటికే 2026 నోబెల్ ప్రకటనల్లో భాగంగా వైద్యశాస్త్ర పురస్కారాన్ని ప్రకటించారు. కాంతి ద్వారా జీవకణాల్లోని అయాన్ ఛానెళ్లను నియంత్రించే పద్ధతులు, నాడి వ్యవస్థ కణాల పనితీరును అధ్యయనం చేసిన ముగ్గురు శాస్త్రవేత్తలకు ఈ పురస్కారం దక్కింది.

# ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల డంప్ స్వాధీనం

**దంతెవాడ:** ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో మావోయిస్టుల డంప్ బయటపడింది. భద్రతా బలగాలు పెద్ద ఎత్తున ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. బార్సూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోహ్కాబెడ, బుర్దుమ్ గ్రామాల మధ్య ఉన్న అటవీప్రాంతంలో సోదాలు నిర్వహించగా ఆయుధాలు బయటపడినట్లు పోలీసులు తెలిపారు. మంగనార్, బుర్దమ్, కోహ్కాబెడ గ్రామాల పరిసరాల్లో మావోయిస్టులు ఆయుధాలు నిల్వచేసినట్లు వచ్చిన సమాచారం మేరకు సోదాలు నిర్వహించామని, ఈ ఆపరేషన్‌లో డిఆర్‌జి, బస్తర్ ఫైటర్స్, సిఆర్‌పిఎఫ్ బలగాలు పాల్గొన్నట్లు ఎస్పి చంద్రమోహన్ సింగ్ వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న ఆయుధాల్లో ఒక ఎకె –47 రైఫిల్, ఒక ఇన్సాస్ రైఫిల్, ఆరు నాటు తుపాకులు, ఒక బ్యారెల్ గ్రనేడ్ లాంచర్, 9బిజిఎల్ షెల్స్, ఎకె –47 రైఫిల్‌కు చెందిన 23 తూటాలు, రెండు టిఫిన్ బాంబులు, 8 కుక్కర్ బాంబులు, 24 పిస్టన్ రాడ్ స్ప్రింగ్‌లు, 20 మీటర్ల వైరు, రెండు జతల మావోయిస్టు యూనిఫాం, 138 రౌండ్ల 315 బోర్ రైఫిల్ తూటాలు, వాకీటాకీ ఉన్నాయన్నారు. గతంలో దంతెవాడ జిల్లాలో జరిగి వేర్వేరు దాడుల్లో భద్రతా దళాల నుంచి మావోయిస్టులు 100 తుపాకులు దోచుకున్నారని ఎస్పి పేర్కొన్నారు. ఇందులో 72 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

# వస్తూత్పత్తి, రవాణా – వినియోగంపై సమగ్ర అధికార నిర్వహణ వ్యవస్థ

- ప్రతిపాదనకు కేంద్రమంత్రివర్గం ఆమోదం

**న్యూఢిల్లీ:** వస్తువుల ఉత్పత్తిస్థానం నుండి వాటిని రవాణా చేయడం, నిల్వచేయడం, సరఫరా, వినియోగం వరకూ ఒక సమగ్ర అధికార నిర్వహణా వ్యవస్థ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలియజేసింది. కేంద్ర మంత్రి అశ్వనీవైష్ణవ్ మంత్రివర్గ సమావేశానంతరం మంగళవారం పాత్రికేయులకు ఈ విషయం చెప్పారు.''ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ లాజిస్టిక్స్ అథారిటీ(ఐటిఎల్ఎ) పేరుతో ఈ అధికారిక వ్యవస్థ ఏర్పాటు చేసే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలియజేసింది. దేశంలో రోజు రోజుకూ పెరుగుతున్న అవసరాలు, వాటి భద్రత, నిర్వహణ, ఇతర సమస్యల పరిష్కారానికి వీలుగా ఈ ఐటిఎల్‌ఎను ఏర్పాటు చేస్తారు. సమగ్ర రవాణా, నిర్వహణ ప్రణాళిక, పరిశోధన, పర్యవేక్షణ, విధానపరమైన మద్దతు, డేటా విశ్లేషణలకోసం ఒక అత్యున్నతమైన ఆధిపత్య విభాగంగా ఈ ఐటిఎల్ఎ విధులు నిర్వహిస్తుంది. ఈ వ్యవస్థ మొతాన్ని నియంత్రించి కార్యకలాపాలు సాఫీగా సాగిపోయేలా చూస్తుంది. ముఖ్యంగా సంక్షోభ సమయాలు తలెత్తికుండా నియంత్రణ, నివారణకు దోహదపడుతుంది. అతుకుల బొంతలా ఉండే ప్రణాళిక, బహుళ రవాణా సంబంధిత మంత్రిత్వశాఖలు, ఏజన్సీల అమలు వ్యవస్థలో దీర్ఘకాలంగా ఉన్న సవాళ్ళను పరిష్కరించడానికి ఈ విభాగం ఉపయోగపడుతుంది.ఈ రవాణా ప్రణాళిక ప్రకారం రహదారులు,రైల్వేలు, ఓడరేవులు, షిప్పింగ్, పౌర విమానయానం,దేశీయ జలరవాణా, కోస్తాప్రాంత రవాణా, పట్టణ రవాణా, నిర్వహణలకు దోహదపడుతుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రూ.500 కోట్లు అంతకంటే ఎక్కువ ఖరీదైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ప్రభుత్వ సాంకేతిక అనుమతులకు సంబంధించిన బాధ్యతలను ఈ కొత్త వ్యవస్థ పర్యవేక్షిస్తుంది.

**రూ.10 వేల కోట్లతో ఎస్ఎంఇ గ్రోత్ ఫండ్**

చిన్న,మధ్యతరహా ఔత్సాహిక పరిశ్రమలలో ప్రత్యక్ష ఈక్విటీ పెట్టుబడులకోసం ఒక ఎస్ఎంఇ గ్రోత్ ఫండ్ (ఎస్‌జిఎఫ్)ను ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ మేరకు రూ.10,000 కోట్లు కేటాయించాలని ప్రధానమంత్రి మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం నిర్ణయం తీసుకుంది. దేశంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలలో కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం, సేవలు, వాటి తయారీ, నూతన ఆవిష్కరణలు చేపట్టడం, వ్యూహాత్మక విలువను పెంచడంకోసం పెట్టుబడులను పెంచే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కేటాయింపుల ద్వారా చిన్న, మధ్యతరహా పరిశ్రమలను అన్నివైపుల నుండీ పెట్టుబడులు ఆకర్షించే వ్యవస్థగా రూపుదిద్దడం వీలు అవుతుంది. ఇదిలా ఉండగా, ప్రధానమంత్రి నరేంద్రమోదీ గడచిన 25 సంవత్సరాలుగా అవిశ్రాంతంగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా రాష్ట్రంలో, కేంద్రంలో ఉన్నతస్థాయి ప్రజాపాలకుడుగా నాయకత్వ బాధ్యతలు కొనసాగించడంపట్ల కేంద్రమంత్రివర్గం ఆయనకు అభినందనలు తెలియజేసింది. గుజరాత్ ముఖ్యమంత్రిగా మోదీ పనిచేశారు, ఆ తర్వాత మొదట దేశం ముఖ్యం, పౌరులు ముఖ్యం అనే సూత్రం ఆధారంగా మార్గదర్శక రాజకీయాలు నిర్వహించారని మంత్రివర్గం ప్రశంసించింది. ఈ మేరకు మంత్రివర్గం ఒక తీర్మానం ఆమోదించింది. మంత్రి అశ్వనీ వైష్ణవ్ మాట్లాడుతూ, మోదీ మొదట గుజరాత్‌ను తన అభివృద్ధి మంత్రం ద్వారా జాతీయస్థాయి వేదిక పైకి తీసుకువచ్చారని, ప్రజల సమస్యలు పరిష్కరించారన్నారు.''స్వాగత్'' ద్వారా వ్యక్తిగతంగా ప్రజల సమస్యలను ఆయన ఆలకించి పరిష్కరించారని ఒక ఉదాహరణగా చెప్పారు. ఆయన చేపట్టిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 2010లో ఐక్యరాజ్యసమితి ప్రజాసేవా పురస్కారం లభించిందని గుర్తుచేశారు. ఆ తర్వాత స్తంభించిపోయిన ప్రాజెక్టులను పూర్తిచేయడం కోసం ప్రభుత్వాలను ఒకచోట చేర్చడంకోసం మోదీ ''ప్రగతి'' పథకాన్ని చేపట్టారని,తద్వారా ప్రాజెక్టుల పూర్తిని వేగవంతం చేశారన్నారు. దారిద్ర్య నిర్మూలనకు జన్‌ధన్ అకౌంట్లను తీసుకువచ్చారని, దేశంలో 60 కోట్ల జన్‌ధన్ అకౌంట్లు ఉన్నాయని, దాదాపు నాలుగు కోట్లకు పైగా కుటుంబాలు, 25 కోట్ల మది ప్రజలు పేదరికం నుండి బయటపడ్డారని చెప్పారు. పిఎం–కిసాన్ పథకం రూ.4లక్షల కోట్లు దాటిపోయిందని, పిఎం–జన్‌మన్ గిరిజన ప్రజలకు మద్దతుగా ఉందని చెప్పారు. పరిశుభ్రత, డిజిటల్ పేమెంట్లు, స్థానిక ఉత్పత్తులను మోదీ ప్రోత్సహించారని చెప్పారు. దేశాన్ని స్వయంసమృద్ధివైపు నడిపించారన్నారు.

# రేట్ల పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనలను.. ఇక.. ఏటా పరిశీలించనున్న జిఎస్‌టి మండలి

8న జరుగనున్న 57వ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం




**న్యూఢిల్లీ :** వస్తువులు, సేవల పన్ను (జిఎస్‌టి) మండలి, పన్ను రేట్ల మార్పులకు సంబంధించిన ప్రతిపాదనలను ఇకపై ఏడాదికి ఒకసారి మాత్రమే పరిశీలించనుంది. అలాగే అన్ని జిఎస్‌టి రేట్ల మార్పులు ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన ఏప్రిల్ 1 నుంచే అమలులోకి రానున్నాయి. ఆర్థిక శాఖ వర్గాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన, రాష్ట్ర ఆర్థిక మంత్రులు సభ్యులుగా ఉన్న జిఎస్‌టి మండలి, గతేడాది సెప్టెంబరులో పన్ను రేట్లు, శ్లాబులను హేతుబద్ధీకరించాలని నిర్ణయించింది. నాలుగు శ్లాబుల జిఎస్‌టిని (5,12, 18, 28 శాతం) 5, 18 శాతం అనే రెండు అంచెల నిర్మాణంగా పునర్వ్యవస్థీకరించారు. అక్టోబరు 8న జరుగనున్న 57వ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో, పన్ను రేట్ల మార్పులు ఎజెండాలో లేవని ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. భవిష్యత్తులో రేట్ల మార్పులను సంవత్సరానికి ఒకసారి చేపడతారని, అవి ఏప్రిల్ 1నుంచి అమలులోకి వస్తాయని వర్గాలు తెలిపాయి. జరుగనున్న సమావేశం హేతుబద్ధీకరణ కోసం, అస్పష్టతలను తొలగించడానికి పరిమితమైన అంశాలను ముందుకు తీసుకురావడం, స్పష్టతనిచ్చే ఇతర ప్రతిపాదనలలో భాగంగా ఇ–కామర్స్ ప్లాట్‌ఫారముల ద్వారా జరిగే డెలివరీలకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ లేకుండా సింగిల్ 5శాతం జిఎస్‌టి రేటు వర్తిస్తుందని కౌన్సిల్ ఆమోదించవచ్చు. 'చాలా వ్యాపారాలకు ఏ ఒక్క రాయితీ కన్నా స్థిరత్వమే ఎక్కువ విలువైనది' అని ఒక మూలం తెలిపింది. స్థిరమైన రేటు నిర్మాణం వల్ల ఒప్పందాలను వాటి కాలపరిమితికి అనుగుణంగా ధర నిర్ణయించవచ్చని, అలాగే మూలధన వ్యయాన్ని ప్రణాళిక చేసుకోవచ్చని అది పేర్కొంది. గత సంవత్సరం పున: సమీక్షించిన రేట్ల విధానం సుమారు ఏడాదిగా అమల్లో ఉందని, ఇది వినియోగదారులకు, పరిశ్రమకు , పన్ను రాబడులకు, ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనకరంగా ఉందని వర్గాలు తెలిపాయి. గత ఏడాది జిఎస్‌టి రేట్ల హేతుబద్ధీకరణ వినియోగాన్ని పెంచింది. దీంతో ఏడాదిగా జిఎస్‌టి రాబడులు కూడా వృద్ధి చెందాయి. ఈనెల జూన్ నుంచి నెలవారీ రాబడులు రెండంకెల వృద్ధిని నమోదు చేశాయి.

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
బుధవారం
07-10-2026
www.prajapaksham.in


# ఫ్రాన్స్‌లో 'జెన్ ఆల్ఫా' సమరభేరి



**పారిస్:** ఫ్రాన్స్‌లో దేశవ్యాప్తంగా కొనసాగుతున్న స్కూలు విద్యార్థుల ఉద్యమం తీవ్ర సంచలనం కలిగిస్తోంది.కనీస వసతుల కోసం విద్యార్థులు ప్రారంభించిన ఈ ఉద్యమాన్ని ''జెల్ ఆల్ఫా సమరభేరి''గా పేర్కొంటున్నారు.ఈ ఉద్యమంలో పాల్గొంటున్నవారంతా 18 ఏళ్ళలోపు వయసుగలవారే. ఈ ఉద్యమంలోకి ప్రస్తుతం దేశంలో ఉన్న కార్మిక సంఘాలు కూడా జత కలిశాయి. దీంతో విద్యార్థులతోపాటు వేలాదిమంది కార్మికులు కూ డా వీధుల్లోకి వస్తున్నారు.ఇప్పటికే 500 స్కూళ్ళు దేశవ్యాప్తంగా మూతపడ్డాయి. మరో 1000 పాఠశాలలపై దీని ప్రభావం పడింది. మొదట పారిస్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రారంభమైన ఈ ఉద్యమం దేశమంతటా విస్తరించింది.44 ప్రాంతాలను ప్రదర్శకులు దిగ్బంధించారు. కొన్నిచోట్ల ఈ ఉద్యమం తీవ్ర హింసాత్మకంగా మారడంతో ప్రభుత్వం దీనిని అల్లరిమూకల చేష్టలుగా చిత్రీకరించింది. కానీ మంగళవారంనాడు పారిస్ కాలమానం ప్రకారం వేలాదిమంది విద్యార్థులు,కార్మికులతో భారీ ప్రదర్శన తలపెట్టారు. ఈ ప్రదర్శన అదుపు తప్పితే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని,ఖచ్చితంగా ఈ ప్రదర్శన శాంతియుతంగానే జరగాలని ఫ్రెంచ్ ప్రభుత్వం,పోలీసు విభాగం ముందస్తు హెచ్చరికలు జారీ చేశాయి. పాఠశాలల్లో కనీస వసతులు కరువయ్యాయని విద్యార్థులు తొలుత స్వచ్ఛంధంగా వీధుల్లోకి వ చ్చారు. ఈ తర్వాత కొందరు టీచర్లు,తల్లిదండ్రులు కూడా ఈ ఉద్యమంలో చేరారు.దేశవ్యాప్తం గా ఈ ఉద్యమం విస్తరించింది. పాఠశాలల్లో తగినంతమంది ఉపాధ్యాయులు లేరని,పాఠశాల భవనాలు పాతబడిపోయాయని,మరుగుదొడ్లు పాడైపోయాయని,తరగతి గదులుక్రిక్కిరిసిపోతున్నాయని, కూర్చునే చోటు కూడా లేకుండాపోయిందని విద్యార్థులు తీవ్ర నిరసన తెలియజేస్తున్నారు. విద్యారంగానికి కేటాయించిన నిధులలో కోత విధించడంపై విద్యార్థుల్లో తీవ్ర ఆగ్రహం పెల్లుబికింది. విద్యార్థులు వీధుల్లో,టైర్లు,బారికేడ్లను తగలబెట్టారు. కొన్నిచోట్ల స్కూలు భవనాలను దగ్ధం చేశారు. ప్రదర్శకులను అదుపు చేసేందుకు పోలీసులు బాష్పవాయు ప్రయోగం,లాఠీచార్జీలకు దిగారు. ఉద్యమం మొదలైనప్పటినుండీ ఈనాటి వరకూ 5000 మందిని పోఒలీసులు నిర్బంధించారు. 14 మంది సూత్రధారులకు పోలీస్ రిమాండ్ విధించారు. ఐనప్పటికీ ఈ ఉద్యమం ఆగలేదు.

# ప్రముఖ రచయిత జెఫ్రీ ఆర్చర్ కన్నుమూత

- ప్రపంచదేశాల్లో 32 కోట్ల పుస్తక ప్రతుల విక్రయం
- మరణించినరోజే చివరి నవల 'ఆడమ్–ఈవ్' విడుదల



**లండన్:** సెలబ్రిటీ రచయిత జెఫ్రీ ఆర్చర్ మంగళవారం లండన్‌లో కన్నుమూశారు. ఆయన వయసు 86 సంవత్సరాలు.ఐదు దశాబ్దాలపాటు అవిశ్రాంతంగా ఆయన రచనావ్యాసంగం కొనసాగించారు.ప్రపంచవ్యాప్తంగా 119 దేశాల్లో అత్యధికంగా రచనలు అమ్ముడుపోయిన ఆంగ్లేతర రచయితలలో ముఖ్యుడు జెఫ్రీ ఆర్చర్.ఆయన బ్రిటిష్ కన్జర్వేటివ్ పార్టీ నాయకుడు కూడా. అనేక దశాబ్దాలపాటు కొనసాగిన ఆయన అంతర్జాతీయ సాహిత్య జీవితప్రస్థానంలో అనేక దేశాల్లో 32 కోట్లకు పైగా ఆయన పుస్తక ప్రతుల విక్రయాలు జరిగాయి.ఆయన సృష్టించిన విలియమ్ వార్విక్ కానిస్టేబుల్ పాత్ర వరస సిరీస్‌లో ఎదురులేని వృత్తిరంగా ఉన్నతస్థానాలు చేరుకుంటుంది. ఈ కాల్పనిక క్రైమ్ సిరీస్ పాత్ర ఆయనకు గొప్ప పేరు తెచ్చింది. జెఫ్రీ ఆర్చర్ ఎన్నో సుప్రసిద్ధ నవలలు,చిన్న కథలు రాశారు.2025లో ఇండియా గ్లోబల్ ఫోరమ్ అవార్డ్స్ సందర్భంగా తన చివరి ప్రాజెక్టు ''ఆడమ్ అండ్ ఈవ్'' ప్రారంభించినట్లు చెప్పారు.134 సార్లు పునర్ముద్రణ పొందిన ''కేన్ అండ్ ఏబెల్''నవలను మించిపోతుందన్న అంచనాలు వెలువడ్డాయి.ఈ చివరి రచన ఆయన మరణించిన మంగళవారం రోజునే ప్రచురితమవుతోందని రాయిటర్స్ వార్తాసంస్థ ప్రకటించింది.14.5 సంవత్సరాలపాటు సండేటైమ్స్ బెస్ట్ సెల్లర్స్‌జాబితాలో,ఐదు సంవత్సరాలపాటు న్యూయార్క్ టైమ్స్ బెస్ట్ సెల్లర్స్ జాబితాలో ఆయన కొనసాగారు.పాతికేళ్ల తన సర్వస్వంగా భావించిన జెఫ్రీ ఆర్చర్ తన మరణానికి ఇరవై నాలుగు గంటల క్రితమే టైమ్‌స్క్వేర్ థియేటర్‌లో పాఠకులను కలుసుకుని వారికి తన ఆటోగ్రాఫ్‌లు ఇచ్చారు.ఆయన రాకసందర్భంగా థియేటర్‌లో ఒక్కసీటు కూడా ఖాళీలేకుండా టిక్కెట్లు అన్నీ అమ్ముడైపోయాయి.నిద్ర విరామ సమయంలో ఆయన ప్రశాంతంగా కన్నుమూశారు. జెఫ్రీ ఆర్చర్ బాల్యమంతా వెస్టన్ సూపర్‌మేర్ ప్రాంతంలో గడిచింది.ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఆయన చదువుకున్నారు.1974లో ఆయన మొదటి రచన ''నాట్ ఎ పెన్నీ మోర్, నాట్ ఎ పెన్నీ లెస్''వెలువరించారు. ఒక లిటరరీ ఏజెంట్ ద్వారా మొదటిసారి ఈ రచన అమెరికాలో ప్రచురితమైంది. 1976లో బిబిసి రేడియోలో ఇది ప్రసారమైంది.1979లో ఆయన అత్యుత్తమ నవల ''కేన్ అండ్ ఏబెల్'' పాఠకుల జేజేలు అందుకుంది.ఆ నవల విపరీతంగా అమ్ముడుపోయింది. దీంతో ఆయన న్యూయార్క్ టైమ్స్ వారి బెస్ట్ సెల్లర్స్ జాబితాలో చేరిపోయారు. ఆయన ఉత్తమ రచనలు టీవీలలో మినీ సిరీస్‌గా వచ్చాయి. ప్రముఖ నటులు ఆయన సృష్టించిన పాత్రలు పోషించారు. 1984లో ఆయన రాసిన ''ఫస్ట్ ఎమాంగ్ ఈక్వెల్స్'' నవల సూపర్ హిట్ అయ్యింది. నలుగురు రాజకీయ నేతలు ప్రధానమంత్రి అయ్యేందుకు పోటీ పడతారు ఈ నవలలో.ఎ ట్విస్ట్ ఇన్ ద కథాసంకలనం,1996లో రాసిన ఫోర్త్ ఎస్టేట్ నవల బాగా ప్రాచుర్యం పొందాయి.''ఓన్లీ టైమ్ విల్ టెల్''పేరుతో మొదలుపెట్టి ఏడు భాగాలుగా ఆయన రాసిన సిరీస్ నవలలు ప్రపంచవ్యాప్తంగా ప్రచురితమై ఆదరణ పొందాయి. ఈ సిరీస్‌లో ఆయన 2016లో రాసి ప్రచురించిన చివరి ఏడవ నవల ''దస్ వజ్ ఏ మేన్''. 1940ఏప్రిల్ 15వ తేదీన జన్మించారు. ఆయన భార్య డామ్ మేరీ ఆర్చర్ (81) సోలార్ ఎనర్జీ కన్సల్టెన్సీలో ప్రత్యేక నిపుణురాలు. వారికి ఇద్దరు పిల్లలు.1967 నుండి 2001 వరకూ ఆయన కన్జర్వేటివ్ పార్టీలో కొనసాగారు. తర్వాత నుండి నాన్–ఎఫిలియేటెడ్‌గా ఉన్నారు. బ్రిటన్ ఎగువసభ హౌస్ ఆఫ్ లార్డ్స్ నుండి 2024లో ఆయన పదవీ విరమణ తీసుకున్నారు. 1969 నుండి 1974 వరకూ ఆయన లింకన్‌షైర్ నుండి పార్లమెంటు సభ్యుడుగా ప్రాతినిధ్యం వహించారు. 1985–86లో మార్గరెట్ థాచర్ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో కన్జర్వేటివ్‌పార్టీ డిప్యూటీ ఛైర్మన్ బాధ్యతల్లో కొనసాగారు.ఒక సెక్స్‌వర్కర్‌కు డబ్బులు చెల్లించారన్న ఆరోపణలు ఎదుర్కోవడంతో ఆయన పదవి నుండి వైదొలగారు. ఆ తర్వాత సవాలు చేసి ఆ పత్రికపై కోర్టులో కేసు గెలిచారు. పరువునష్టం కింద 5,00,000 పౌండ్ల భారీ మొత్తాన్ని తీసుకున్నారు.ఐతే 1999లో ఈ కేసు మళ్లీ తెరమీదకు వచ్చింది. న్యాయ వ్యవస్థ ముందు నిజం చెబుతానని ప్రమాణం చేసి అసత్యాలను వల్లెవేసినందుకు ఆయనకు నాలుగు సంవత్సరాలు జైలుశిక్ష పడింది.ఒక చవకబారు హోటల్‌లో ఇలాంటి పనులు ఆయనకు అవసరమా? అని న్యాయమూర్తి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఆ తర్వాత 2003లో ఆయన జైలు నుండి విడుదలై మళ్ళీ హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడుగా 2024 వరకూ కొనసాగారు.

# గద్దీ ఛోడ్

(మొదటి పేజీ తరువాయి)

అంటూ ప్రదర్శకులు నినాదాలు చేశారు.సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా,సిపిఐ జాతీయ కార్యదర్శి,పార్లమెంటు సభ్యుడు పి.సందోష్ కుమార్,రాజ్యసభ ఎంపీ పి.పి.సునీర్,లోక్‌సభ ఎంపీ ఎం.సెల్వరాజ్ ప్రదర్శనలో పాల్గొన్నారు.ప్రదర్శన సందర్భంగా ముగ్గురు సిపిఐ సిట్టింగ్ ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.తీవ్ర అక్రమాలు,అవకతవకలకు పాల్పడిన జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ప్రదర్శకులు కోరారు.13 కోట్లమందికిపైగా ఓటర్లను ఓటర్ల జాబితాల నుండి తొలగించడానికి ఆయన కారణభూతుడయ్యారని,అర్హులైనవారు ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి ఉద్దేశించిన ఫారమ్–6లో ఏకపక్షంగా మార్పులు చేశారని విమర్శిస్తూ ప్రదర్శకులు నిరసన కార్యక్రమం చేపట్టారు.ఓటర్ల జాబితాల సమగ్ర సవరణ ప్రక్రియ నిలిపివేయాలని,రద్దుచేసిన ఓటర్ల ఓటు హక్కును పునరుద్ధరించాలని,బ్యాలెట్ పత్రాల విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీలు ఈ నిరసన ప్రదర్శనలు చేపట్టాయని పార్టీ జాతీయ కార్యదర్శివర్గం పేర్కొంది.

**ఎంపీల అరెస్టులు– ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటు**

చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడటమే కాకుండా బిజెపి ద్వారా ఎన్నికల్లో గెలిచిన ఎంపీలతోసహా ప్రతిపక్ష ఎంపీలను అరెస్టులు చేయడం వంటి పెత్తందారీ చర్యలు దేశ ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటు అని సిపిఐ ఒక ప్రకటనలో విమర్శిస్తూ, అరెస్టులను ఖండించింది.పార్లమెంటు సభ్యులను అరెస్టుచేయడం,వారిపై దాడి చేయడం ద్వారా ప్రజాస్వామ్య వాణిని అణచివేయలేరని పార్టీ జాతీయ కార్యదర్శివర్గం హెచ్చరించింది.పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికల సమగ్రత మౌలికమైనది.ఎన్నికల సంఘం ఎవరి ప్రభావాలకు గురికాకుండా సర్వస్వతంత్రంగా బాధ్యతలు నిర్వహించాలి. ఎలాంటి అరమరికలు, గోప్యతా లేకుండా బాహాట పద్ధతులు పాటించాలి. నిక్కచ్చిగా భారత రాజ్యాంగ చట్రం పరిధిలో విధులు నిర్వహించాలి.ఓటుహక్కును పరిరక్షించాలనే ఇండియా కూటమి ఐక్య డిమాండ్‌కు భారత కమ్యూనిస్టుపార్టీ కట్టుబడి ఉంది,ఎన్నికల ఓటర్ల జాబితాలను గోప్యతలేకుండా రక్షించాలి,ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి అని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం ఆ ప్రకటనలో పేర్కొంది.

**ప్రజాస్వామ్యం ఎక్కడుంది?**
**నిలదీసిన డి.రాజా**

బిజెపి ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్యంలో నెలకున్న పరిస్థితులపై సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా కొన్ని మౌలిక ప్రశ్నలు లేవనెత్తారు.''బిజెపి పాలనలో మన ప్రజాస్వామ్యానికి ఏమైంది?ఎన్నికలలే ఒక పెద్ద మోసపూరితంగా మారిపోతే ఇక ప్రజాస్వామ్యం ఎక్కడుంటుంది?ఎన్నికల సంఘం ఒక రాజ్యాంగబద్ధమైన ఉన్నతస్థాయీవ్యవస్థగా ఉన్నప్పటికీ,ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యక్తిగతంగా తన కుతాను రాజ్యాంగాన్ని గౌరవించకపోతే,రాజ్యాంగ సూత్రా లు పాటించకపోతే ఇక్క దేశంలో ప్రజాస్వామ్యం ఎక్కడుంటుంది?'' అని నిలదీశారు.



అదేవిధంగా సిపిఐ ఎంపీ,రాజ్యసభలో సిపిఐ పక్ష నాయకుడు పి.సందోష్ కుమార్ మాట్లాడుతూ,జ్ఞానేశ్ కుమార్ హయాంలో సిఇసి అంటే దొంగ ఎన్నికల సంఘం అధికారిగా ముద్రపడిందని విమర్శించారు.ఓటర్లను జాబితాల నుండి తొలగించడం, ఫారమ్–6 లో ఏకపక్షంగా మార్పులు చేయడం, ఈ విషయంలో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు,వంటివన్నీ ప్రజాస్వామ్య బాహాటత్వం,ఎన్నికల సంఘం స్వతంత్ర పనివిధానం,ఇసి రాజ్యాంగబద్ధతలపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని సిపిఐ ఉద్ఘాటించింది.

# నైజీరియాలో కుప్పకూలిన విమానం

## 25 మంది దుర్మరణం

**అబుజా:** ఆఫ్రికా ప శ్చిమప్రాంతదేశం నైజీరియాలో ఒక విమా నం నేల కూలిపోవడ ంతో అందులో ప్రయా ణం చేస్తున్న 25 మంది దుర్మరణం చెందారు. విమానంలో ఏ ఒక్కరూ ప్రాణాలతో బయటపడలేదు. ఒండోరాష్ట్రం ఇగ్బోకోడా నదీతీర పట్టణంలోని నావికాదళ స్థావరం సమీపంలో ఈ విమానం కూలిపోయినట్లు నైజీరియా వైమానికదళం ఒక ప్రకటనలో తెలియజేసింది.సాధారణ విధి నిర్వహణలో పాల్గొనేందుకు దేశ ఆర్థిక రాజధాని లాగోస్‌కు 20 మంది ప్రయాణికులతో వెళుతున్న ఎటిఆర్–42 విమానం కూలిపోయింది. వారితోపాటు ఐదుగురు సిబ్బంది కూడా మరణించారు.విమానం రాడాక్ తెరమీద నుండి అదృశ్యమైన కొద్ది సేపటికే కుప్పకూలిపోయినట్లు సమాచారం లభించింది. ఐతే ఈ విమానంలో 32 మంది ప్రయాణికులు ఉన్నట్లు నైజీరియా విమానయాన శాఖామంత్రి పెస్టస్ కీయామో తొలుత ప్రకటించారు. ఈ విషయంపై అధికారులు వెంటనే స్పష్టత ఇవ్వలేదు.

# 11 మంది భారతీయ సిబ్బందికి గాయాలు

## హోర్ముజ్‌లో నౌకపై ప్రొజెక్టైల్ దాడి



**దుబాయ్:** హోర్ముజ్ జలసంధిలో ఒక నౌకపై గుర్తుతెలియని ప్రొజెక్టైల్ దాడి చేసింది. ఈ దాడిలో 11 మం ది భారతీయ సిబ్బంది గాయపడ్డారు. పనామా జె ండాతో వెళుతున్న నౌకలో భారతీయ సిబ్బంది ఉన్నా రు.ఈ పనామా నౌకలో మొత్తం 19 మంది సిబ్బంది ఉన్నారనీ, వీరిలో 17 మంది భారతీయ సిబ్బంది ఉన్నారని భారత విదేశీమంత్రిత్వశాఖ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేసింది.గాయపడిన 11 మంది భారతీయ సిబ్బందికి ఒమన్ అధికారుల సహాయంతో చికిత్సలు అందిస్తున్నారు. భారత సిబ్బందికి సహాయం చేసిన ఒమన్ ప్రభుత్వ అధికారులకు ఈ సందర్భంగా భారత విదేశీమంత్రిత్వశాఖ కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ దాడిని భారత ప్రభుత్వం తీవ్రం గా ఖండించింది.గడచిన ఫిబ్రవరి నుండి ఇప్పటివరకూ హోర్ముజ్ జలసంధిలో యుద్ధం తీవ్రరూపం దాల్చి తర్వాత భారతీయ సిబ్బందే ఎక్కువగా దాడులకు గురయ్యారు. అనేక మంది భారతీయ నావికులు ఇప్పటికే మరనించారు. పదులసంఖ్యలో భారత నా వికులు ఈ యుద్ధంలో గాయపడ్డారు. ఈ పరంపరలో ఇది తాజా ఘటన. హోర్ముజ్ జలసంధిలో యుద్ధ దాడుల నుండి సాధారణ నావికులకు రక్షణ ఇవ్వాలని,వారి జోలికి వెళ్ళకూడదని,అంతర్జాతీయ నిబంధనలు పాటించాలని ఇప్పటికే భారత ప్రభుత్వం వివిధ అంతర్జాతీయ వేదికల ద్వారా ప్రపంచం దృష్టికి తీసుకువచ్చింది. అంతర్జాతీయ జల మార్గాలలో స్వేచ్ఛగా వాణిజ్య నౌకల కార్యకలాపాలు కొనసాగడానికి వీలుగా కొన్ని నిబంధనలు పాటించాలని భారత ప్రభుత్వం కోరుతూ వస్తోంది. భారత్ వాదనకు అనేక దేశాలు మద్దతు ఇస్తున్నాయి.గతనెలలో ఒక నౌకపై జరిగిన దాడిలో భారత నావికులు మరణించారు. హోర్ముజ్ జలసంధిలో జరుగుతున్న యుద్ధంలో గడచిన ఎనిమిది నెలల్లో 15 మంది పైగా భారత నావికులు మరణించారు.

# కార్మిక సంక్షేమానికి భరోసా

(మొదటి పేజీ తరువాయి)

ఉత్సాహ భరితంగా ప్రసంగించారు. ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్‌కు సుదీర్ఘ పోరాట చరిత్ర ఉందని, ఎన్నో త్యాగాలు చేసి కార్మికుల అనేక హక్కులు విజయాలు సాధించిన పెట్టిన ఘనత ఎర్రజెండాకే దక్కుతుందని కొనియాడారు. సంస్థను నమ్ముకుని నిరంతరతం శ్రమిస్తున్న కార్మికులు ఉద్యోగులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐఖ్యపోరాటాలే శరణ్యం అన్నారు. జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్‌లు కలిసి ఉమ్మడిగా బరిలో దిగుతున్నాయని తెలిపారు. కార్మిక పక్షాన నిలిచే ఆ కూటమిని తిరుగులేని మెజార్టీతో గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర స్థాయి గుర్తింపు సంఘానికి క్లాజ్ 3 బస్సు గుర్తుకు, ఖమ్మం రీజియన్ స్థాయిలో క్లాజ్ 6లో భరిలో ఉన్న ఎన్‌ఎంయు కాగడ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని, కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరంతరం పోరాడే శక్తులకు అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు కందుల భాస్కర్ నాయకులు కంచర్ల జమలయ్య, నేరెళ్ల రమేష్. ఇయు ఎన్‌ఎంయు రాష్ట్ర, జిల్లా నాయకులు ఎస్ బాబు, మౌలానా థామస్‌రెడ్డి, పిల్లి రమేష్ టివి ప్రసాద్, ఎస్‌డి నజీర్ ఆర్‌ఎస్ సింగ్ హరివర్మ జిసి శేఖర్ ఖాజా మొహీనుద్దీన్ జి రాజా రేణుకాదేవి రాధాదేవి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అల్పాహారం

(మొదటి పేజీ తరువాయి)

ఆరోగ్యంగా ఉండి బాగా చదువుకుంటేనే భవిష్యత్‌లో రాష్ట్ర ఉత్పత్తికి పెద్ద ఎత్తున తోడ్పడతారని, తద్వారా జిఎస్‌డిపి వృద్ధికి దోహదం చేస్తారని తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గంలోని మునగాల మండలంలోని ఎస్‌ఎంపేటలో హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థుల కోసం రూ.9.60 కోట్లతో నిర్మించనున్న మెగా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. 1020 పాఠశాలల్లో చదువుతున్న దాదాపు 60వేల మంది విద్యార్థులకు ఒకే కిచెన్ నుంచి పరిశుభ్రమైన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వేడి వేడి అల్పహారం అందించేందుకు మునగాల మండలంలో ఈ గ్రీన్ ఫీల్డ్ కిచెన్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు వారానికి ఆరు రోజుల పాటు అల్పాహారం అందిస్తున్నామని తెలిపారు. మూడు రోజుల పాలు, మూడు రోజులు రాగిజావ అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఉచితాలుగా చూడోద్దని భట్టి విక్రమార్క అన్నారు. పేదలు, రైతులు, మహిళలు,. విద్యార్థులపై చేస్తున్న ఖర్చు రాష్ట ఆర్థిక వ్యవస్థ తిరిగి ప్రయోజనం చేకూర్చే పెట్టుబడిగా అభివర్ణించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండటం, పిల్లలు చదువుకోవడం, మహిళలు ఆర్థికంగా ఎదగడం, రైతులకు పెట్టుబడి సాయం అందించడం ద్వారా రాష్ట్ర ఉత్పాదకత పెరుగుతుందని చెప్పారు. రైతు భరోసా, ఉచిత విద్యుత్, సన్నబియ్యం, రాజీవ్ ఆరోగ్యశ్రీ, మహిళలు ఉచిత ఆర్‌టిసి ప్రయాణం, వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ ఇళ్లు వంటి కార్యక్రమాలన్నింటి అంతిమ లక్ష్యం పేద కుటుంబాలు ఆర్థికంగా ఎదగడమేనని అన్నారు.

**నవంబర్ 19న**
**ఇందిరమ్మ కుటుంబ బీమా**

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి భద్రత కల్పించే లక్ష్యంతో ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని తీసుకరానున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. నవంబర్ 19న ఇందిర గాంధీ జయంతి సందర్భంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. కుటుంబ యాజమానికి ఏదైనా అనుకొని ప్రమాదం జరిగితే ఆ కుటుంబానికి ఐదు లక్షల భద్రత కల్పించేలా ఈ పథకాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పుట్టిన ప్రతి కుటుంబం తమ కుటుంబానికి భద్రత ఉందనే ధైర్యంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

**ప్రజలే మా కుటుంబం**

కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల ప్రజలే తమ కుటుంబమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెబుతున్నారని, ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసే నాయకులు లభించడం, ఆ కోవలోనే ఉత్తమ్ దంపతులు ఉండటం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని అన్నారు. మునగాల హెలిప్యాడ్ నుంచి సెంట్రలైజ్డ్ కమ్యూనిటి కిచెన్ వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేణులు, అభిమానులు సుమారు 500 బైకులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె.నర్సింహా, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, వంగవీటి రామారావు, చింతకుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి, నల్లపాటి శ్రీనివాస్, కాసర్ల కోటేశ్వరరావు, ముత్తవరపు పాండురంగారావు, కొలిశెట్టి బుచ్చిపాపయ్య, వేనేపల్లి వీరబాబు, ఉప్పుల జానకిరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# తప్పుకో...

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పలు చోట్ల ఇండియా కూటమి ఎమ్మెల్యేలు కూడా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ కలెక్టరేట్ వద్దకు ర్యాలీగా వచ్చిన ఇండియా కూటమి నేతలు, కార్యకర్తలను పోలీసులు గేట్ వద్ద అడ్డుకోవడంతో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ఇండిమా కూటమి ప్రతినిధుల అధికారులకు మెమోరాండం సమర్పించారు. ఈ ధర్నాలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి.నరసింహా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఛాయాదేవి జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్ సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, టిజెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, జిల్లా అధ్యక్షులు నర్సన్న, సలీం పాషా, అరుణ్, కాంగ్రెస్ నాయకులు మోహిత్, సైఫుల్లా, మోతే రోహిత్, ఎమ్మెల్సీ దీపక్ జాన్, సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకటేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మహేందర్. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఝాన్సీ, మహేష్. విజయ్, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు ప్రదీప్, ఎంసిపిఐ యు రాష్ట్ర నాయకులు వనం సుధాకర్, జిల్లా కార్యదర్శి అనిల్, ఎస్‌యుసిఐ(సి) నాయకులు భరత్, విసికె పార్టీ అధికార ప్రతినిధి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

**జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాల్సిందే : ఇటి.నరసింహా**

అర్హులైన ఓటర్లను జాబితా నుంచి తొలగించే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయడంతో పాటు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి.నరసింహ డిమాండ్ చేశారు. జ్ఞానేశ్‌కుమార్ రాజ్యాంగ, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఓటర్లను కుట్రపూరితంగా తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, రాష్ట్రంలో 30 శాతం ఓట్ల తొలగింపునకు రంగం సిద్ధం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌గా కొనసాగుతున్న జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా మిగతా కమిషనర్ల అభిప్రాయానికి విరుద్ధంగా అమిత్‌షా మోదీ ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో ఓట్ల చోరీకి పాల్పడుతున్నారన్నారు. దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మరొకసారి గెలవడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారన్నారు. ఒక్క అర్హుడి ఓటు కూడా తొలగించకుండా ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఒక్క అర్హుడి ఓటు కూడా తొలగించకుండా ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించాలని కోరారు. ఎన్నికల జాబితాలో అక్రమ తొలగింపులపై పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం ఆయన చేశారు. ఓట్ చోరీ, సీట్ చోరీ చందా చోరీ, నిషాన్ చోరీ, నేతా చోరీ చర్యలకు పాల్పడుతున్న కేంద్ర బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు రోడ్ల మీదికి వచ్చి మరింత తీవ్రమైన పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మాట్లాడుతూ రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కును తొలగిస్తున్న జ్ఞానేష్ కుమార్‌ను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఐఆర్ పేరుతో తొలగించిన వారిలో అర్హులైన ఓటర్లందరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తున్న తీరు తీవ్ర అభ్యంతరకమన్నారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు మోహిత్ మాట్లాడుతూ బిజెపి నేతలు ఫారం–7ను అక్రమంగా ముద్రించి ఆ పార్టీకి వ్యతిరేకంగా ఉన్న ఓట్లను తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారని ఈ ఘటనపై విచారణ జరిపించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

నాయకుడు అన్నారు. ఎన్నికల సంఘం కార్యాలయానికి పాదయాత్రగా వెళ్తుండగా, వారిని ఆకాశవాణి భవన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇండియా కూటమి నేతలు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ఆకాశవాణి భవన్ ప్రాంగణం నుండే రాహుల్ గాంధీ విలేకరులతో మాట్లాడారు. 'నరేంద్ర మోదీ, అమిత్ షా, మోహన్ భగవత్, సిఇసి జ్ఞానేష్ కుమార్ దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖతం చేశారు. దేశమంతా దీన్ని నమ్ముతోం, దేశంలోని యువత కూడా విశ్వసిస్తున్నారు. నన్ను అడ్డుకుంటున్న పోలీసులు కూడా ఇదే మాట అంటున్నారు. వాస్తవం అందరికీ తెలుసు' అని రాహుల్‌గాంధీ అన్నారు. ప్రధాని మోదీ, షా, భగవత్ 'ఓట్ల దొంగతనం' ద్వారా దేశాన్ని తమ గుప్పిట్లోకి తీసుకున్నారని ఆయన ఆరోపించారు. వీరికి జ్ఞానేష్ కుమార్ సహకరించారని పేర్కొన్నారు. వారిపై కచ్చితంగా చర్యలు ఉంటాయని చెప్పారు. అంతకుముందు, ఎక్స్ వేదికగా చేసిన పోస్ట్‌లో, ఎన్నికల కమిషనర్లను కలిసేందుకు 300 మందికి పైగా ప్రతిపక్ష ఎంపిలు పార్లమెంట్ నుండి ర్యాలీగా వెళ్లారని తెలిపారు. 'మేము కోట్ల మంది భారతీయులకు ప్రాతినిధ్యం వహిస్తున్నాము. ఎన్నికల కమిషనర్లు మమ్మల్ని ఎందుకు కలవడం లేదు? పోలీసులు మమ్మల్ని ఎందుకు అడ్డుకుంటున్నారు, ఎందుకు బెదిరిస్తున్నారు?' అని ప్రశ్నించారు.

# బైఠాయింపు

(మొదటి పేజీ తరువాయి)

పాదయాత్ర చేసే ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకోవడంతో, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ పార్లమెంట్ స్ట్రీట్‌లోని ఎఐఆర్ ప్రాంగణంలోకి ప్రవేశించి ధర్నా ప్రారంభించారు. ఆకాశవాణి భవన్ ప్రాంగణంలో 9 గంటలకు పైగా ధర్నా చేసిన కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, ఆయన సోదరి ప్రియాంక గాంధీ వాద్రాలను మంగళవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆల్ ఇండియా రేడియో (ఎఐఆర్) ప్రాంగణం నుండి నిరసన చేస్తున్న ఎంపిలందరినీ ఖాళీ చేయించిన తర్వాత, పోలీసులు రాహుల్ గాంధీతో పాటు కెసి వేణుగోపాల్, పవన్ ఖేరా, కే సురేష్, అమరీందర్ సింగ్ రాజా వారింగ్, ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి వంటి కాంగ్రెస్ ఎంపిలు, నాయకులను బలవంతంగా తరలించారు. ఇదిలా ఉండగా, ఉదయం పోలీసులు పాదయాత్రను అడ్డుకున్న తర్వాత, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపిలు అభిషేక్ బెనర్జీ, డెరెక్ ఓబ్రియన్, సిపిఐ రాజ్యసభ ఎంపిలు పి సందోష్ కుమార్, పిపి సునీర్, సిపిఐ లోక్‌సభ సభుడు వి. సెల్వరాజ్‌తో సహా పలువురు ప్రతిపక్ష నాయకులను అదుపులోకి తీసుకున్నారు. కాగా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, పార్టీ జాతీయ కార్యదర్శి పి. సందోష్ కుమార్, ఎంపిలు సునీర్ రాజ్య, సెల్వరాజ్, సిపిఐ(ఎం) ఎంపిలు అమ్రా రామ్, ఝాన్ బ్రిట్రాస్, వి. శివదాసన్, ఎఎ రహీం, సిపిఐ(ఎంఎల్) ఎంపి సుదామ ప్రసాద్, ఆర్‌జెడి నేత మనోజ్ కుమార్ ఝా, కెసి(ఎం) ఎంపి జోష్ కె. మణి, విసికె ఎంపి థాల్ పాటు ఇతర ఎంపిలు పాదయాత్ర చేస్తుండగా, వారిని అంతకుముందు పార్లమెంట్ వీధిలో ఆకాశవాణి భవన్, నీతి ఆయోగ్ కార్యాలయం ముందు భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. ముందుకు వెళ్లకుండా నిరోధించడంతో, వారు నిరసనగా రోడ్డుపై బైఠాయించారు. ఆ తరువాత రాహుల్ గాంధీ, టిఎంసికి చెందిన అభిషేక్ బెనర్జీ పోలీసు బారికేడ్‌పైకి జాతీయ జెండాను ఎగురవేశారు. ప్రియాంక గాంధీని అదుపులోకి తీసుకునేందుకు సిద్ధంగా ఉన్న బస్సు వద్దకు తీసుకెళ్లారు. అయితే, ఆమె వెంటనే బస్సు నుండి దిగి ఆకాశవాణి గేటు వద్ద తన సోదరుడితో కలవడం కనిపించింది. పోలీసులు అడ్డుకున్నప్పటికీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, దీపేందర్ హూడా రిసెప్షన్ గేటు నుండి ఆకాశవాణి భవన్ ప్రాంగణంలోకి ప్రవేశించారు. ఆ తర్వాత వారు ఒక చెట్టు కింద కూర్చొని కనిపించారు. ప్రాంగణాన్ని ఖాళీ చేయమని పోలీసు సిబ్బంది వారిని కోరగా, గాంధీ సోదర సోదరీమణులు అందుకు నిరాకరించి, తాము ఎన్నికల సంఘం కార్యాలయానికి వెళ్లాలని పట్టుబట్టారు. నిరసన చేస్తున్న ప్రతిపక్ష సభ్యులను ఖాళీ చేయించే ప్రయత్నంలో, ఏరియా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సచిన్ శర్మ పెద్ద సంఖ్యలో పోలీసులతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ మార్చ్ సందర్భంగా, ప్రతిపక్ష ఎంపిలు కుమార్‌ను ఆర్‌ఎస్‌ఎస్ యూనిఫాంలో చిత్రీకరించిన కటౌట్‌లను పట్టుకుని, 'బిజెపియే సిఇసి', 'ఓటు దొంగ, గద్దీచోడ్', 'ప్రజాస్వామ్యం అమ్మకానికి లేదు' వంటి నినాదాలతో హోరెత్తించారు. ర్యాలీకి ముందుగానే పార్లమెంట్, ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం లోపల, చుట్టుపక్కల భారీ భద్రతా ఏర్పాట్లు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఎంపిలు రావడం ప్రారంభించడానికి చాలా ముందే భద్రతా సిబ్బందిని ఆ ప్రాంతంలో మోహరించారు. ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయమైన నిర్వాచన్ సదన్ వైపు బయలుదేరే ముందు ఎంపిలు పార్లమెంట్ మకర ద్వార్ వద్ద సమావేశమయ్యారు. 'ప్రధానిహోం మంత్రి ద్వయం' దుష్ట పన్నాగాలను ఓడించడానికి ప్రతిపక్షాల సంఘీభావం 'ఓటు దొంగతనం' అయినా, నియోజకవర్గాల పునర్విభజన అయినా కచ్చితంగా కొనసాగుతుందని కాంగ్రెస్ స్పష్టం చేయడంతో, బిజెడి ఎంపిలు కూడా ఇండియా బ్లాక్ ఎంపిల నిరసన ప్రదర్శనలో చేరారు.

**బిజెపి పతనానికి కౌంట్‌టౌన్ ప్రారంభమైంది**

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ మాట్లాడుతూ 'భారతీయ ఝూట్ పార్టీ' పతనానికి కౌంట్‌డౌన్ ఇప్పటికే ప్రారంభమైందన్నారు. తాము శాంతియుత నిరసన ప్రదర్శన నిర్వహించామన్నారు. ఇది ప్రాథమికంగా ఇండియా జన బంధన్ లాంటిదని, తాము అన్ని ప్రతిపక్ష పార్టీలకు విజ్ఞప్తి చేశామని, బిజెడి భౌతికంగా స్పందించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం బిజెడి ఎంపిలు తమతో ఉన్నారని, భౌతికంగా ఇక్కడ లేని ప్రతిపక్ష పార్టీలు స్ఫూర్తితో మాతో ఉన్నాయని తాము కచ్చితంగా అనుకుంటున్నామన్నారు. తాత్కాలికంగా ఎన్‌డిఎలో ఉన్న కొందరు సహా ఇతర ప్రతిపక్ష పార్టీలు కూడా నిస్సందేహంగా స్ఫూర్తితో హాజరయ్యాయని రమేమ్ తెలిపారు. 'ఓటు దొంగతనం విషయంలో అయినా, నియోజకవర్గాల పునర్విభజన విషయంలో అయినా, ప్రధానిహోం మంత్రి (నరేంద్ర మోదీఅమిత్ షా) ద్వయం దుష్ట పన్నాగాలను ఓడించడానికి ప్రతిపక్షాల ఐక్యత చ్చితంగా కొనసాగుతుంది' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అన్నారు. యాత్ర వివరాలను తెలియజేస్తూ, వాస్తవానికి ఇది ఎన్నికల సంఘం వరకు చేయాల్సిన యాత్ర అని, ఆకాశవాణి భవన్, పాత ప్రణాళికా సంఘం భవనం మధ్యలో తమను అడ్డుకున్నారని చెప్పారు.

# 171 పరుగులకే కుప్పకూలిన వెస్టిండీస్!



ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టీ20లో భారత బౌలర్లు నిప్పులు చెరిగారు. దాంతో ముందుగా బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 19.1 ఓవర్లలో 171 పరుగులకు కుప్పకూలింది. కెప్టెన్ షై హోప్(37 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 52), షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్34 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లతో 56) హాఫ్ సెంచరీలతో రాణించగా.. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. భారత బౌలర్లలో నమన్ ధీర్(3/31) మూడు వికెట్లు తీయగా.. కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ రెండేసి వికెట్లు పడగొట్టారు. అర్ష్‌దీప్ సింగ్, మయాంక్ యాదవ్ తలో వికెట్ తీసారు.

**ఒకే ఓవర్‌లో 2 వికెట్లు..**

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్‌కు ఓపెనర్లు మెరుగైన ఆరంభాన్ని అందించారు. మయాంక్ యాదవ్ బౌలింగ్‌లో వరుసగా బౌండరీలు బాదారు. అయితే ఈ జోడీని అర్ష్‌దీప్ సింగ్ విడదీసాడు. కమిల్ పూరన్(12)ను క్లీన్ బౌల్డ్ చేశాడు. క్రీజులోకి వచ్చిన డేంజరస్ బ్యాటర్ షిమ్రాన్ హెట్‌మైర్ అనవసర పరుగుకు ప్రయత్నించి రనౌటయ్యాడు. ఈ వికెట్‌పై దుమారం రేగింది. సూపర్ డైవ్‌తో క్రీజులోకి చేరినా.. బ్యాట్ గాల్లో ఉండటంతో థర్డ్ అంపైర్ ఔటిచ్చాడు. అదే ఓవర్‌లో రోవ్‌మన్ పోవెల్(0)ను అక్షర్ పటేల్ క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో వెస్టిండీస్ పవర్ ప్లేలో 3 వికెట్లకు 44 పరుగులు చేసింది. షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్‌తో కలిసి షై హోప్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో 36 బంతుల్లో షై హోప్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

**మలుపు తిప్పిన నమన్ ధీర్..**

63 పరుగుల భాగస్వామ్యంతో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని నమన్ ధీర్ విడదీసాడు. షై హోప్‌ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆ వెంటనే రోస్టన్ ఛేజ్(5)ను కుల్దీప్ యాదవ్ ఔట్ చేయగా.. రూథర్‌ఫోర్డ్ 31 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దూకుడుగా ఆడే క్రమంలో రొమారియో షెఫెర్డ్7), మాథ్యూ ఫోర్డ్9), షామర్ స్ప్రింగర్(9), షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేరారు. ఆఖరి ఓవర్‌లో అకీల్ హోసేన్(15) కూడా ఔటవ్వడంతో వెస్టిండీస్ ఇన్నింగ్స్ ముగిసింది.

# అందుకే వైభవ్, నితీష్ రెడ్డి ఆడటం లేదు



ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా వెస్టిండీస్‌తో లక్‌నవ వేదికగా జరుగుతున్న తొలి మ్యాచ్‌లో టీమిండియా టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. పిచ్ కండిషన్స్, డ్యూ ప్రభావం నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తెలిపాడు.రవి బిష్ణోయ్, నితీష్ కుమార్ రెడ్డి, వైభవ్ సూర్యవంశీ, ప్రిన్స్ యాదవ్ ఈ మ్యాచ్ ఆడటం లేదని చెప్పిన శ్రేయస్ అయ్యర్.. టీమ్ కాంబినేషన్‌లో భాగంగానే ఈ నలుగురికి తుది జట్టులో అవకాశం దక్కలేదన్నాడు.

**పిచ్ కండిషన్స్‌తోనే..**

'మేం ముందుగా బౌలింగ్ చేస్తాం. ఇది మిశ్రమ పిచ్. మంచు కూడా పడుతుంది. జపాన్ నుంచి మా ప్రయాణం చాలా కష్టంగా సాగింది. నిన్న రాత్రే ఇక్కడికి వచ్చాం. ఈరోజు మ్యాచ్ ఆడుతున్నాం. కానీ మేం పూర్తి ఏకాగ్రతతో ఉన్నాం. వెస్టిండీస్ ఆటగాళ్లు అద్భుతంగా ఆడుతున్నారు. గత కొన్నేళ్లుగా టీ20 క్రికెట్‌ను శాసించారు. వారి వద్ద అద్భుతమైన బ్యాటింగ్, ఆల్‌రౌండర్లు ఉన్నారు. ఈ మ్యాచ్ కోసం ఎదురుచూస్తున్నాం. రవి బిష్ణోయ్, నితీష్ రెడ్డి, వైభవ్ సూర్యవంశీ, ప్రిన్స్ యాదవ్ ఈ మ్యాచ్ ఆడటం లేదు. టీమ్ కాంబినేషన్‌లో భాగంగానే ఈ నలుగురికి అవకాశం దక్కలేదు.

**గెలవడమే మా ఏకైక లక్ష్యం..**

మరోవైపు టాస్ గెలిస్తే తాము కూడా బౌలింగ్ ఎంచుకునేవాళ్లమని వెస్టిండీస్ కెప్టెన్ షై హోప్ తెలిపాడు. 'మేం టాస్ గెలిచి ఉంటే ముందుగా బౌలింగ్ ఎంచుకునేవాళ్లం. భారత్ మంచు ప్రభావం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి టార్గెట్‌ని ఛేజ్ చేయడం ఈజీ. మేమైతే డిఫెండ చేసుకోవడానికే ప్రయత్నిస్తాం. పరిస్థితులకు త్వరగా అలవాటు పడటం గురించే మేం ప్రధానంగా మాట్లాడుకున్నాం.

# కెప్టెన్సీకి హర్మన్‌ప్రీత్ కౌర్ గుడ్‌బై




భారత మహిళల క్రికెట్ జట్టు సీనియర్ ప్లేయర్ హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీకి గుడ్‌బై చెప్పారు. నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు ఆమె ప్రకటించారు. అన్ని ఫార్మాట్ల పగ్గాలను వదిలేసినట్లు ఆమె తెలిపారు. 2025లో ఇండియాకు వన్డే వరల్డ్‌ప్ అందించిన హర్మన్‌ప్రీత్.. కెప్టెన్‌గా చేశారు. భారత జట్టుకు అతి సుదీర్ఘ కాలం కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ప్లేయర్‌గా హర్మన్‌ప్రీత్ నిలిచింది. కౌర్ తప్పుకోవడంతో ఇక వైస్ కెప్టెన్ స్మృతి మందానా లీడర్‌షిప్ బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఉన్నాయి. కెప్టెన్సీ నుంచి తప్పుకోనున్న హర్మన్‌ప్రీత్ ఇక నుంచి ఎక్కువగా బ్యాటింగ్‌పై ఫోకస్ పెట్టనున్నట్లు తెలుస్తోంది. తాను తీసుకున్న నిర్ణయం సులువైంది కాదు అని, ఇది ఎన్నో ఏళ్ల జ్ఞాపకాలు, భావోద్వేగాలు, త్యాగాల ఫలితం అని ఆమె అన్నారు.

ప్రస్తుతం హర్మన్‌ప్రీత్ వయసు 37 ఏళ్లు. ఆమె అయిదు టెస్టులు, 51 వన్డేలు, 155 టీ20లకు కెప్టెన్‌గా న్నారు. ఇన్‌స్టాగ్రామ్ పోస్టులో ఆమె తన కెప్టెన్సీ వీడ్కోల ప్రకటన చేసింది. తాజాగా ముగిసిన ఆసియా గేమ్స్‌లో.. హర్మన్ నేతృత్వంలోని భారత జట్టు గోల్డ్ మెడల్ కొట్టిన విషయం తెలిసిందే. రెండు రోజుల క్రితమే గౌహతిలో బీసీసీ కార్యదర్శి దేవజిత్ సైకియాతో హర్మన్, స్మృతి, అమోల్ మజుందార్ కలిసిన విషయం తెలిసిందే. నాయకత్వ బాధ్యతలను త్యజించినా.. తన క్రికెట్ జర్నీ కొనసాగుతుందని, బ్యాటింగ్‌పై ఫోకస్ పెట్టనున్నట్లు ఆమె చెప్పారు.

## మహిళ

# దారుణం..మహిళా జర్నలిస్టులపై లైంగిక వేధింపులు!



ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలను కవర్ చేస్తున్న ముగ్గురు మహిళా జర్నలిస్టులు పోలీసు సిబ్బందిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ ఫిర్యాదు చేయడం ఆందోళన కలిగించే విషయం. మీడియా ప్రతినిధులు తమ విధులను నిర్వర్తించే సమయంలో భద్రతతో పాటు గౌరవప్రదమైన వాతావరణం పొందడం వారి హక్కు. ఈ ఘటనపై వచ్చిన ఆరోపణలను తీవ్రంగా పరిగణించి, ఫిర్యాదులను దర్యాప్తు కోసం క్రైమ్ బ్రాంచ్‌కి బదిలీ చేశారు. ఇలాంటి ఘటనలు మహిళల భద్రతతో పాటు ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛగా పనిచేసే మీడియా పాత్రపైనా ప్రభావం చూపుతాయి. అయితే ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై దర్యాప్తు పూర్తయ్యే వరకు ముందస్తు తీర్పు ఇవ్వకుండా, నిష్పాక్షికంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవడం అవసరం. ఇలాంటి అవాంఛిత ఘటనలను అరికట్టేందుకు పోలీసు సిబ్బందికి మహిళల పట్ల గౌరవం, లైంగిక వేధింపుల నిరోధం, వృత్తిపరమైన ప్రవర్తనపై నిరంతర శిక్షణ ఇవ్వాలి. నిరసనలు, భారీ సమావేశాల సమయంలో మహిళా పోలీసు సిబ్బందిని తగిన సంఖ్యలో నియమించాలి. జర్నలిస్టులు తమ విధులు నిర్వహించే ప్రాంతాల్లో స్పష్టమైన భద్రతా నిబంధనలు, పర్యవేక్షణ, ఫిర్యాదు వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. ఫిర్యాదులపై వేగంగా, పారదర్శకంగా దర్యాప్తు చేసి, తప్పు నిర్ధారణైతే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా బాధితులకు న్యాయం చేయడంతో పాటు భవిష్యత్తులో ఇటువంటి ఘటనలను నిరోధించవచ్చు.

# మహిళలకు భద్రత కరువు

ఢిల్లీలో మహిళల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతున్నది. భద్రత కోరుతూ ఇటీవల వేలాది మంది యువతులు ర్యాలీ నిర్వహించడం సమస్య తీవ్రతకు అద్దం పడుతున్నది. దేశ రాజధానిలో మహిళలపై పెరుగుతున్న వేధింపులు సహజంగానే ప్రజల ఆందోళనకు కారణమవుతున్నది. మహిళలకు సురక్షితమైన వాతావరణం కల్పించడంతో పాటు బాధ్యులపై జవాబుదారీతనం ఉండాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తున్నది. మహిళలు స్వేచ్ఛగా బయటకు వెళ్లే హక్కు, పనిచేసే హక్కు, తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు కలిగి ఉన్నప్పటికీ, భద్రతపై భయాందోళనలు వారి దైనందిన జీవితాన్ని ప్రభావితం చేస్తున్నాయన్నది వాస్తవం. మహిళల భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యతగా కాకుండా ప్రభుత్వం, స్థానిక సంస్థలు, రవాణా వ్యవస్థలు, విద్యాసంస్థలు, సమాజం కలిసి పరిష్కరించాల్సిన అంశం. ముఖ్యంగా రద్దీ ప్రాంతాలు, ప్రజా రవాణా, రాత్రివేళల్లో తగిన భద్రతా చర్యలు, వీధి దీపాలు, సీసీ కెమెరాలు, వేగవంతమైన పోలీసు స్పందన వంటి వ్యవస్థలను బలోపేతం చేయాలి. మహిళలు ఫిర్యాదు చేయడానికి భయపడకుండా, సులభంగా, గోప్యంగా ఫిర్యాదు చేసే అవకాశాలు కల్పించాలి. ఫిర్యాదులపై త్వరితగతిన దర్యాప్తు చేసి, నేరం రుజువైనప్పుడు చట్టప్రకారం చర్యలు తీసుకోవడం అత్యంత అవసరం. అదే సమయంలో పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో లింగ సమానత్వం, పరస్పర గౌరవం, మహిళల హక్కులపై అవగాహన పెంచాలి. మహిళలు భయంతో కాకుండా స్వేచ్ఛగా జీవించగలిగినప్పుడే నిజమైన భద్రత సాధ్యమవుతుంది.




# వైమానిక దళంలో మహిళా 'శక్తి'



భారత రక్షణ రంగంలో శక్తి శర్మ చారిత్రక ఘనత సాధించారు. వైద్య విభాగంతో సంబంధం లేకుండా, భారత సాయుధ దళాల్లో ఎయిర్ వైస్ మార్షల్ లేదా సమాన హోదాకు ఎదిగిన తొలి మహిళా అధికారిగా ఆమె గుర్తింపు పొంది, యావత్ మహిళా లోకానికి మార్గదర్శకురాలయ్యారు. ఎయిర్ వైస్ మార్షల్ భారత వైమానిక దళంలో రెండు నక్షత్రాల హోదా. ఇది సైన్యంలో మేజర్ జనరల్, నౌకాదళంలో రియర్ అడ్మిరల్ హోదాలకు సమానం. ఈ అరుదైన ఘనతను అందుకున్న శక్తి శర్మ 1994 జూన్ 18న భారత వైమానిక దళం ఎడ్యుకేషన్ బ్రాంచ్‌లో అధికారిగా చేరారు. మూడు దశాబ్దాలకు పైగా సాగిన సేవలో శిక్షణా సంస్థలు, ఫీల్డ్ స్టేషన్లు, కమాండ ప్రధాన కార్యాలయాలు, ఎయిర్ హెడ్‌క్వార్టర్స్‌లో వివిధ బాధ్యతలు నిర్వహించారు. వైమానిక దళంలో విద్య, శిక్షణ, పరిశోధన, సంస్థాగత అభివృద్ధికి ఆమె చేసిన కృషి ప్రత్యేకంగా నిలిచింది. కాన్పూర్ ఐఐటి, పుణే విశ్వవిద్యాలయంలో ఐఎఎఫ్ 'చెయిర్స్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేయడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. దీని వల్ల రక్షణ పరిశోధన, విద్యాసంస్థలతో జ్ఞాన మార్పిడి, వ్యూహాత్మక సహకారానికి అవకాశాలు పెరిగాయి. ఎయిర్ వైస్ మార్షల్‌గా ఎదగడానికి ముందు కపుర్తలా సైనిక్ స్కూల్ ప్రిన్సిపల్‌గా పనిచేసి, మూడు సర్వీసుల్లో సైనిక్ స్కూల్‌కు నాయకత్వం వహించిన తొలి మహిళా అధికారిగా మరో ఘనత సాధించారు. మహిళలకు శాశ్వత కమిషన్ అవకాశాలు పెరగడం వారి దీర్ఘకాలిక కెరీర్, నాయకత్వ ప్రస్థానానికి మార్గం సుగమం చేసింది.



# 15న 'జైలర్- 2'

సూపర్‌స్టార్ రజనీకాంత్ 'జైలర్ 2' ట్రైలర్ విడుదలైంది. తెలుగులోనూ విడుదలైన ఈ ట్రైలర్ హైవోల్టేజ్ యాక్షన్, రజనీకాంత్ స్టైల్, కామెడీ, యాటిట్యూడ్‌తో ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచుతోంది. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తనదైన క్విర్కీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో 'జైలర్' ప్రపంచాన్ని మరింత పెద్దదిగా, మరింత ఆసక్తికరంగా తీర్చిదిద్దినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. 'జైలర్'లో ప్రేక్షకులను ఎంతగానో అలరించిన ఐకానిక్ క్యారెక్టర్ ముత్తువేల్ పాండియన్‌గా సూపర్‌స్టార్ రజనీకాంత్ మరోసారి తనదైన స్టైల్, మాస్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో మెప్పించనున్నారు. సీక్వెల్‌లో మరింత పెద్ద సంఘర్షణ, భారీ స్థాయి సవాళ్లు, విస్తృతమైన ప్రపంచాన్ని ట్రైలర్ పరిచయం చేస్తోంది. అదే సమయంలో 'జైలర్'ను బ్లాక్‌బస్టర్‌గా నిలబెట్టిన హ్యూమర్, మ్యాడ్‌నెస్, ఎంటర్‌టైన్‌మెంట్‌ను కూడా కొనసాగిస్తూ 'జైలర్ 2'పై మరింత ఆసక్తిని పెంచుతోంది.సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో పాటు ఎస్.జె. సూర్య, విద్యా బాలన్, శివరాజ్‌కుమార్, మోహన్‌లాల్, రమ్యకృష్ణ, యోగిబాబు, సూరజ్ వెంజారమూడు, మిర్నా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. పవర్‌ఫుల్ యాక్షన్, వినోదం, గుర్తుండిపోయే పాత్రలతో 'జైలర్ 2' ఒక భారీ ఎంటర్‌టైనింగ్ యాక్షన్ స్పెక్టాకిల్‌గా రూపొందుతోంది.ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. ఆర్. నిర్మల్ ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు.తెలుగు రాష్ట్రాల్లో 'జైలర్ 2'ను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ తెలుగులో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. సూపర్‌స్టార్ రజనీకాంత్ అన్‌మ్యాచ్డ్ స్క్రీన్ ప్రెజెన్స్, నెల్సన్ దిలీప్‌కుమార్ ప్రత్యేకమైన ఎంటర్‌టైన్‌మెంట్, 'జైలర్' యూనివర్స్‌ను మరింత విస్తరించిన విధానం ఈ సినిమాపై అంచనాలను మరింత పెంచుతున్నాయి. 15న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది.

# 'పోతిరెడ్డిపల్లి' షూటింగ్ షురూ



చాక్లెట్ స్టార్ పవన్ హీరోగా, మౌనిక, సిరి హీరోయిన్లు నటిస్తున్న నూతన హారర్ థ్రిల్లర్ చిత్రం 'పోతిరెడ్డిపల్లి' హైదరాబాద్‌లోని రామానాయుడు స్టుడియోస్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఆరాధ్య క్రియేషన్స్ బ్యానర్‌పై జేరమ్ విష్ణు నిర్మిస్తున్న ఈ చిత్రానికి అశోక్ రోయ్య దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్ర పూజా కార్యక్రమానికి అతిథులుగా మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, సీనియర్ నటుడు బాబుమోహన్ ముఖ్య అతిథులుగా హాజరై చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. చిత్రం తొలి షాట్‌కు సీనియర్ నటుడు బాబు మోహన్ హీరో, హీరోయిన్లపై క్లాప్ కొట్టగా, ప్రముఖ దర్శకుడు, కొరియోగ్రాఫర్ 'అమ్మ రాజశేఖర్' కెమెరా స్విచ్ ఆన్ చేశారు. తెలుగు మూవీ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీఎన్ ఆదిత్య తొలి షాట్‌కు దర్శకత్వం వహించారు. దర్శకుడు వి. సముద్ర, ఓయూ శంకర్ గుండేటి ఈ వేడుకలో పాల్గొని చిత్రబృందానికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హీరో చాక్లెట్ స్టార్ పవన్ మాట్లాడుతూ, కథకు అనుగుణంగా ఆసక్తికరమైన హారర్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతోందని తెలిపారు. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా చిత్రాన్ని రూపొందిస్తున్నామని చెప్పారు.దర్శకుడు అశోక్ రోయ్య మాట్లాడుతూ, "ఇది నా రెండో సినిమా. ఈ చిత్రాన్ని మరింత వైవిధ్యంగా తెరకెక్కించేందుకు ప్రయత్నిస్తున్నాను. సినీ ప్రముఖులు, ప్రేక్షకుల ఆశీర్వాదాలు, ఆదరణ మాకు ఉండాలని కోరుకుంటున్నాను అన్నారు. ఈ చిత్రానికి సంగీతం ర్యాప్ రాక్ షకీల్, ఎడిటింగ్ – ఉద్ధవ్.

# 'హనుమాన్ అంశ్' ట్రైలర్ రిలీజ్



ప్రముఖ ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలి బాబా, భక్తులు ప్రేమగా మహారాజ్‌జీ అని పిలుచుకునే ఆయన జీవితం, బోధనల స్ఫూర్తితో రూపొందిన హనుమాన్ అంశ్ చిత్రం.. ఈ ఏడాదిలో అనూహ్య విజయాన్ని అందుకున్న చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఈ సినిమా దేశవ్యాప్తంగా ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. విశ్వాసం, భక్తి, ఆధ్యాత్మిక పరివర్తన వంటి అంశాలు అన్ని తరాల ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. డాక్టర్ విశాల్ చతుర్వేది రచన, దర్శకత్వంలో 'హనుమాన్ అంశ్' తెరకెక్కింది. నీమ్ కరోలి బాబా పాత్రలో శోబినావ్ సత్యా నటించారు. చందన్ ఆనంద్, పూర్ణిమా తివారీ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. శ్రేయాస్ ధర్మాధికారి సంగీతాన్ని అందించగా, రిషి పాఠక్ కూడా సంగీత దర్శకుడిగా క్రెడిట్ పొందారు. ఆధ్యాత్మికతతో నిండిన కథకు సంగీతం మరింత బలాన్ని చేకూర్చింది.హిందీలో విజయవంతమైన థియేట్రికల్ జర్నీ అనంతరం ఇప్పుడు ఈ చిత్రం తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. హోంబలే ఫిలమ్స్ తమ ఓవర్సీస్ డిస్ట్రిబ్యూషన్ విభాగం ద్వారా గతంలో 'హనుమాన్ అంశ్'ను అంతర్జాతీయ ప్రేక్షకులకు చేరువ చేసింది. ఇప్పుడు సౌత్ ఇండియన్ భాషల థియేట్రికల్ హక్కులను సొంతం చేసుకుని.. ఈ చిత్రాన్ని దక్షిణాది ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది.అక్టోబర్ 9న 'హనుమాన్ అంశ్' తెలుగు వెర్షన్ థియేటర్లలో విడుదల కానుంది. అలాగే తమిళం, కన్నడ, మలయాళం మార్కెట్లలోనూ ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. హిందీలో ఇప్పటికే ప్రేక్షకులపై బలమైన ప్రభావాన్ని చూపిన 'హనుమాన్ అంశ్'.. ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను పలకరించబోతోంది. మహారాజ్‌జీ ఆధ్యాత్మిక ప్రయాణాన్ని మరింత మందికి చేరువ చేయాలనే లక్ష్యంతో అక్టోబర్ 9న తెలుగు థియేటర్లలోకి వస్తోంది.

## రీల్

'కామ్రేడ్ కళ్యాణ్' హీరోయిన్ మహిమా నంబియార్

# పక్కింటి అమ్మాయిలా నేను...



కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు ఎలిమెంట్స్, హ్యూమర్, రొమాన్స్, ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా 'కామ్రేడ్ కళ్యాణ్'తో అలరించబోతున్నారు. జానకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కోన వెంకట్ సమర్పిస్తున్నారు. స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్ఎల్‌పి బ్యానర్‌పై వెంకట కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మిస్తున్నారు. మహిమా నంబియార్ హీరోయిన్. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్ పాటలతో సినిమాపై అంచనాలు పెరిగాయి. 'కామ్రేడ్ కళ్యాణ్' అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ మహిమా నంబియార్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. తెలుగులో నటించడం సరికొత్త అనుభవం. నేను ఏదైనా భాషని త్వరగా నేర్చుకోగలను. తెలుగు నాకు అర్థమవుతుంది. అలాగే ప్రతి లైన్‌కి దర్శకుడిని అడిగి అర్థం తెలుసుకుంటాను. అది నాకు మరింత హెల్ప్ అవుతుంది. శ్రీవిష్ణు చాలా స్పాంటేనిటీ ఉన్న యాక్టర్. షూటింగ్ స్పాట్‌లో చాలా ఇంప్రొవైజ్ చేస్తుంటారు. అది నాకు మరింత ఛాలెంజింగ్‌గా ఉంటుంది. శ్రీవిష్ణు గారి తెలుగుని అర్థం చేసుకోవడం నాకు కష్టం. ఆయనకి ఒక సిగ్నేచర్ స్టైల్ ఉంది. నిజంగా అంత స్పాంటేనిటీ ఉన్న యాక్టర్‌తో కలిసి నటించడం మంచి ఎక్స్‌పీరియన్స్.శ్రీవిష్ణు సినిమాల్లో 'బ్రోచేవారెవరురా' నాకు చాలా ఇష్టం. అలాగే 'స్వాగ్' సినిమా కూడా చూశాను.డైరెక్టర్ నేను చేసిన తమిళ్, మలయాళ సినిమా చూసి కాల్ చేసి కథ చెప్పారు. చాలా నచ్చింది. శ్రీవిష్ణు సిగ్నేచర్ స్టైల్‌లో ఫన్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుంది. ఇంతకుముందు శ్రీవిష్ణుతో నేను 'సామజవరగమన' సినిమా చేయాల్సింది. ఆ సినిమా కోసం ఫోటోషూట్ కూడా జరిగింది. కొన్ని కారణాల వల్ల అది కుదరలేదు. ఇప్పుడు 'కామ్రేడ కళ్యాణ్' సినిమాతో శ్రీవిష్ణు గారితో కలిసి నటించడం హ్యాపీగా అనిపించింది. ఈ సినిమాతో తెలుగులో డెబ్యూ చేయడం లక్కీగా ఫీలవుతున్నాను.అలాగే 90ల బ్యాక్‌డ్రాప్ కూడా చాలా ఫ్రెష్‌గా అనిపించింది. ఇది మంచి కమర్షియల్ ప్యాకేజ్ సినిమా. చాలా ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుంది. మందాడి సినిమా ప్రమోషన్స్‌కి వచ్చినప్పుడు చాలా గొప్ప రిసెప్షన్ ఇచ్చారు. మంచి కంటెంట్ ఉంటే భాషలకు అతీతంగా ఆదరిస్తారు.ఒక నటిగా అన్ని పాత్రలు చేయాలని ఉంది. నేను న్యాయం చేయగల అన్ని పాత్రలు చేయాలని కోరుకుంటున్నాను.మలయాళం, తమిళ్‌లో చెరో సినిమా చేస్తున్నాను. తెలుగు కథలు వింటున్నాను.

# 9న 'మయూఖ'




పాయల్ చెంగప్ప ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'మయూఖ'. ఈ చిత్రాన్ని ప్రశ్విత ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై శశిధర్ నల్ల నిర్మిస్తున్నారు. శ్రీ తేజ్ ఎస్.కె. దర్శకత్వం వహిస్తున్నారు. 'మయూఖ' సినిమా 9న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. తాజాగా మేకర్స్ ఈ చిత్ర ఓవర్సీస్ రిలీజ్ అప్డేట్ ఇచ్చారు. కాగ్నెయిర్ సినీ క్రియేషన్స్ సంస్థ 'మయూఖ' చిత్రాన్ని ఓవర్సీస్‌లో భారీ స్థాయిలో రిలీజ్ చేయబోతోంది. డిఫరెంట్ థ్రిల్లర్ సినిమాగా తెరకెక్కిన 'మయూఖ' ప్రమోషనల్ కంటెంట్ తోనే ప్రేక్షకుల దృష్టిని బాగా ఆకర్షించింది. ఒక మంచి సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌ను థియేటర్స్ లో చూడబోతున్న ఫీల్ ఈ చిత్ర ట్రైలర్ తోనే అందరిలో కలిగింది. మరోవైపు 9న రిలీజ్ కావాల్సిన వెంకటేష్, త్రివిక్రమ్ ఆదర్శ కుటుంబం సినిమా పోస్ట్ పోన్ కావడంతో 'మయూఖ'పై మరింత క్రేజ్ పెరిగింది. థ్రిల్లర్స్ ఇష్టపడే ప్రేక్షకులతో పాటు కొత్త తరహా సినిమా చూడాలనుకునే మూవీ లవర్స్ కు ఈ వీకేండ 'మయూఖ' సినిమా బెస్ట్ ఆప్షన్‌గా కనిపిస్తోంది.పాయల్ చెంగప్ప, బిగ్ బాస్ ఫేమ్ అమన్ మసూద్, దేవ్ డి, మురళీధర్ గౌడ్ లావణ్య రాణి, చరిశ్మ దబ్బార, జాను వర్మ, నానాజీ కర్రి, రఘు వాసిరెడ్డి, అభిలాష్ అడ్డ, వి.ఎస్. రాజు, మది నస్రీన్, బేబి మాన్వీ, మాస్టర్ షణ్ముఖ చరణ్, శశి కదిరి, రాంబాబు రామిశెట్టి, పవన్ లక్కిరెడ్డి, మణిసాయి, సత్య విఠల్, ప్రశ్విత చౌదరి నల్లా, వేగి నాయుడు, శ్రీధర్, మణికంఠ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఆర్ట్ బ్రహ్మనాథ్ ఎ పాటిల్, కాస్ట్యూమ్స్ లావణ్య రాణి కాంద్రేగుల, ఎడిటర్ శరత్. జె, డీవోపీ ఫర్హాన్ వడక్కం, మ్యూజిక్ శిబి మాత్యూ అలెక్స్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ డి.గిరీష్ రెడ్డి, లైన్ ప్రొడ్యూసర్ తేజ తోట, కో ప్రొడ్యూసర్ మనోజ్ పోల,పీఆర్‌ఓ గాండ్ల శ్రీనివాస్ ( జి. ఎస్. మీడియా ).

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు బాలురు మృతి



ప్రజాపక్షం/చింతపల్లి : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు బాలురు మృతి చెందిన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం మండల పరిధిలోని రోటిగడ్డ తాండా గ్రామానికి చెందిన ఇస్లావత్ పాపా కుమారుడు ఇస్లావత్ శ్రీరామ్ (15), నేనావత్ రాజు కుమారుడు నేనావత్ రాకేష్ (15) ఇద్దరు మిత్రులు కలసి సోమవారం వారి సొంత తాండా నుండి బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో గ్రామ సమీపంలోనే బైక్ ట్రాక్టర్ ఢీ కొనడంతో శ్రీరామ్, రాకేష్ ఇద్దరు మృతి చెందారు. పోస్టుమర్టం నిమిత్తం మృతదేహాలను దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### నీటి కొలనులో పడి బాలుడు మృతి

ఈత కోసం వెళ్ళి నీటి కొలనులో పడి ఓ బాలుడు మృతి చెందిన సంఘటన మంగళవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని హరిజనాపురం గ్రామానికి చెందిన కంబాలపల్లి ఎల్లయ్య కుమారుడు కంబాలపల్లి శివశంకరప్రసాద్ (10) తన సొంత గ్రామంలో ఐదవ తరగతి చదువుతున్నాడు. మంగళవారం పాఠశాల ముగిసిన అనంతరం శివశంకర ప్రసాద్ తన మిత్రులతో కలిసి బండకుంట వద్ద ఈత కోసం నీటి కొలను లోకి వెళ్ళి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మృతుడి స్నేహితులు ఇచ్చిన సమాచారంతో మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## మడమడక వద్ద రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి : ఒకరి పరిస్థితి విషమం

ప్రజాపక్షం/దేవరకొండ : రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మడమడక వద్ద మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే నేరేడుగొమ్ము మండలం పెద్దమునిగల్ గ్రామానికి చెందిన అంజయ్య ఆయన భార్య వాణి ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం, చందంపేట మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన కోటేష్ యాదవ్ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం రెండు మండల పరిధిలోని మడమడక వద్ద ఎదురెదురుగా ఢీ కొనడంతో ద్విచక్ర వాహనాలు నడుపుతున్న అంజయ్య, కోటేష్‌లు అక్కడికక్కడే మృతి చెందగా అంజయ్య భార్య వాణి పరిస్థితి విషమంగా ఉండడంతో దేవరకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## అర్హులైన ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు



● ఎమ్మెల్యే కుంభం కుంభం అనిల్ కుమార్ రెడ్డి

ప్రజాపక్షం/భువనగిరి : అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. భువనగిరి పట్టణంలోని రావి భద్రారెడ్డి గార్డెన్స్‌లో జరిగిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని భువనగిరి పట్టణం, మండలానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాపాలనలో భాగంగా అర్హులైన కుటుంబాలను గుర్తించి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భువనగిరి నియోజకవర్గంలో 13 వేల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడం ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందే ప్రయోజనాలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణిరవికుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తి, ఆర్డీఓ కృష్ణారెడ్డి, భువనగిరి పిఎసిఎస్ చైర్మన్ పక్కిర్ కొండల్ రెడ్డి, చందుపట్ల పిఎసిఎస్ చైర్మన్ జీలుగు సతీష్ పవన్, ఎఎంసి చైర్‌పర్సన్ శ్రీరేఖబాబురావు, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ పోతంశెట్టి మంజులవెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, పిఎసిఎస్ డైరెక్టర్లు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధ మహిళపై లైంగిక దాడి

● బాధితురాలికి న్యాయం జరిగే వరకూ ధర్నా



ప్రజాపక్షం/చింతలపాలెం : మండలంలోని మెటల్ ఫౌడర్ కంపెనీ లిమిటెడ్ (మెపో్కో) వద్ద 70 ఏళ్ల వృద్ధ మహిళపై లైంగిక దాడిపై నిరుద్యోగుల జెఏసి కన్వీనర్ ధరావత్ నరసింహ మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు మెపో్కో కంపెనీ యాజమాన్యంపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కంపెనీ పనుల కోసం బీహార్‌కు చెందిన కార్మికులను తీసుకొచ్చిన లోటస్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే ఇటువంటి దారుణ ఘటనకు అవకాశం ఏర్పడిందని ఆరోపించారు. వృద్ధ మహిళపై అఘాయిత్యానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. మెపో్కో కంపెనీ యాజమాన్యం తక్షణమే స్పందించి బాధిత వృద్ధ మహిళకు ఆర్థిక సహాయంతోపాటు అవసరమైన వైద్య సహాయం అందించాలన్నారు. బాధిత మహిళకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తానని స్పష్టం చేశారు.

## అనుమానాస్పదంగా వివాహిత మృతి

ప్రజాపక్షం/బీబీనగర్ : మండల కేంద్రంలో అనుమానాస్పదంగా వివాహిత మృతి చెందిన సంఘటన మంగళవారం వెలుగులోనికి వచ్చింది. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం చౌటుప్పల్ గ్రామానికి చెందిన కట్ట యాదయ్య చెందిన పరీక్ష మౌనిక బీబీనగర్ గ్రామానికి చెందిన పరీక్ష మణికంఠకు ఇచ్చి వివాహం జరిపించారు. వివాహ సమయంలో రూ.9 లక్షలు కట్న కానుకలుగా బహుకరించారు. కొంతకాలంగా పిల్లలు కావడం లేదని భర్త అత్త వేధింపులతో మానసికంగా మౌనిక కుంగిపోయిందని, మంగళవారం మౌనిక ఇంటి ఆవరణలో గిన్నెలు కడుగుతుండగా ఆకస్మికగా కింద పడిపోయి స్పృహ కోల్పోయిందని తెలిపారు. వెంటనే బీబీనగర్ ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్ష నిర్వహించి మౌనిక మృతి చెందినట్లుగా గుర్తించారు. దీనిపై తండ్రి యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ సూర్య నాయక్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# 24 గంటల తాగునీటి సరఫరాయే లక్ష్యం

● పంప్ హౌస్, పైప్‌లైన్ నిర్మాణ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



ప్రజాపక్షం/మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణ ప్రజలకు ఎదురవుతున్న తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం చూపించి ప్రతి ఇంటికీ 24 గంటల పాటు స్వచ్ఛమైన నీటిని అందించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన అమృత్ 2.0 పథకం కింద చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని పబ్లిక్ హెల్త్ శాఖ అధికారులతో కలిసి సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్దదేవులపల్లి వద్ద రూపుదిద్దుకుంటున్న నూతన పంప్ హౌస్ నిర్మాణం, నూతన పైప్‌లైన్ అమర్చే పనులను స్వయంగా సందర్శించి పనుల నాణ్యతను తనిఖీ చేశారు. నాణ్యతా ప్రమాణాలలో ఎలాంటి లోపాలు రాకుండా చూసుకుంటూ, అనుకున్న వ్యవధిలోనే నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం మిర్యాలగూడ పట్టణంలో వేర్వేరు వార్డుల్లో, ప్రాంగణాల్లో రూపుదిద్దుకుంటున్న 12 నూతన ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకుల నిర్మాణ పనుల తాజా స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా వ్యవస్థకు సంబంధించిన పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు నిరంతరాయంగా నీరు అందేలా ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపట్టాలని సూచించారు. మిర్యాలగూడ పట్టణంలో గతంలో తాగునీటి కొరత వల్ల ప్రజలు పడిన అవస్థలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును వేగంగా అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. అమృత్ 2.0 పనులు పూర్తయితే పట్టణ రూపురేఖలు మారడంతో పాటు తాగునీటి ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయని చెప్పారు. ప్రజల సంక్షేమం, పట్టణాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, మౌలిక సదుపాయాల కల్పనలో అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఎస్‌సీ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, కాంట్రాక్టర్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## గోదాముల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాపక్షం/అనంతగిరి : రూ.14.98 కోట్ల వ్యయంతో మండలంలోని శాంతి నగర్‌లో 15వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో నిర్మించనున్న గోదాములకు కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను సురక్షితంగా నిల్వ చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. భారీ నిల్వ సామర్థ్యంతో గోదాముల నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంత రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి, నిర్ణీత గడువులో పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## పిహెచ్‌సిలను పరిశుభ్రంగా ఉంచాలి

● కలెక్టర్ బి.చంద్రశేఖర్



ప్రజాపక్షం/వేములపల్లి : ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన వేములపల్లి మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ వివరాలు, రోగుల రిజిస్ట్రేషన్, డెంగ్యూ, పాము కాటు కేసులు, సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, డ్రగ్స్ రిజిస్టర్ తదితరాలను పరిశీలించారు. ఆసుపత్రిలో ఎదురవుతున్న సమస్యలు, నమోదవుతున్న కేసుల వివరాలను వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాధుల కేసులు ఎక్కువగా వస్తున్నట్లు వైద్యాధికారి కలెక్టర్‌కు వివరించారు.
డెంగ్యూ వ్యాప్తికి అవకాశం లేకుండా గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, దోమల నివారణకు పారిశుధ్య చర్యలు చేపట్టాలని, పంచాయతీ కార్యదర్శులతో సమన్వయంతో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని వైద్యాధికారిని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున నీటిని పొదుపుగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అర్హులైన బాలికలకు అవగాహన కల్పించి వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. పీహెచ్‌సీలోని అన్ని రిజిస్టర్లు, సిబ్బంది హాజరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీలో తహసిల్దార్ హేమలత, ఇన్‌చార్జ్ ఎంపీడీవో జ్యోతి, హాస్పిటల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జి.సుచరిత, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎన్.ప్రవీణ్, సూపర్‌వైజర్ శాంతమ్మ, రికార్డ్ అసిస్టెంట్ బి.సోములు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## యుద్ధరహిత ప్రపంచం.. మానవాళి మనుగడే లక్ష్యం

● 10న నల్లగొండలో ఐప్సో జిల్లా 4వ మహాసభ




ప్రజాపక్షం/నల్లగొండ : ప్రపంచ శాంతి కోసం ప్రజలంతా ఐక్యంగా గొంతెత్తి,యుద్ధాలను నిలిపివేసి శాంతిని నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఎఐపిఎస్‌ఓ) జిల్లా సమన్వయ ప్రధాన కార్యదర్శి జిల్లా యాదయ్య పిలుపునిచ్చారు. అక్టోబర్ 10న నల్లగొండలో నిర్వహించనున్న ఎఐపిఎస్‌ఓ జిల్లా 4వ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో కరపత్రాన్ని విడుదల చేసి మాట్లాడారు. ప్రపంచ శాంతి అనేది ఆకాశం నుంచి దిగుమతి చేసుకునే వస్తువు కాదని, మానవులంతా ఐక్యంగా, చైతన్యవంతంగా పోరాడి సాధించుకోవాల్సిన హక్కు అని అన్నారు.యుద్ధాలు మానవాళికి తీవ్ర నష్టాన్ని కలిగించడంతో పాటు దేశాల అభివృద్ధిని కూడా వెనక్కి నెడుతున్నాయని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షవర్గ సభ్యులు అనంతుల శంకరయ్య,కట్టా వెంకట్‌రెడ్డి,గుర్రం వెంకట్‌రెడ్డిలు మాట్లాడుతూ యుద్ధాలు మారణహోమానికి, విధ్వంసానికి దారితీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధాల కారణంగా అనేక కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతున్నాయని, ప్రజలు నిరాశ్రయులవుతున్నారని తెలిపారు.ఈ నేపథ్యంలో అక్టోబర్ 10న నల్లగొండ జిల్లా పరిషత్ కార్యాలయం వెనుక ఉన్న పిఆర్‌టియుటిఎస్ భవనంలో సంఘం జిల్లా 4వ మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్, నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమంలో శాంతి సంఘం నాయకులు శ్యామల నాగసేన రెడ్డి, కోమటిరెడ్డి ప్రద్యుమ్నారెడ్డి, బుక్క ఈశ్వరయ్య, కస్తాల వెంకన్న, ముండ్ల ముత్యాలు, తెల్లగమళ్ల దశరథ, తదితరులు పాల్గొన్నారు.



## రెస్టారెంట్లలో అధికారుల తనిఖీలు

ప్రజాపక్షం/తుంగతుర్తి (తిరుమలగిరి) : తిరుమలగిరి మున్సిపాలిటి కేంద్రంలో మంగళవారం ఆహార భద్రత అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. కొన్నింటికి జరిమానాలు విధించగా, మరికొన్ని సీజ్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీసోమేశ్వర ఫ్యామిలీ రెస్టారెంట్, చెర్రీ బార్ అండ్ రెస్టారెంట్ డాబా, సునీత రెస్టారెంట్ బార్, సురభి హోటల్ తనిఖీల్లో భాగంగా అపరిశుభ్రత ఉన్న శ్రీసోమేశ్వర ఫ్యామిలీ రెస్టారెంట్‌ను సీజ్ చేశారు. చెర్రీ ఫ్యామిలీ రెస్టారెంట్‌పై రూ.10వేల జరిమానా విధించగా, సురభి హోటల్లో రూ.2వేలు, సునీత రెస్టారెంట్‌పై రూ.2వేలు జరిమానా విధించారు. ఆహార విక్రయ కేంద్రాల్లో నమూనాలు సేకరించి డ్రైవ్‌లో ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ (ఎఫ్ఎస్‌డబ్లు) మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌ను ఉపయోగించి తక్షణ పరీక్షలు నిర్వహించినట్లు వివరించారు. ఆహార పరిరక్షణ ప్రమాణాలను నిర్లక్ష్యం చేస్తే ప్రజల ఆరోగ్యానికి హానికలిగించే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. దీర్ఘకాలిక వినియోగం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులకు దారితీయవచ్చన్నారు. జిల్లా ఆహార పరిరక్షణ విభాగం, కల్తీ ఆహార పదార్థాలు ప్రజారోగ్యానికి ముప్పుగా మారే అవకాశం ఉండటంతో, వ్యాపారులు నిబంధనలు పాటించాలని అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రజలు కూడా అనుమానాస్పదమైన ఆహార ఉత్పత్తులపై జిల్లా ఆహార పరిరక్షణ శాఖకు సమాచారం అందించాలని కోరారు.

## అర్హతకు మించి వైద్యం చేస్తే సహించేది లేదు



● నిడమనూరులో ఐదు ప్రథమ చికిత్స కేంద్రాలు సీజ్

● ఆర్‌ఎంపిలకు డిఎంహెచ్‌ఓ డాక్టర్ కె.రాహుల్ హెచ్చరిక

ప్రజాపక్షం/నిడమనూరు: ప్రథమ చికిత్స కేంద్రాల పేరుతో అర్హతకు మించి వైద్య సేవలు అందిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.రాహుల్ హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా అలోపతి వైద్యం నిర్వహించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.మంగళవారం నిడమనూరు మండల కేంద్రంలోని ప్రథమ చికిత్స కేంద్రాలపై డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.రాహుల్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ కె.నాగేష్, ఆరోగ్య విద్యా విస్తరణ అధికారులు, స్థానిక వైద్య సిబ్బందితో కలిసి పలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తమకు అనుమతించబడిన పరిధిని దాటి వైద్య సేవలు అందిస్తున్నట్లు గుర్తించిన ఐదు ప్రథమ చికిత్స కేంద్రాలను అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.రాహుల్ మాట్లాడుతూ ప్రథమ చికిత్స కేంద్రాల పేరుతో అర్హత లేని వ్యక్తులు వైద్యులుగా వ్యవహరించడం,రోగులకు వ్యాధి నిర్ధారణ చేయడం, ప్రిస్క్రిప్షన్లు రాయడం,అనుమతి లేని ఇంజెక్షన్లు ఇవ్వడం, ఆసుపత్రి స్థాయి వైద్య సేవలు అందించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే విధంగా అర్హతకు మించి వైద్యం అందించే వారిపై సంబంధిత చట్టాలు, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో స్థానిక వైద్యాధికారి డాక్టర్ కె. అరవింద్, డాక్టర్ రమ్య తదితరులు పాల్గొన్నారు.

**కంగుతిన్న మెడికల్ మాఫియా :** మండల కేంద్రంలోని ఐదు మెడికల్ షాపులపై జిల్లా వైద్యాధికారి ఏకకాలంలో మెరుపు దాడి చేయడంతో మండల కేంద్రాల్లోనూ,మండల పరిధి గ్రామాల్లో కొనసాగుతున్న మెడికల్ మాఫియా కంగుతింది. సీజనల్ వ్యాధులను ఆసరా చేసుకుని రోగులను భయభ్రాంతులకు గురిచేస్తూ డబ్బులు గుంజుతూ ప్రజల ఆరోగ్యం,ఆస్తులతో చెలగాటమాడుతున్న మెడికల్ ఏజెన్సీలు, గ్రామీణ వైద్యులు ఈ ఘటనతో ఆందోళన చెందుతున్నారు. జిల్లా వైద్యాధికారి మెరుపు దాడి నేపథ్యంలో మెడికల్ మాఫియాపై ప్రజలు ఎక్కడ చూసినా చర్చించుకోవడం గమనార్హం.

## 'పోలీస్ ఫ్లాగ్ డే' సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలు : ఎస్‌పి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం అక్టోబర్ 21వ తేదీ పోలీస్ ఫ్లాగ్ డేను పురస్కరించుకొని సూర్యాపేట జిల్లాలోని ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు, షార్ట్‌ఫిల్మ్‌లు తీసేవారి కోసం తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌పి కె.నరసింహ తెలిపారు. ఈ పోటీల్లో పోలీసుల విధులు, ప్రజలకు అందిస్తున్న సేవలకు సంబంధించిన అంశాలపై 2025 అక్టోబర్ నెల నుంచి 2026 అక్టోబర్ నెల వరకు తీసిన 3 ఫోటోలు, అలాగే 3 నిమిషాల నిడివి మించని షార్ట్‌ఫిల్మ్‌లను ఈనెల 25వ తేదీలోపు పోటీలకు పంపించాల్సి ఉంటుందన్నారు. జిల్లాస్థాయిలో అందిన ఎంట్రీల నుంచి ఉత్తమ మూడు షార్ట్ ఫిల్మ్‌లు, మూడు ఫోటోలను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన వారికి మెరిట్ సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సూర్యాపేట జిల్లాలోని ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు, షార్ట్ ఫిల్మ్‌లు తీసేవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా పోలీస్ శాఖకు సంబంధించిన కార్యక్రమాలు, పోలీసుల సేవలు, విధి నిర్వహణ వంటి అంశాలను ప్రతిబింబించే మంచి ఫోటోలు, షార్ట్‌ఫిల్మ్‌లను పోటీలకు పంపించాలన్నారు. షార్ట్‌ఫిల్మ్‌ను పెన్‌డ్రైవ్‌లో, 10x8 అంగుళాల పరిమాణంలో 3 ఫోటోలను హార్డ్ కాపీలతో పాటు సాఫ్ట్‌కాపీ రూపంలో పెన్‌డ్రైవ్‌లో పొందుపరిచి, ఈనెల 22లోపు జిల్లా పోలీస్ కార్యాలయంలోని పిఆర్‌ఓకు అందజేయాలని సూచించారు. వివరాలకు పిఆర్‌ఓ, సెల్ 8712686059ను సంప్రదించవచ్చన్నారు.

## మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం

● కలెక్టర్ అనురాగ్ జయంతి



ప్రజాపక్షం/యాదాద్రి : మెనూ ప్రకారం, విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్నం భోజనాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. మంగళవారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని బీచ్ మొహల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజన నాణ్యత, పరిశుభ్రతపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఎన్ని స్కూల్ యూనిఫాం దుస్తులు అందజేశారనే వివరాలను పాఠశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని టాయిలెట్ల పరిశుభ్రతను స్వయంగా పరిశీలించి, విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటిస్తూ వారి చదువుపై ఆరా తీశారు. మీకు ఇష్టమైన సబ్జెక్టులు ఏవి? ఉపాధ్యాయులు పాఠాలను ఎలా బోధిస్తున్నారు? భవిష్యత్తులో ఏం సాధించాలనుకుంటున్నారు? వంటి ప్రశ్నలు అడిగి విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ సూచించారు.పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా సౌకర్యాలు, మౌలిక వసతులు, పారిశుద్ధ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లావిద్యాధికారి బిక్షపతి, శిశు సంక్షేమ అధికారి శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కూటమి అభ్యర్థులను గెలిపించండి



ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం, కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, పెండింగ్ బకాయిల సాధన, కార్మిక సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతున్న ఐక్య కూటమి ఎంప్లాయిస్ యూనియన్, టిఎంయూ, ఎన్‌ఎంయు అభ్యర్థులను గెలిపించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి బోలగాని సత్యనారాయణ ఎండి ఇమ్రాన్ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏఐటీయూసీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు బోలగాని సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ ఆధ్వర్యంలో భువనగిరి ఆర్టీసీ బస్టాండ్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులను కలిసి ఎన్నికల నేపథ్యంలో వారి సమస్యలు, సంఘాల కార్యాచరణ, భవిష్యత్ డిమాండ్లపై నాయకులు వివరించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వాటి పరిష్కారం కోసం సంఘాల ద్వారా నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందని బోలగాని సత్యనారాయణ, ఎండీ ఇమ్రాన్ పేర్కొన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మంగ, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు గనబోయిన వెంకటేష్, జిల్లా కోశాధికారి సామల శోభన్ బాబు, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వడ్డేబోయిన సంతోష, రమేష్, తిరుపతి రెడ్డి, కృష్ణ, రాములు, స్వామి పాల్గొన్నారు.

## బుల్లెట్ రైల్‌ను ప్రభుత్వం అడ్డుకుంది

● మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సూర్యాపేటకు బుల్లెట్ రైలు స్టేషన్‌ను మంజూరు చేసినప్పటికి, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా అలైన్‌మెంట్‌ను మారుస్తూ పంపిన ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, బిజెపి రాష్ట్ర నాయకులు సంకినేని వెంకటేశ్వర రావు డిమాండ్ చేశారు. బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం 54వ రోజు బిజెపి శ్రేణులు వరుసగా రెండోవ రోజు దీక్షా శిబిరంలో కూర్చున్నారు. దీక్షలో కూర్చున్న నాయకులకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. కేంద్రం ముందుగా రూపొందించిన ఒకటి, రెండు అలైన్‌మెంట్ల ప్రకారం బుల్లెట్ ట్రైన్ మార్గం జాతీయ రహదారి 65కి సమాంతరంగా చౌటుప్పల్, సూర్యాపేట, కోదాడ మీదుగా వెళ్ళాల్సి ఉంది అందుకు సూర్యాపేట స్టేషన్ కూడా మంజూరైందన్నారు. ప్రస్తుత రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా సూర్యాపేటను నిర్వీర్యం చేయడానికి, రూటును మార్చి మూడవ ప్రతిపాదనను (ఫ్యూచర్ సిటి, హాలియా, వాడపల్లి మీదుగా) కేంద్రానికి పంపి సూర్యాపేట ప్రజల నోటికాడి కూడును లాకేసుకున్నారని ధ్వజమెత్తారు. సూర్యాపేటకు ఇప్పటివరకు సరైన రైల్వే కనెక్టివిటి లేదనే విషయాన్ని గుర్తించి కేంద్రప్రభుత్వం ఇక్కడి ప్రజలకు న్యాయం చేస్తూ స్టేషన్ మంజూరు చేసిందన్నారు. బిజెపి మండల పార్టీ అధ్యక్షులు అలుగుబెల్లి సైదిరెడ్డి, పెన్‌పహాడ్ మండల అధ్యక్షులు తాళ్లపల్లి మధు, సర్పంచ్ సుందరి రామారావు, ఉపసర్పంచ్‌లు, మండలాల ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు కూర్పోగా మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లమల్ల నరసింహ, మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎండి అబీద్, కర్నాటి కిషన్, ట్రైన్ సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు.

## ప్రతీ బుక్ డిజిటలైజేషన్ కావాలి

కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**ప్రజాపక్షం/హనుమకొండ :** పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ యువతి యువకులకు సాధారణ పాఠకులకు మెరుగైన వసతులు కల్పించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. మంగళవారం స్థానిక సెంట్రల్ లైబ్రరీ ని కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సందర్శించారు. ఈ సందర్భంగా పూర్తి అయిన రీడింగ్ హాల్ పనులను కలెక్టర్ పరిశీలించి... అందులో కావాలిసిన మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లైబ్రరీ లో ఉన్న పుస్తకాల నిర్వహణ ని, ఇంటర్ నెట్ సెక్షన్ ని అలాగే మిషన్ ద్వారా పుస్తకాలను తీసుకునే విధానాన్ని, లైబ్రరీ పరిసరాలను పరిశీలించారు. అలాగే పుస్తకాల నిర్వహణ సరిగ్గా ఉండాలని, ఏ పుస్తకం ఎక్కడ ఉందో స్పష్టంగా తెలియాలన్నారు.ప్రతీ పుస్తకాన్ని డిజిటలైజేషన్ చేయాలన్నారు.లైబ్రరీ ప్రాంగణాలను, పుస్తకాల అల్మారాలను నిరంతరం శుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం డైట్ కాలేజ్ ఆవరణలో నిర్మాణం చేపట్టిన యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ పనులను కలెక్టర్ పరిశీలించారు.. సంబంధిత అధికారులకు పలు సూచనలను తెలియజేశారు. లైబ్రరీ సెక్రటరీ సరితా, తెలంగాణ విద్య మరియు సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ డీఈ, ఏఈ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ నాయకులు



**ప్రజాపక్షం/దేవరుప్పుల:** మండలంలోని ధర్మగడ్డ తండాలో బీఆర్ఎస్‌కు చెందిన వార్డు సభ్యులు, పలువురు నాయకులు ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు, సర్పంచ్ (అభ్యర్థి)మూడ చందన దేవేందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమంతోపాటు గ్రామాలు, తండాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అందుకే ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో వార్డు సభ్యులు భూక్య బిక్కి, శ్రీనివాస్, మహేష్, మనోజ్, తదితరులున్నారు.ఉప సర్పంచ్ సురేష్, నాయకులు యాదగిరి, బలయ్య, లక్ష్మణ్, జగురామ్, వెంకన్న, పాల్గొన్నారు.

## ఎఎస్ఐగా దయాసాగర్‌కు పదోన్నతి



**ప్రజాపక్షం/ములుగు:** ములుగు పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న కె దయాసాగర్ ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ ఐపిఎస్ ఆయనకు ఏఎస్ఐ ర్యాంక్ అలంకరించి అభినందించారు. 1990 కానిస్టేబుల్ బ్యాచ్‌కు చెందిన దయాసాగర్ ఆదిలాబాద్ కానిస్టేబుల్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారు. అనంతరం బెల్లంపల్లిలో హెడ్ కానిస్టేబుల్‌గా, జిఆర్‌పి విభాగంలో విధులు నిర్వర్తించారు. ఐదేళ్లపై ములుగు చేరి ప్రస్తుతం ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ నలువాల రవీందర్, ఎసిబి బుట్ట చంద్రశేఖర్, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షుడు క్రాంతికుమార్, తదితరులు పాల్గొని దయాసాగర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## రైతుల భూములకు పట్టాలు అందించాలి



**ప్రజాపక్షం/ఖానాపురం:** ఖానాపురం మండలంలోని ధర్మారావుపేట, మంగళవారిపేట, బుధరావుపేట గ్రామాల్లోని రెవెన్యూ భూములకు సంబంధించి అర్హులైన రైతులకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో పిఏసిఎస్ చైర్మన్ వల్లె శ్రీనివాస్ యాదవ్ నర్సంపేట ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. రైతుల భూ సమస్యలను పరిష్కరించి, అర్హులైన వారికి పట్టాలు అందజేసే చర్యలు తీసుకోవాలని ఆర్డీఓను కోరారు. గ్రామ పార్టీ అధ్యక్షులు ముదురు కుమారస్వామి, బొమ్మగాని నవీన్, నునావత్ మోహన్, డీ వేందర్, మాజీ ఎంపిటిసి మూడు పుల్సింగ్, ఉప సర్పంచ్ కొంకటి రాజు, బాషబోయిన రాజు, మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి పులిగిల్ల నాగరాజు యాదవ్‌తో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## తక్షణ చర్యలతో బస్టాండ్ నిర్మాణం

ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డికి కాంగ్రెస్ నాయకుల వినతి

**ప్రజాపక్షం/కాటారం:** కాటారం మండలకేంద్రంలో దశాబ్దకాలంగా కోర్టు పరిధిలో ఉన్న బస్‌స్టేషన్ స్థల సమస్యను పరిష్కరించి నూతన బస్ స్టేషన్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని జయశంకర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వంతకాని సమ్మయ్య కోరారు ఈ మేరకు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సిఫార్సు లేఖతో హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎండి నాగిరెడ్డి ఐపిఎస్‌ను కలిసి వినతిని అందించారు. కోర్టు పరిధిలో ఉన్న బస్టాండ్ సమస్యను పరిష్కరించి నూతన బస్టాండ్ ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ఇందుకోసం రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు బస్టాండ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కోసం బస్టాండ్ నిర్మాణం అవసరమని తెలిపారు.ఆర్టీసీ అధికారులు సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.బస్‌స్టేషన్ నిర్మాణానికి అధికారులు కృషి చేస్తున్న వారికి ప్రజా సంఘాలు,మేధావులు,ప్రజలు ఐక్యంగా స్పందించాలని పిలుపునిచ్చారు.ప్రజాపాలన ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవాలని వ్యవహరించకుండా ప్రధాన ప్రతిపక్ష నాయకులు తమ వైఖరిని మార్చుకుని అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు.నాయకులు ఆత్మకూరి కుమార్,వెనగంటి శశిధర్ రెడ్డి,పాల్గొన్నారు.



# వరద ముంపునకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

● రూ.2.52 కోట్లతో అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన ● అంబేద్కర్ జంక్షన్ నుంచి వడ్డేపల్లి చర్చి వరకూ రూ.18 కోట్లతో రోడ్డు విస్తరణ ● ప్రజల సహకారంతో అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా 57వ డివిజన్‌లోని సమ్మయ్యనగర్, గోకుల్‌నగర్ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. డివిజన్‌లో సుమారు రూ.2.52 కోట్ల నిధులతో అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.అభివృద్ధి పనులను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే ప్రారంభించి, నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా గోకుల్‌నగర్, సమ్మయ్యనగర్‌తో పాటు పరిసర కాలనీల్లో వర్షాకాలంలో ఏర్పడుతున్న వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడమే లక్ష్యంగా డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు.అంబేద్కర్ విగ్రహం వైపు నుంచి వచ్చే వర్షపు నీరు, సుబేదారి పోలీస్ స్టేషన్ వైపు నుంచి వచ్చే నీరు గోకుల్‌నగర్ చౌరస్తా వద్ద కలిసిపోవడంతో ప్రతి వర్షాకాలంలో గోకుల్‌నగర్‌తో పాటు పరిసర కాలనీలు నీట మునిగే పరిస్థితి ఏర్పడుతోందని ఎమ్మెల్యే వివరించారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు సమగ్ర డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన రోడ్లు, సైడ్ డ్రైనేజీ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.అదేవిధంగా అంబేద్కర్ విగ్రహం నుంచి వడ్డేపల్లి చర్చి వరకు రోడ్డు విస్తరణ కోసం సుమారు రూ.18 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. డ్రైనేజీ పనులకు సంబంధించి కొందరు వ్యక్తిగత సమస్యలను ముందుకు తీసుకువచ్చి అభివృద్ధి పనులను అడ్డుకోవడం సరికాదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. వ్యక్తిగత సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటికి పరిష్కారం చూపేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. అయితే ప్రజలందరికీ ఉపయోగపడే అభివృద్ధి పనులను అడ్డుకునే విధంగా వ్యవహరించవద్దని కోరారు.ఎన్నో ఏళ్లుగా గోకుల్‌నగర్, సమ్మయ్యనగర్, పరిసర కాలనీల ప్రజలు వర్షాకాలంలో వరదలతో ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పుడు ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే అవకాశం వచ్చిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పనులకు సహకరించాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.రోడ్లు, డ్రైనేజీ, రోడ్డు విస్తరణ, చౌరస్తాల సుందరీకరణ పనులను సమన్వయంతో పూర్తి చేసి 57వ డివిజన్‌ను మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత ఈ ప్రాంత ప్రజలకు వరద ముంపు సమస్య నుంచి శాశ్వత ఉపశమనం లభించడంతో పాటు మెరుగైన రహదారి, డ్రైనేజీ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు.ఎమ్మెల్యే డివిజన్ ఇంచార్జ్ శ్రీనివాస్ రావు,జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్,డివిజన్ అధ్యక్షులు అశోక్ రెడ్డి ఆయా కాలనీల ప్రజలు, అధికారులు ఉన్నారు.

## లే అవుట్ నిర్మాణ డిజైన్లను త్వరగా సిద్ధం చేయాలి

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

ప్రజాపక్షం/హనుమకొండ : హనుమకొండ జిల్లా దామెర మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న పరకాల ఇందిరా మహిళా డెయిరీ ప్లాంట్ లే అవుట్, నిర్మాణ డిజైన్లను త్వరగా సిద్ధం చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో దామెర మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న పరకాల ఇందిరా మహిళా డెయిరీ లేఅవుట్, డిజైన్ పై హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయితో కలిసి వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సమావేశం నిర్వహించారు.ఇందులో భాగంగా దామెరలో ఏర్పాటు చేస్తున్న డెయిరీ ప్లాంట్ యొక్క సివిల్ వర్క్స్, లేఅవుట్ ప్లాన్ , బీఎంసీయూల కొనుగోలు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.పాల డెయిరీ భవన నిర్మాణ డిజైన్ లను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా సంగెం మండలంలో ఏర్పాటు చేయనున్న బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ల (బిఎంసియు)కొనుగోలు ప్రక్రియను జిల్లా స్థాయి కమిటీ ద్వారా తుది నిర్ణయం తీసుకున్న సంస్థల నుంచి వెంటనే పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. డిఆర్డిఓ మేన శ్రీను, పంచాయతీరాజ్ ఈఈ రాజగోపాల్ రావు, ఆరిజిన్ కన్సల్టెంట్ ప్రతినిధి వైవియన్ రెడ్డి, అదనపు డిఆర్డిఓ వెంకటేశ్వర్లు, డిపిఎం సరిత ఏపీఎం దివాకర్ రాయి పరకాల ఇందిరా మహిళా డెయిరీ మేనేజర్లు కృష్ణ, సృజన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రసూతి ఆసుపత్రిలో నాణ్యమైన వైద్య సేవలందించాలి

కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.మంగళవారం హనుమకొండ లోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి (గవర్నమెంట్ మెటర్నిటీ హాస్పిటల్ )లోని వివిధ విభాగాల్లో విస్తృత తనిఖీలు చేసి గర్భిణీలు, బాలింతలు, మహిళలకు అందిస్తున్న వైద్య సేవలు, ఆసుపత్రిలోని వసతులను కలెక్టర్ పరిశీలించారు. వైద్య సేవల నిమిత్తం అక్కడికి వచ్చిన గర్భిణీ, బాలింతలతో కలెక్టర్ మాట్లాడి అందుతున్న వైద్య సేవలపైన అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని ఓపీ సేవలు, ఆరోగ్య మహిళా క్లినిక్, ఫెర్టిలిటీ క్లినిక్, ల్యాబొరేటరీ, గైనకాలజీ ఓపీ, స్కానింగ్ గది, స్టోర్ రూమ్, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్‌లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఓపీ రిజిస్టర్లు, ల్యాబ్ రికార్డులను తనిఖీ చేశారు. ఓపీ వివరాలను ఆన్ లైన్ చేస్తున్నారా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌లో నిర్వహిస్తున్న పరీక్షలు, గర్భిణులకు సంబంధించిన వివిధ పరీక్షల వివరాలు, నమూనాల సేకరణ విధానం, టెస్ట్ రిపోర్ట్ అందించే సమయం గురించి వైద్యులు, సిబ్బందిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గైనకాలజీ ఓపీకి వచ్చే రోగుల సంఖ్య, ఎంతమంది వైద్యుల అందుబాటులో ఉంటున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్కానింగ్ రూమ్‌లో పరికరాల పనితీరు, టెస్ట్ రిపోర్ట్స్ ఇచ్చే విధానాన్ని పరిశీలించారు.లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్లలో ఉన్న ఏర్పాట్లు, శుభ్రత, పరికరాల నిర్వహణపై ఆరా తీశారు. స్టోర్ రూమ్‌లో మందుల నిల్వలు, వైద్య పరికరాలు, శస్త్రచికిత్స సామగ్రి, వినియోగ వస్తువుల నిల్వలను పరిశీలించారు. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి వైద్య సేవల నిమిత్తం వచ్చే గర్భిణులు, బాలింతలు ఎక్కువసేపు వేచి ఉండకుండా ఆరోగ్య పరీక్షల రిపోర్ట్ లను వీలైనంత త్వరగా అందించాలని సూచించారు. ల్యాబ్‌లో నిర్వహిస్తున్న అన్ని పరీక్షల రిపోర్టులను జాప్యం లేకుండా ఇవ్వాలన్నారు. ప్రసూతి, వైద్య సేవల్లో ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రిలోని వార్డులు, ఓపీ ప్రాంగణం, ల్యాబ్, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్, ఆసుపత్రి ఆవరణ నిరంతరం పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, డ్యూటీ డాక్టర్లు కలెక్టర్ కి ఆసుపత్రి వివరాలను అలాగే అందిస్తున్న వైద్య సేవల గురించి కలెక్టర్ వివరించారు.

## ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ఠ ఏర్పాట్లు

మాజీ మంత్రి,ఎమ్మెల్యే కొండా సురేఖ



**ప్రజాపక్షం/వరంగల్ :** దసరా, సద్దుల బతుకమ్మ ఉత్సవాల ఏర్పాట్లలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ అన్నారు. రంగలీల మైదానం, ఉర్సు గుట్ట, కరీమాబాద్, ఉర్సు ప్రాంతంలో నిర్వహించనున్న దసరా ఉత్సవాలు, రావణ వధ కార్యక్రమం, సద్దుల బతుకమ్మ పండగ ఏర్పాట్లపై మాజీ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. దస రా, సద్దుల బతుకమ్మ పండగలకు పెద్ద సంఖ్యలో ప్రజలు, మహిళలు, భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని కొండా సురేఖ సూచించారు. ఉత్సవ ప్రాంగణంలో నిరంతర తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ, వైద్య సదుపాయాలు, అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. ప్రజల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, ప్రవేశనిష్క్రమణ మార్గాలు, అత్యవసర మార్గాలు ముందుగానే గుర్తించి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని పోలీస్ శాఖను ఆదేశించారు. ప్రజల భద్రతే మొదటి ప్రాధాన్యతగా అధికారులు పనిచేయాలని, ఏ చిన్న లోపం కూడా పండగ సమయంలో ప్రజలకు ఇబ్బందిగా మారకుండా ముందుగానే గుర్తించి పరిష్కరించాలని కొండా సురేఖ స్పష్టం చేశారు. కార్యక్రమాల నిర్వహణ పూర్తయ్యే వరకు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి పరిస్థితులనుపర్యవేక్షించాలని ఆదేశించారు. దసరా, సద్దుల బతుకమ్మ ఉత్సవాలను ప్రజలందరూ ఆనందంగా, ప్రశాంతంగా, సురక్షితంగా జరుపుకునేలా ఎటువంటి లోటుపాట్లకు అవకాశం లేకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సత్య శారద, పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, మున్సిపల్ కమిషనర్ టి. వెంకన్న, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్, ఉత్సవ కమిటీ సభ్యులు, నాగపురి సంజయ్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు..

## వేగవంతంగా భూముల రీ-సర్వే

అదనపు కలెక్టర్ రవి

**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :** భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయిలో సర్వేను మరింత ముమ్మరం చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి సర్వేయర్లు, అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం కోతుల నడుమ, హనుమకొండ మండలం పలివేల్పులలో కొనసాగుతున్న భూ రీసర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సర్వే పనుల పురోగతి, ఇప్పటివరకు పూర్తయిన భూముల కొలతలు, క్షేత్రస్థాయిలోని వివిధ అంశాలను గురించి సర్వేయర్లు, అధికారులను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ 70 ఎకరాల కొలత లక్ష్యంగా నిర్దేశించుకుని భూముల కొలతలను సర్వేయర్లు పూర్తి చేయాలన్నారు. భూముల రీ సర్వేలో భాగంగా రెండు రోవర్లను వినియోగిస్తూ సర్వే పనులను వేగవంతం చేయాలని సూచించారు. సర్వే బృందాలు ఉదయం 9 గంటలలోపే క్షేత్రస్థాయికి చేరుకుని రోజువారీ లక్ష్యాన్ని పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. గడువులోగా రీసర్వే ప్రక్రియను పూర్తి చేసేలా అధికారులు, సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, భూముల కొలతల శాఖ ఏడీ నూర్ సింగ్, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఎల్కతుర్తి నాయబ్ తహసీల్దార్ రమేశ్, సర్వేయర్లు, ఆర్ఐలు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసుల్లో.. దర్యాప్తు వేగం పెంచాలి

భూపాలపల్లి ఎస్పి సిరిశెట్టి సంకీర్త్



**ప్రజాపక్షం/రేగొండ:** మండల స్థాయిలో ఉన్న పెండింగ్ కేసుల దర్యాప్తులను వేగవంతం చేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పి సిరిశెట్టి సంకీర్త్ ఐపిఎస్ అన్నారు. మంగళవారం కొత్తపల్లి గోరీ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. స్థానిక ఎస్ఐ తిలోక్‌నాథ్ రెడ్డి సమక్షంలో పోలీస్‌స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి, స్టేషన్ నిర్వహణ, సిబ్బంది వివరాల నిర్వహణ, కేసుల దర్యాప్తు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పోలీస్‌స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు, కేసు డైరీలు, స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలు, దర్యాప్తు పురోగతి, ఆన్‌లైన్ క్రైమ్ రికార్డుల నిర్వహణ, సిసిటిఎన్ఎస్ తదితర అంశాలను ఎస్పి క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల నమోదు దర్యాప్తు, డిజిటల్ రికార్డుల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు సిబ్బంది వివరాలను తెలుసుకుని, ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని సూచించారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ, వారి సమస్యలను సమయపాలనతో పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, మహిళలు, పిల్లలు, బలహీన వర్గాలు, భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు సిబ్బంది ఎస్పికి స్టేషన్‌లో చేపడుతున్న విధుల నిర్వహణ, శాంతిభద్రతల పరిస్థితి ఇతర అంశాలపై వివరాలు అందించారు. ఎస్పి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందిస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమర్థవంతమైన పోలిసింగ్ అందించాలని తెలిపారు.

## ఇంగ్లీష్ సబ్జెక్టుపై విద్యార్థులను తీర్చిదిద్దాలి

కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** ఇంగ్లీష్ సబ్జెక్టు పై ప్రావీణ్యత వచ్చే విధంగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. తొర్రూరు మండల కేంద్రంలో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుచున్న మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్లో మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు, ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతూ వారికి అందిస్తున్న సౌకర్యాలు విద్య బోధనలు, డైట్ మెనూ, యూనిఫామ్, నోట్ బుక్స్, తదితర అంశాలపై వివరంగా అడిగి తెలుసుకున్నారు, ప్రతి క్లాస్ రూమ్ తిరుగుతూ విద్య బోధనలను పరిశీలించారు.స్టోర్ గదిని పరిశీలించి నిత్యావసర వస్తువుల యొక్క నాణ్యత, గడువు తేదీలను పరిశీలించారు, స్టోర్ రిజిస్టర్‌ను చెక్ చేశారు, ప్రభుత్వం కల్పిస్తున్న పక్క డైట్ మెనూ ఖచ్చితంగా అమలు చేయాలని నాణ్యమైన ఆహార పదార్థాలతో వేడివేడి ఆహారాన్ని అందించాలని, వంట సిద్ధం చేసే సిబ్బందికి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని, తగిన జాగ్రత్తలు పాటిస్తూ వంట లు సిద్ధం చేయాలన్నారు, కిచెన్ షెడ్యూలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తరగతి గదులలో నిరంతరం విద్యుత్, స్వచ్ఛమైన త్రాగునీరు అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. పిల్లలకు ఆరోగ్య సమస్యలు రాకుండా ముందస్తుగా వారిని గమనిస్తూ ఉండాలన్నారు. నూతన విద్యా విధానం టెక్నాలజీ డిజిటల్ తరగతులు నిర్వహించి అత్యుత్తమ ఫలితాలను సాధించడం కోసం కృషి చేయాలని తెలిపారు, ప్రతి సబ్జెక్టు తోపాటు ఇంగ్లీష్ సబ్జెక్టుపై ప్రావీణ్యత వచ్చే విధంగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు.

## ‘సర్’ ఫేజ్–2లో పరకాల నియోజకవర్గం రాష్ట్రంలోనే ప్రథమ స్థానం

ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**ప్రజాపక్షం/పరకాల :** ఎస్ఐఆర్ ఫేజ్–2లో పరకాల నియోజకవర్గం రాష్ట్రంలోనే ప్రథమ స్థానం స్థానంలో ఉందని, ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతానికి కృషి చేసిన బీఎల్‌ఏలు, బీఎల్ఓలకు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుచున్నానని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ భవన్ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల నియోజకవర్గ ముఖ్య నాయకులతో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ఫేస్2 ప్రక్రియలో పరకాల నియోజకవర్గంలో ఓటర్ జాబితా ప్రక్షాళన కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్నామని అన్నారు. ఇందుకు సహకరించిన బిఎల్ఏ లు, బిఎల్ఓ లు, క్లస్టర్ ఇంచార్జిలు, మా మండల, పట్టణ, డివిజన్ అధ్యక్షులకు, కౌన్సిలర్లు, సర్పంచులు, గ్రామ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఎస్ఐఆర్ ఫేజ్ 1 ప్రక్రియలో రాష్ట్రంలో 2వ స్థానం సాధించామన్నారు. మీ కృషివల్లే పరకాల నియోజకవర్గంలో 41 వేలు 945 నోటీసులను పరిష్కారం చేసి, అర్హులను కాపాడగలిగామన్నారు. ప్రతి ఓటును కాపాడుకోవడం ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడమేనని, ఓటు హక్కు లేని వారిని గుర్తించి కొత్త ఓటర్గా నమోదు చేసేలా ప్రోత్సహించాలన్నారు. వరంగల్, నల్గొండ, ఖమ్మం ఎమ్మెల్సీ ఎన్నికలకు గ్రాడ్యుయేట్స్ ఓటర్ల నమోదు కార్యక్రమం చేపట్టుటపై చర్చించారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి గారిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు.2024 ఎమ్మెల్సీ ఎన్నికల్లో పరకాల నియోజకవర్గం లో 14,822 ఓట్లు ఉన్నాయన్నారు. పరకాల టౌన్, గీసుకొండ, సంగెం మండల కేంద్రాలలో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కేంద్రాన్ని ప్రారంభించాలని తెలిపారు. గ్రామ, వార్డు స్థాయి పార్టీ పూర్తి కమిటీల నియామకం, ఫ్రంటల్ ఆర్గనైజేషన్ ఎన్నికల తీరుపై చర్చించారు.

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
బుధవారం
07-10-2026
www.prajapaksham.in

రాజ్యాంగాన్ని ధిక్కరిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించారు.


యాదాద్రి...

# సిఇసి జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాలి

## 'సర్' రద్దు చేయాలని జిల్లా కలెక్టరేట్‌ల ఎదుట ఇండియా కూటమి ధర్నాలు

**జిల్లాల నుంచి ప్రజాపక్షం ప్రతినిధులు**

**పెద్దపల్లి :** ఎస్ఐఆర్‌ను రద్దు చేసి, కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను బర్తరఫ్ చేయాలని మంగళవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్, న్యూ డెమోక్రసీ, మాస్ లైన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, సిపిఎం నాయకులు బిక్షపతి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లాకార్యదర్శి కె.రాజన్న, మాస్‌లైన్ జిల్లా నాయకులు గుమ్మడి వెంకన్న, సిపిఐ రాష్ట్ర నాయకులు గౌతమ్ గోవర్ధన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.కనకరాజ్, స్వామి, లెనిన్, మానస్, పట్టణ కార్యదర్శి కల్లేపల్లి నవీన్, పద్మ, శంకరన్న, రాధా, నరేష్, రాజేష్, తోకల రమేష్, అశోక్, సిపెల్లి రవీందర్, జి.జ్యోతి, గుమ్మడి కొమరయ్య పాల్గొన్నారు.

**నాగర్‌కర్నూల్ :** కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ గుప్తాను తొలగించే వరకు ఉద్యమం ఆగదని సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు ఎస్ఎండి. ఫయాజ్, బి.పర్వతాలు అన్నారు. ఎన్నిక కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ గుప్తాను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఎంల ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ ముట్టడి, ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కేశవులు గౌడ్, నాయకులు మారేడు శివశంకర్, తుమ్మల శివుడు, బిజ్జా శ్రీనివాసులు, బండి లక్ష్మీపతి, కృష్ణజీ, టి.కిరణ్‌కుమార్, వి.రవీందర్, పి.పరుశురాం, ఖుదబాద్దీన్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు టి.మల్లేష్. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ప్రేమ్ కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మధుగౌడ్, శివకృష్ణ, ఎండి.యూసుఫ్, కొత్త రామస్వామి, పర్వతాలు, రామకృష్ణ, రాధాకృష్ణ, రామయ్య, ఆంజనేయులు, తారాసింగ్, సైదులు, అశోక్, భీమ్‌రాజ్, శివరాం, కురుమయ్య, సిపిఎం నాయకులు ఆర్.శ్రీను, గీత పాల్గొన్నారు.

**మహబూబాబాద్ :** ఎన్నికల కమీషనర్ జ్ఞానేశ కుమార్‌ను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం,, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మాస్‌లైన్ వామపక్షాల ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, మహాధర్నా నిర్వహించారు. సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి బి.అజయ్‌సారథిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతి, సిపిఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, మండల వెంకన్న, చిన్న చంద్రన్న, సాయిలు మాట్లాడారు. కార్యక్రమంలో సూర్నపు సోమయ్య, పెరుగు కుమార్, బెల్లంకొండ శ్రీనివాస్, నందగిరి వెంకటేశ్వర్లు, కొత్తపల్లి రవి, లింగ్య నాయక్,రేషపల్లి నవీన్, భానోత్ సీతారాం,చింతకుంట్ల వెంకన్న, సమ్మెట రాజమౌళి, ప్రసాద్ నాయక్, ఆకుల రాజు, మామిళ్ల సాంబలక్ష్మి, అన్ని పార్టీల కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

**రంగారెడ్డి :** రంగారెడ్డి జిల్లా కొంగర కలాన్‌లోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఇండియా కూటమి పిలుపులో భాగంగా కేంద్ర ఎలక్షన్ కమిషన్ చైర్మన్‌ను బర్తరఫ్ చేయాలని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ భారీ ప్రదర్శన, కలెక్టరేట్ ముందు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ధర్నాలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు పాలమాకుల జంగయ్య, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు పారిజాత నరసింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణ రెడ్డి, సిపిఐ రాష్ట్ర నాయకులు పి.పర్వతాలు, ఎం.యాదిరెడ్డి, ఒ.యాదయ్య, సిపిఎం రాష్ట్ర నాయకులు పి.యాదయ్య, జిల్లాకార్యదర్శి బి.సామెల్, తెలంగాణ జన సమితి నాయకులు పల్లె వినయ్ కుమార్, నారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో టిపిసిసి నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, చేవెళ్ల ఇంచార్జీ భీమ్ భరత్, శేరిలింగంపల్లి ఇంచార్జ్ జగదిశ్వర్‌గౌడ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్ పాల్గొన్నారు.

**కరీంనగర్ :** సిఇసి జ్ఞానేష్ కుమార్ తొలగించాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ వరకు భారీర్యాలీ నిర్వహించి, అనంతరం మోదీ, అమిత్‌షా, జ్ఞానేష్ కుమార్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ధర్నాలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, డిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, వోడితల ప్రణవ్ బాబు, ఊట్కూరు నరేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి, అంబటి జోజి రెడ్డి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్, సిపిఐ ఎంఎల్ (మాస్‌లైన్) జిల్లా కార్యదర్శి జిన్నం ప్రసాద్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, ఎఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హేమంత్ మాట్లాడారు. కార్యక్రమంలో హుజురాబాద్ మునిసిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, ఆకారం భాస్కర్‌రెడ్డి, ఎండి తాజ్, ముత్యం శంకర్‌గౌడ్, సిపిఐ నాయకులు పొనగంటి కేదారి, అందె స్వామి, కొయ్యడ సృజన్ కుమార్, నాగెల్లి లక్ష్మారెడ్డి, గూడెం లక్ష్మి, బోయిని తిరుపతి, పిట్టల సమ్మయ్య, బండ రాజిరెడ్డి, గోవిందుల రవి, చొక్కల్ల శ్రీశైలం, ఉమ్మెంతల రవీందర్ రెడ్డి, గజ్జి అయిలయ్య, పైడిపల్లి రాజు, చాడ శ్రీధర్ రెడ్డి, అందె చిన్న స్వామి, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, మచ్చ రమేష్, బామండ్లపెల్లి యుగేందర్, నలువాల సదానందం, కాంతాల అంజిరెడ్డి, కొట్టె అంజలి, బోయిని వల్లభాయ్ పటేల్, తేరాల సత్యనారాయణ, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు నునావత్ శ్రీనివాస్, పోలోజు రంజిత్, సతీష్‌యాదవ్, బానోతు శ్రావణ్ నాయక్, కొరివి అరుణ్ కుమార్, పులి ఆంజనేయులు గౌడ్, గుడికందుల సత్యం, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, సుంకరి సంపత్, ఎడ్ల రమేష్, గడ్డం విలాస్‌రెడ్డి పాల్గొన్నారు.

**సిద్దిపేట :** కేంద్ర ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌ను తన రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటోందని ఆరోపిస్తూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో సిద్దిపేట జల్లా కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ధర్నాలో సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంకుంటా ఆంక్ష రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే తుంకుంటా నర్సిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపెల్లి చంద్రం, కాంగ్రెస్ నాయకులు తాడూరి శ్రీనివాస్‌గౌడ్, సిపిఐ నాయకులు బట్టు దయానంద రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు జేరిపోతుల జనార్ధన్, కిష్టపురం లక్ష్మణ్, పిల్లి రజిని, నాయకులు శివలింగు కృష్ణ, స్వర్గం రాజేశం, బన్సీలాల్ కర్ణాల చంద్రం, హరిఫ్ పాల్గొన్నారు.

**జనగామ :** ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా జనగామ రైల్వే స్టేషన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో ఎఐసిసి జనరల్ సెక్రటరీ టిపిసిసి ఇంచార్జీ సచిన్ సావంత్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, ఎఐసిసి జనరల్ సెక్రటరీ సచిన్ సావంత్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, నియోజకవర్గ ఇంఛార్జీ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్ మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల జగదీష్ చందర్‌రెడ్డి, కొత్త కరుణాకర్ రెడ్డి, నూకల బాల్‌రెడ్డి, కీసర దిలీప్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్, సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, నాయకులు రాపర్తి రాజు, ఆహాల్య, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లాకార్యదర్శి గుమ్మడి రాజు సాంబయ్య, నాయకులు మేడ శ్రీనివాస్, వేముళ్ల సత్యనారాయణరెడ్డి, బడికె ఇందిర, పిన్నింటి నారాయణరెడ్డి, అంబటి కిషోర్ పాల్గొన్నారు.

**నారాయణపేట్ :** ఇండియా కూటమి పిలుపు మేరకు నారాయణపేట్ జిల్లా కేంద్రంలోని నర్సిరెడ్డి చౌరస్తాలో కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ధర్నాలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.ప్రశాంత్ కుమార్‌రెడ్డి, సిపిఐ నాయకుడు నర్సింహ, సిపిఐ(ఎం) నాయకుడు వెంకట్రాంరెడ్డి, సిపిఐ (ఎంఎల్) నాయకులు హన్మేష్‌చారి, బి.రాము, కాశీనాథ్ మాట్లాడారు.

**యాదాద్రి :** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి పిలుపు మేరకు భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట సిపిఐ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు యానాల దామోదర్‌రెడ్డి, డిసిసి అధ్యక్షులు, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఇండియా కూటమి నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

**సూర్యాపేట :** ఇండియా కూటమి పిలుపు మేరకు సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, టిజెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్, సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్, సిపిఐ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, కాంగ్రెస్‌పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, నాయకులు మేకల శ్రీనివాసరావు, అనంతుల మల్లీశ్వరి, బూర వెంకటేశ్వర్లు, బైరు వెంకన్న గౌడ్, ధనియాకుల శ్రీకాంత్ వర్మ, నరేందర్ నాయుడు, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

**వికారాబాద్ :** జిల్లా కేంద్రంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ధర్నాలో డిసిసి అధ్యక్షుడు జాదవ్ ధారాసింగ్ నాయక్, పరిగి ఎమ్మెల్యే, పిఎసి చైర్మన్ టి.రామ్మోహన్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, సిపిఐ నాయకుడు పీర్ మహమ్మద్, సిపిఎం నాయకుడు మహిపాల్, సిపిఐ(ఎంఎల్) నాయకుడు మహేందర్, టిజెఎస్ నాయకుడు సోమశేఖర్, మాణిక్యం మల్లేష్ యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ అనన్య, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్ పాల్గొన్నారు.

**మేడ్చల్ :** కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి పిలుపు మేరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించి, అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, సిపిఎం జిల్లా కార్యదర్శి పి.సత్యం మాట్లాడారు. సిపిఐ మాస్‌లైన్ నేత సదానందం, టిజెఎస్ నేత లక్ష్మారెడ్డి, ఎస్‌పి నేత రవికుమార్, మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రమాకాంతరెడ్డి, జైపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్, అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీషా పాల్గొన్నారు.


కరీంనగర్...


సూర్యాపేట...


నారాయణపేట్...


నాగర్‌కర్నూల్...


రంగారెడ్డి...


పెద్దపల్లి...


వికారాబాద్...


సిద్దిపేట...


జనగాం...


మహబూబాబాద్...


మేడ్చల్...




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com